
'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 సంచిక: 115

SUNDAY Special

ఆదివారం 16-7-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



తొలి టెస్టులో భారత్ ఘన విజయం..

ఇన్నింగ్స్ 141 పరుగుల తేడాతో చిత్తయిన వెస్టిండీస్. రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు పడగొట్టిన అశ్విన్

- వివరాలు 12లో



వింబుల్డన్ విజేత వొండ్రుసోవా

ఫైనల్‌లో 6-4, 6-4తో అన్స్ జబర్‌ను ఓడించి తొలి గ్రాండ్ స్లామ్ సాధించిన చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి

- వివరాలు 12లో



సొంత కరెన్సీలోనే చెల్లింపులు..

భారత్-యూఏఈలు ఇకపై వాణిజ్య చెల్లింపులను సొంత కరెన్సీలోనే చేపట్టాలని నిర్ణయించుకున్నాయి.

- వివరాలు 6లో



రాఫెల్‌తో 'ఫ్రెంచి పరేడ్'కు పాసు!

రాఫెల్ యుద్ధవిమానాలు కొనేందుకు ఫ్రాన్స్ వెళ్లడం ద్వారా బాస్టిల్ డే కవాతులో పాల్గొనే చాన్స్ మోదీ పొందారని రాహుల్ ఎద్దేవా చేశారు.


- వివరాలు 6లో



నెమ్మదిగా కోలుకుంటున్న ఢిల్లీ

ఎగువ నుంచి యమునా నదికి పోటెత్తిన వరదతో అల్లాడిపోయిన ఢిల్లీ నెమ్మదిగా తెరిపినపడుతోంది.

- వివరాలు 6లో



18న ఎన్డీయే భేటీకి రండి

మిత్రపక్షాలను ఏకతాటిపైకి తేవడంలో భాగంగా 18న ఎన్డీయే కీలక భేటీకి ఆయా పార్టీల అగ్రనేతలను బీజేపీ ఆహ్వానిస్తోంది.

- వివరాలు 6లో

'ఫ్రీ' ఫైట్.. హై వోల్టేజ్

చల్లారని ఉచిత విద్యుత్ మంటలు.. సవాళ్లు, ప్రతి సవాళ్లతో వేడెక్కుతున్న రాజకీయం

- అమెరికాలో రేవంత్ వ్యాఖ్యలతో మొదలైన వివాదం
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం
- 'విద్యుత్'పై రెఫరెండానికి రెడీ అన్న అధికార పక్షం
- సబ్‌స్టేషన్ల వద్దే తేల్చుకుందామన్న విపక్షం



➤ ఉచిత విద్యుత్ మంటలు చల్లారడం లేదు. సవాళ్లు, ప్రతి సవాళ్లతో మరింత రాజుకుంటున్నాయి. ప్రస్తుత రాజకీయమంతా రైతులకు ఉచిత విద్యుత్ చుట్టూనే తిరుగుతోంది. అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలు పరస్పరం విరుచుకుపడుతున్నారు. మాటల యుద్ధం కొనసాగిస్తున్నారు. ఇటీవలి అమెరికా పర్యటనలో రైతులకు ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడం తెలిసిందే. 'ఒక ఎకరానికి నీరు పారించాలంటే గంట చాలు. మూడెకరాలకు ఫుల్లుగా నీరు పారాలంటే మూడు గంటలు... టోటల్‌గా 8 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తే సరిపోతుంది. కేవలం విద్యుత్ సంస్థల దగ్గర కమీషన్లకు కక్కుర్తి పడి వ్యవసాయానికి 24 గంటలనే స్లోగన్ తీసుకొచ్చిండు..' అంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అసెంబ్లీ ఎన్నికల వేళ దీన్ని అందిపుచ్చుకొని.. ఉచిత విద్యుత్ ఎత్తేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందంటూ మండిపడింది. ఆత్మరక్షణలో పడిన ప్రతిపక్ష పార్టీ నష్ట నివారణకు దిగింది. ఉచిత విద్యుత్ ప్రవేశపెట్టిందే తామని, దానికి కట్టుబడి ఉన్నామంటూ కౌంటర్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఉచిత విద్యుత్‌పైనే ఎన్నికలకు వెళదామని, ఎవరు విద్యుత్ ఇచ్చారో, ఇవ్వలేదో ప్రజలే నిర్ణయిస్తారని, రెఫరెండంకు కాంగ్రెస్ సిద్ధం కావాలని మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. దీనిపై రేవంత్‌రెడ్డి కూడా ఘాటుగానే స్పందించారు. అదేదో సబ్‌స్టేషన్ల వద్దే తేల్చుకుందామన్నారు. మరోవైపు ఉచిత విద్యుత్‌పై రేవంత్ వ్యాఖ్యలకు నిరసనగా క్షేత్రస్థాయిలో 10 రోజుల కార్యాచరణకు పిలుపునివ్వడం ద్వారా ఈ అంశాన్ని ఇంతటితో వదలబోమనే సంకేతాలను బీఆర్‌ఎస్ ఇచ్చింది.

3 పంటలా.. 3 గంటలా?



- కాంగ్రెస్‌కు మద్దతిస్తే ఉచిత విద్యుత్ రద్దేనని చెప్పండి
- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- బీఆర్‌ఎస్ నేతలకు కేటీఆర్ సూచన

2లో

కాంగ్రెస్‌ది తొలి నుంచీ ద్రోహపూరిత పాత్రే

- కరెంటుపై ఆ పార్టీ నిజ స్వరూపం రేవంత్ వ్యాఖ్యలతో తేలింది
- కాంగ్రెస్ ఏనాడూ తెలంగాణకు అనుకూలం కాదు
- మంత్రులు నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి ధ్వజం

- 2లో

సబ్‌స్టేషన్ల వద్దే తేల్చుకుందాం



- రచ్చబండ పెట్టి తీర్పు కోరదాం
- ఉచిత విద్యుత్‌పై రేవంత్ ప్రతి సవాల్
- లాగ్‌బుక్‌లు, లైన్ ఆఫ్ కరెంటు రికార్డులు పరిశీలిద్దాం.. 24 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తున్నారో లేదో చూద్దాం
- ఇచ్చిన గ్రామాల్లో మేం ఓట్లు అడగం.. ఇవ్వకపోతే మీరు అడగొద్దు

- 2లో



న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి ప్రపంచ పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం..

- సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించుకుందాం..
- ఐరాస వేదిక నుంచి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పిలుపు
- యువత కోసం 'యువ టూరిజం క్లబ్'లు ఏర్పాటు చేశామని వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రకృతిని కాపాడుకుంటూ పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ పరస్పర సమన్వయంతో.. ముందుకెళ్లినపుడే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకున్న సమయానికి చేరుకోవచ్చని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం ప్రపంచ దేశాలన్నీ ఏకతాటిపైకి వచ్చి పనిచేద్దామని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. పర్యాటక రంగంలో ఆర్థిక ప్రగతి, సామాజిక, పర్యావరణ సుస్థిరత అంశంపై న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రపంచ పర్యాటక సంస్థ (డబ్ల్యూటీవో) ఆధ్వర్యంలో హైలెవల్ పొలిటికల్ ఫోరం (హెచ్‌ఎల్‌పీఎఫ్) వేదికగా జరిగిన సదస్సులో మంత్రి కిషన్‌రెడ్డి కీలకోపన్యాసం చేశారు. ఈ సమావేశంలో భారత్ తరపున పాల్గొనడం గర్వంగా ఉందన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకునే క్రమంలో దశాబ్ద కాలంగా ఆర్థిక, సామాజిక, పర్యావరణ స్థిరత్వమే ప్రధాన ఎజెండాగా

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ప్రజా ప్రభుత్వాన్ని తీసుకొస్తాం..



రాష్ట్ర ప్రజల అవసరాలే ప్రధాన ఎజెండాగా ప్రజాప్రభుత్వాన్ని త్వరలోనే తెస్తామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. తన పాదయాత్ర అనుభవాలను మేనిఫెస్టోలో చేరుస్తామన్నారు.

- వివరాలు 3లో

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి



పెట్టుబడులకు దేశంలోనే తెలంగాణ స్వర్గధామంగా నిలిచిందని, ప్రవాస భారతీయులు సొంత రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు.

- వివరాలు 3లో

సహకార సంఘాల్లో ఔషధాల విక్రయం



వ్యవసాయాధారిత సేవలు అందించే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఇకపై ఔషధాలను కూడా విక్రయించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. చౌకగా లభించే జనరిక్ మందులను అందుబాటులోకి తేనుంది.

- వివరాలు 5లో

'పోడు' పట్టాదారుల్లో అనర్హులు?



పోడుభూముల్లో సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టా పుస్తకాల పంపిణీ ప్రక్రియ దాదాపు పూర్తవగా పట్టాలు పొందిన వారిలో పలువురు అనర్హులు ఉన్నారనే ఫిర్యాదులు ప్రభుత్వానికి వచ్చాయి.

- వివరాలు 13లో



13 లో

భూదాన్ భూముల్లో ఉద్రిక్తత — పోలీసులను అడ్డుకునేందుకు మోహరించిన స్థానికులు



13 లో

రోడ్డుపై రూ. 30 లక్షల విలువైన టమాటా.. — బోల్తాపడిన టమాటా లారీ వద్ద భద్రతగా నిలిచిన పోలీసులు

'మధ్యాహ్న భోజన' కార్మికులకు వేతనాల పెంపు ఈనెల నుంచే..



- విద్యాశాఖ అధికారుల సమావేశంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- 54,201మంది కుక్ కమ్ హెల్పర్లకు చేకూరనున్న ప్రయోజనం
- రాష్ట్ర ప్రభుత్వంపై ఏటా రూ. 108.40 కోట్ల అదనపు భారం
- పాఠశాల విద్యలో అభ్యాసన సంక్షోభ నివారణకు 'తొలిమెట్టు'
- విద్యార్థులకు వారంలోగా ఏకరూప దుస్తులు అందాలి

- 2లో

నీటిపారుదల శాఖకు 5,950 మంది వీఆర్‌ఏలు!

- లష్కర్లుగా నియమించాలని ప్రతిపాదనలు
- రెవెన్యూ శాఖలోనే క్రమబద్ధీకరణ, పే స్కేల్ వర్తింపు
- ఆ తర్వాత వేర్వేరు శాఖల్లో వీఆర్‌ఏల విలీనం
- త్వరలో నిర్ణయం తీసుకోనున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలోని 24 వేల మంది గ్రామ రెవెన్యూ సహాయకు(వీఆర్‌ఏ)ల్లో 5,950 మందిని నీటి పారుదల శాఖలో లష్కర్లుగా నియమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ప్రస్తుతం వీరంతా రెవెన్యూ శాఖలో రూ.10,500 గౌరవ వేతనంపై తాత్కాలిక ఉద్యోగులుగా కొనసాగుతున్నారు. వారి సేవలను అదే శాఖలో క్రమబద్ధీకరించడంతోపాటు కొత్త పేస్కేల్‌ను వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. అనంతరం అవసరాన్ని బట్టి వేర్వేరు శాఖల్లో వారిని విలీనం చేయాలని భావిస్తోంది. రూ.19 వేల మూల వేతనంతో కలిపి

మిగతా 2వ పేజీలో ▶

బీజేపీ 'పరివార' చర్చలు


- నేడు బీజేపీ టిఫిన్ బాక్స్ బైఠక్
- కార్యకర్తల ఐక్యత చాటేలా సహపంక్తి భోజనాలు..
- పార్టీ పటిష్టత, సమన్వయం పెరిగేలా ప్రణాళిక



సాక్షి, హైదరాబాద్: పార్టీ నేతలు, కార్యకర్తలంతా ఒకే పరివారమని చాటేలా, వివిధ అంశాలపై ఆరోగ్యకరమైన చర్చలు జరిగేలా బీజేపీ చేపట్టిన 'టిఫిన్ బాక్స్ బైఠక్' ఆదివారం జరగనుంది. రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించే ఈ 'లంచ్' భేటీలకు కార్యకర్తలు ఎవరికి వారే టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకొని, సహపంక్తి భోజనాలు చేయనున్నారు. ఫొటోలు, వేదిక, బ్యానర్లు, మీడియా, భారీగా భోజనం ఏర్పాట్లు వంటి రాజకీయ హంగు, ఆర్భాటాలేవీ లేకుండా.. పార్టీ నేతలు, కార్యకర్తలు కలుసుకునేలా వీటి నిర్వహణకు ఏర్పాట్లు చేసుకున్నారు. ''ప్రధానంగా దశాబ్దాలుగా దేశ రాజకీయాల్లో ఏర్పడిన కాంగ్రెస్ కల్చర్‌కు, ఏదో ఒక రూపంలో పెద్ద ఎత్తున ఖర్చు చేసే పద్ధతికి చెక్‌పెట్టేలా పార్టీ నాయకులు, కార్యకర్తల సాదర సమావేశాలకు రూపకల్పన

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ జగత్



18న ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట ధర్నా

- సమ్మె మరింత తీవ్రం చేయాలని పంచాయతీ కార్మికుల నిర్ణయం
- 21న కలెక్టరేట్ల ముట్టడి
- ఆ తర్వాత అత్యవసర సేవలు బంద్
- సర్కార్‌ది అప్రజాస్వామిక వైఖరి: జేఏసీ చైర్మన్ పాలడుగు భాస్కర్

సాక్షి, హైదరాబాద్: తమ డిమాండ్ల సాధనకు పది రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది సోమవారం నుంచి తీవ్రం చేయాలని నిర్ణయించారు. ఈ నెల 18 నుంచి ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట ధర్నాలు, 19న మండల కేంద్రాల్లో రాజకీయపార్టీలు, ట్రేడ్ యూనియన్లతో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ (సీఐటీయూ, ఏఐటీయూసీ, టీజీకేటీయూ, ఐఎఫ్‌టీయూలతో కూడిన) శనివారం నిర్ణయించింది. అలాగే 20న సమ్మె పరిష్కరించాలంటూ అన్ని గ్రామ పంచాయతీల్లో తీర్మానాలు చేయాలని, 21న కలెక్టరేట్ల ముట్టడి చేపట్టాలని తీర్మానించింది. ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 21 తర్వాత నీరు, కరెంట్, వీధి దీపాలు సహా అన్ని అత్యవసర సేవలు నిలిపేస్తామని హెచ్చరించింది. డిమాండ్ల సాధన కోసం జేఏసీ ఈనెల 6న ప్రారంభించిన సమ్మె నేటికి పదో రోజుకు చేరనుంది. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీల్లో వివిధ కేటగిరీల్లో 50 వేల మంది పనిచేస్తున్నారు. సిబ్బందిని పర్మినెంట్ చేయడంతోపాటు పీఆర్‌సీలో నిర్ణయించినట్టు రూ.19 వేలు కనీస బేసిక్ పే ఇవ్వాలని, అప్పటిదాకా స్వీపర్లకు రూ.15,600, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, పది రోజులుగా సమ్మె చేస్తున్నా జేఏసీని ప్రభుత్వం చర్చలకు పిలవకపోగా సమ్మెను నీరుగార్చేందుకు పోటీ కార్మికులను నియమించే ప్రయత్నం చేస్తోందని జేఏసీ చైర్మన్ పాలడుగు భాస్కర్ ఆరోపించారు.

కొత్త పీఆర్‌సీ వెంటనే వేయాలి

ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలపై దశలవారీ పోరాటం
- ఈనెల 18,19 తేదీల్లో మండలాల్లో బైక్ ర్యాలీలు
- ఆగస్టు 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు
- సెప్టెంబర్ 1 న చలో హైదరాబాద్ నిర్వహణ
- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ప్రకటన

- వివరాలు 14లో

ట్రాన్స్‌ఫర్స్ టైం.. డిప్యూటీ కలెక్టర్లు, డీఎస్పీలు, మున్సిపల్ కమిషనర్ల బదిలీ 10 లో

క్లుప్తంగా...

సుప్రీంకోర్టులో ఎన్టీపీసీ అధికారులకు ఊరట

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ హైకోర్టు విధించిన రెండు నెలల సాధారణ జైలుశిక్ష నుంచి ఎన్టీపీసీ అధికారులకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. కోర్టు ధిక్కరణ కేసుకు సంబంధించి అధికారులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పక్కన పెడుతున్నట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. 1980 కన్నా ముందు రామగుండం ప్రాంతంలో ఎన్టీపీసీ సంస్థ పలువురు రైతుల నుంచి భూములు సేకరించింది. ఈ మేరకు బాధిత కుటుంబాల సభ్యులకు పరిహారంగా జూనియర్ మజ్దూర్ పోస్టుల్లో నియమించాలని, ఈ ప్రక్రియను రెండునెలల్లో పూర్తి చేయాలని హైకోర్టు 2021లో ఆదేశాలు ఇచ్చింది. అయితే ఈ ఆదేశాలను ఎన్టీపీసీ అధికారులు గడువులోగా పాటించలేదని పలువురు మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఉద్దేశపూర్వకంగానే తమ ఆదేశాలు అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు ఎన్టీపీసీ సీఎండీ, జీఎంలకు రెండునెలల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది. అయితే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ అధికారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

సత్వరం పంచాయతీ భవనాల నిర్మాణం

మంత్రి ఎర్రబెల్లి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణాలను సత్వరం పూర్తి చేయాలని అధికారులను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశించారు. హరితహారం లక్ష్యాలకు అనుగుణంగా గ్రామాల్లో మొక్కలు నాటాలని, దశాబ్ది సంపద వనాలు, హార్టీకల్చర్ ప్లాంటేషన్ల పనుల్లో వేగం పెంచాలని కోరారు. శనివారం సచివాలయం నుంచి జిల్లాల అడిషనల్ కలెక్టర్లు, డీపీవోలు, డీఆర్డీవోలతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీల్లో 6,544 పంచాయతీలకు భవనాలున్నాయని వివరించారు. మిగతా 6,225 పంచాయతీలకు నిర్మిస్తున్న 3,622 భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు.

పంచాయతీ సిబ్బంది సమ్మె విరమణ చర్యలు తీసుకోవాలి

సీఎం కేసీఆర్‌కు సీఐటీయూ బహిరంగ లేఖ

సాక్షి, హైదరాబాద్: గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారానికి జేఏసీ నాయకత్వంతో వెంటనే చర్చించి సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్‌కు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, ప్రధానకార్యదర్శి పాలడుగు భాస్కర్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని 12 వేలకుపైబడిన గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న వేలాది మంది సిబ్బంది ఎస్సీ, ఎస్టీ, ఇతర బలహీన, పేద వర్గాలవారేనని సీఎంకు రాసిన బహిరంగలేఖలో పేర్కొన్నారు.

బీసీ కులగణనపై కేంద్రం నిర్లక్ష్యం: శ్రీనివాస్‌గౌడ్

గన్‌ఫౌండ్రి: కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు.




శనివారం ఇక్కడి రవీంద్రభారతిలో ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'కులగణన, ఓబీసీ సమస్యలు'అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల కులగణనకు సిద్ధంగా ఉందని, ఈ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేసిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వైఎస్సార్సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

23న బ్రాహ్మణ శంఖారావం

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): ఈ నెల 23న హైదరాబాద్‌లో తలపెట్టిన బ్రాహ్మణ శంఖారావాన్ని బ్రాహ్మణులు విజయవంతం చేయాలని దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, జేఏసీ అధ్యక్షుడు కాందూరి కృష్ణమాచారి కోరారు. వారు శనివారం బొగ్గులకుంటలో విలేకరులతో మాట్లాడుతూ హుజురాబాద్‌లోని రాధాస్వామి సత్సంగ్‌లో నిర్వహించే ఈ శంఖారావానికి వేల సంఖ్యలో బ్రాహ్మణులను సమీకరిస్తున్నట్లు తెలిపారు. గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇంధన శాఖ ఓఎస్డీ శ్రీధర్ ఆకస్మిక మృతి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంధనశాఖ కార్యదర్శి వద్ద ఓఎస్డీగా పనిచేస్తున్న టి.శ్రీధర్(60) శనివారం ఆకస్మికంగా మృతిచెందారు. ఛాతీనొప్పితో నగరంలోని ఓ ఆస్పత్రిలో చేరగా, అప్పటికే పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందినట్టు అధికారిక వర్గాలు తెలిపాయి. తెలంగాణ ట్రాన్స్‌కోలో డివిజనల్ ఇంజనీర్(డీఈ) హోదా కలిగిన ఆయన డిప్యుటేషన్‌పై సుదీర్ఘకాలంగా సచివాలయంలోని ఇంధనశాఖలో కొనసాగుతున్నారు.

సబ్‌స్టేషన్ల వద్దే తేల్చుకుందాం

రచ్చబండ పెట్టి ప్రజా క్షేత్రంలో తీర్పు కోరదాం

- ఉచిత విద్యుత్‌పై రేవంత్ ప్రతి సవాల్
- 24 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తున్నారో లేదో చూద్దాం
- ఇచ్చిన గ్రామాల్లో మేం ఓట్లు అడగం.. ఇవ్వకపోతే మీరు అడగొద్దు
- ఈ రెఫరెండానికి రాష్ట్రంలో ఎక్కడైనా కాంగ్రెస్ నేతలు సిద్ధమే



సాక్షి, హైదరాబాద్: ఉచిత విద్యుత్‌పై రాజుకున్న మంటలకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మరింత ఆజ్యం పోశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య సాగుతున్న మాటల యుద్ధానికి శనివారం ఆయన కొత్త ట్విస్ట్ ఇచ్చారు. రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు విసిరిన సవాల్‌ను స్వీకరిస్తూ ఉచిత విద్యుత్‌పై రెఫరెండానికి సిద్ధమని చెపుతూనే మెలిక పెట్టారు. 'రాష్ట్రంలో 3,500 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ప్రతి సబ్‌స్టేషన్ దగ్గర గ్రామ సభలు పెడదాం. ఆయా సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లు, లైన్ ఆఫ్ కరెంటు రికార్డులు పరిశీలిద్దాం. బీఆర్ఎస్ హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్ రైతులకు ఇచ్చి ఉంటే.. అలా ఇచ్చిన సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజలను ఓట్లు అడగం. ఇవ్వలేదని తేలితే బీఆర్ఎస్ వాళ్లు ఓట్లు అడగొద్దు. ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలి. ఈ విధమైన రెఫరెండానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలమంతా సిద్ధంగా ఉన్నాం.'అంటూ ప్రతి సవాల్ చేశారు. బీఆర్ఎస్ నేతలకు దమ్ము, ధైర్యం ఉంటే తన సవాల్‌ను స్వీకరించాలని అన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఇప్పటికే నల్లగొండలో నిరూపించాం..

రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడం లేదని తమ పార్టీకి చెందిన సీనియర్ నేతలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జీవన్‌రెడ్డిలు ఇప్పటికే నిరూపించారని రేవంత్ అన్నారు. నల్లగొండ జిల్లాలోని 350 సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను ఆ జిల్లా ఎస్ఈ దగ్గర సీజ్ చేయించారని చెప్పారు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తాము 2014కు ముందు ఇచ్చిన 9 గంటల విద్యుత్‌నే కొనసాగించారని, అదీ 36 సార్లు కోతలు విధించి ఇచ్చారని విమర్శించారు. 2018 వరకు ఈ తొమ్మిది గంటల కరెంటే కొనసాగిందన్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్దనే రచ్చబండ పెట్టి ప్రజాక్షేత్రంలో తీర్పు అడుగుదామని, దమ్ముంటే ప్రభుత్వాన్ని రద్దు చేసి రెఫరెండానికి సిద్ధం కావాలని రేవంత్ సవాల్ విసిరారు.

చంద్రబాబుతో అంటకాగి కేసీఆర్ మనుగడ సాధించాడు

'అప్పటి టీడీపీ నేత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆర్థిక సహకారంతోనే కేసీఆర్ పార్టీ పెట్టాడు. 2009లో తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకుని, చంద్రబాబుతో అంటకాగి టీడీపీ దయాదాక్షిణ్యాలతో మళ్లీ రాజకీయాల్లో మనుగడ సాధించాడు. మంత్రి హరీశ్ వార్డు మెంబర్‌గా గెలవనప్పుడే కాంగ్రెస్ పార్టీ ఆయనకు మంత్రిగా అవకాశం ఇచ్చింది. ఆ పార్టీల మీద బతికి, పెరిగి వారినే తిట్టే నీచమైన సంస్కృతి కేసీఆర్‌ది. ఇప్పటికైనా ఇలాంటి సంస్కృతిని వదిలి నిజాలు మాట్లాడితే ప్రజలు గౌరవిస్తారు..'

కేసీఆర్ మళ్లీ గజ్వేల్ నుంచే పోటీ చేయాలి..

బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ వెలుగులు విరజిమ్మాయని, కాంగ్రెస్ పాలనలో కారు చీకట్లు కమ్ముకున్నాయని చెపుతున్న బీఆర్ఎస్ నేతలకు దమ్ముంటే రెండు పనులు చేయాలని, అలా చేస్తే తాను వ్యక్తిగతంగా ఏ శిక్షకైనా సిద్ధమేనని రేవంత్ చెప్పారు. సీఎం కేసీఆర్‌కు నిజంగా దమ్ముంటే మళ్లీ గజ్వేల్ నుంచే పోటీ చేయాలని సవాల్ చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి సిట్టింగులుగా ఉన్న ఎమ్మెల్యేలందరికీ మళ్లీ టికెట్లు ఇస్తామని ప్రకటించాలని అన్నారు. గజ్వేల్ కాకుండా ఆలేరు, కామారెడ్డిల్లో పోటీ చేస్తే ఎలా ఉంటుందన్న దానిపై కేసీఆర్ సర్వేలు చేయించుకుంటున్నారని చెప్పారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలను మారిస్తే బీఆర్ఎస్ ఓటమిని ఒప్పుకున్నట్టేనని రేవంత్ వ్యాఖ్యానించారు. 'ఈ రెండేళ్లలో ఎప్పుడైనా కేసీఆర్ నా పేరు తీసిండా? నా కళ్లలోకి చూసిండా? ఆయనకు భయం. దమ్ముంటే కేసీఆర్‌ను బయటకు బయటకు వచ్చి మాట్లాడమనండి..'అంటూ సవాల్ విసిరారు.

అని రేవంత్ వ్యాఖ్యానించారు.

గుత్తా, పోచారంను బర్తరఫ్ చేయాలి..

'స్పీకర్, కౌన్సిల్ చైర్మన్ లాంటి రాజ్యాంగ పదవుల్లో ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రత్యక్ష రాజకీయాలు మాట్లాడవచ్చా? రాజకీయ విమర్శలు చేయవచ్చా?..'అని రేవంత్ ప్రశ్నించారు. గవర్నర్ తక్షణమే వారిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

3 పంటలా.. 3 గంటలా?

కాంగ్రెస్ వ్యాఖ్యలపై ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో చర్చ జరగాలి

- బీఆర్ఎస్ నేతలకు కేటీఆర్ సూచన
- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లండి
- వ్యవసాయం దండగన్న చంద్రబాబు శిష్యుడే రేవంత్
- ఆ పార్టీ వ్యాఖ్యలను ఖండిస్తూ రైతు సమావేశాల్లో తీర్మానాలు చేయాలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 95 శాతం ఉన్న రైతన్నలను అవమానపరిచేలా మూడు గంటల విద్యుత్ సరఫరా చాలు, ఉచిత విద్యుత్ అవసరం లేదన్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు పార్టీ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తే ఉచిత విద్యుత్తు రద్దు చేస్తుందన్న మాటను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. శనివారం ఆయన బీఆర్ఎస్ పార్టీ నాయకులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'టీఆర్ఎస్ పార్టీ ఇచ్చే మూడు పంటలు కావాలాం.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చే మూడు గంటల కరెంటు కావాలా'అన్న నినాదంతో ముందుకు సాగాలంటూ కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. మూడు గంటల కరెంటు చాలు అంటూ కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలపై ప్రతి గ్రామంలో, ప్రతి రైతు ఇంట్లో చర్చ జరిగేలా చూడాలన్నారు.

రేవంత్‌ది కూడా చంద్రబాబు విధానమే..

రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతన్నల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకువచ్చేందుకు రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుంటే.. రైతుల పట్ల, వ్యవసాయ రంగంపై వ్యతిరేకతతో కాంగ్రెస్ పార్టీ ఉచిత విద్యుత్తు అనుచితమంటూ మాట్లాడిందని కేటీఆర్



విమర్శించారు. 2001లో వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు తరహాలోనే ఆయన శిష్యుడు రేవంత్‌రెడ్డి కూడా మాట్లాడారని, ఈ విషయాన్ని రాష్ట్రంలోని ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలని పిలుపు నిచ్చారు. చంద్రబాబు రైతు, వ్యవసాయ వ్యతిరేక ఆలోచన విధానంతోనే రేవంత్ కూడా ఉచిత విద్యుత్తుపై అడ్డగోలుగా మాట్లాడారని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తెలుగు కాంగ్రెస్, చంద్రబాబు కాంగ్రెస్ అన్న విషయాన్ని ప్రజలకు తెలియ జెప్పాలన్నారు. ఉచిత విద్యుత్తు వద్దు – కేవలం మూడు గంటల విద్యుత్ చాలు అంటూ కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రైతాంగ ప్రయోజనాలకు గొడ్డలి పెట్టని, అందుకే తెలంగాణలో రైతులు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా స్పందించారని పేర్కొన్నారు.

17 నుంచి రైతు సమావేశాలు

కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తే ఉచిత విద్యుత్తు రద్దు అవుతుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఈనెల 17వ తేదీ నుంచి పది రోజుల పాటు రాష్ట్రంలోని అన్ని రైతు వేదికల వద్ద రైతు సమావేశాలు నిర్వహించాలని పార్టీ నాయకులకు కేటీఆర్ సూచించారు. ప్రతి రైతు వేదిక వద్ద కనీసం 1,000 మంది రైతులకు తగ్గకుండా ఈ సమావేశాన్ని నిర్వహించాలని, ఈ బాధ్యతను పార్టీ ఎమ్మెల్యేలు తీసుకోవాలని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ఉన్న కరెంటు కష్టాలను, బీఆర్ఎస్ పాలనలో అందుతున్న కరెంటు గురించి రైతులకు వివరించాలని కోరారు. ఉచిత విద్యుత్తుపై చేసిన కాంగ్రెస్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, రైతాంగానికి ఆ పార్టీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలు చేయాలని సూచించారు.

హరీశ్.. మొదటి ఏక్‌నాథ్ షిండే!

- బీఆర్ఎస్‌ను ఎప్పుడో కాంగ్రెస్‌లో విలీనం చేసి ఉండేవాడు: రేవంత్
- ఈసారి బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోతే ఆయన పార్టీలో ఉండడు
- ఈసారి బీఆర్ఎస్‌కు 25 స్థానాలే
- మీడియాతో చిట్‌చాట్‌లో టీపీసీసీ అధ్యక్షుడి వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్: దేశంలో మొట్టమొదటి ఏక్‌నాథ్ షిండే హరీశ్‌రావేనని, వైఎస్ బతికుంటే హరీశ్‌రావు టీఆర్ఎస్‌ను ఎప్పుడో కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసి ఉండేవాడని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పుడైనా బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోతే ఆయన పార్టీలో ఉండరని పేర్కొన్నారు. రేవంత్ శనివారం గాంధీభవన్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠి మాట్లాడారు. ఎవరూ లేకుండా హరీశ్‌రావు ఒక్కడే అప్పటి సీఎం వైఎస్‌ను కలిశారని.. నాటి రచ్చబండ కార్యక్రమం తర్వాత విలీనానికి ముహూర్తం పెట్టుకున్నారని రేవంత్ పేర్కొన్నారు. టీఆర్ఎస్ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకోవడానికి ఇంటెలిజెన్స్‌కు సైతం సమాచారం అందిందని, కానీ ఆగిపోయిందని చెప్పారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 50సీట్లు, ఆలోపు వస్తే హరీశ్‌రావు కేసీఆర్‌తో ఉండడని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌కు 55 సీట్లు వస్తాయని ఆ పార్టీ నేతలే అంచనా వేసుకుంటున్నారని.. తన లెక్క ప్రకారమైతే బీఆర్ఎస్‌కు 25 స్థానాలే వస్తాయని చెప్పారు.

అసైన్డ్ భూములపై క్షేత్రస్థాయి పరిశీలన

రాష్ట్రంలోని అసైన్డ్ భూములను ప్రభుత్వం గుంజుకుంటోందని టీపీసీసీ కిసాన్ సెల్ ఆరోపించింది. వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన జరిపి.. ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని నిర్ణయించింది. శనివారం గాంధీభవన్‌లో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, కిసాన్ సెల్ నేత కోదండరెడ్డి తదితరులు సమావేశమై దీనిపై చర్చించారు.

గాంధీభవన్ మెట్లపై ధర్నాలు చేస్తే సస్పెండే..

ప్రతి చిన్న విషయానికి గాంధీభవన్‌కు వచ్చి గొడవ చేస్తే సహించేది లేదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇక నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు ఎవరైనా గాంధీభవన్ మెట్లపై ధర్నాలకు దిగితే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం పరిధిలోని తుర్కపల్లి మండల అధ్యక్షుడిగా శంకర్‌నాయక్‌నే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ.. కొందరు తుర్కపల్లి మండల నేతలు, కార్యకర్తలు శనివారం మధ్యాహ్నం గాంధీభవన్ మెట్లపై ధర్నాకు దిగారు. ఆ సమయంలో గాంధీభవన్‌లోనే ఉన్న రేవంత్.. ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి అయిలయ్యకు ఫోన్ చేశారు. కార్యకర్తలకు చెప్పి ఆందోళన విరమింపచేయాలని సూచించారు. ఇప్పటివరకు పార్టీ మండల అధ్యక్షుడిగా ఉన్న శంకర్‌నాయక్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆదేశించారు. ఇక ముందు ఎవరు ధర్నా చేసినా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

విద్యుత్ కోతలకు నిరసనగా రైతుల రాస్తారోకో



నూతనకల్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు, నాయకులు

నూతనకల్: విద్యుత్ కోతలను నిరసిస్తూ శనివారం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. వ్యవసాయానికి రోజుకు కనీసం 6 నుంచి 8 గంటల విద్యుత్ సరఫరా చేయకపోవడంతో పొలం దున్నే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటలు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెపుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదన్నారు. విద్యుత్ సరఫరాలో అనేకసార్లు అంతరాయం ఏర్పడటంతో సకాలంలో నాట్లు వేయలేని పరిస్థితి ఉందని వారు వాపోయారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగం సుధాకర్‌రెడ్డి, ఇమ్మారెడ్డి రాజబహదూర్‌రెడ్డి, బాణాల కిరణ్, బండపల్లి గణేశ్, సైదులు, కోటయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది మొదటి నుంచీ ద్రోహపూరిత పాత్రనే..

- కరెంటుపై కాంగ్రెస్ నిజ స్వరూపం రేవంత్ వ్యాఖ్యలతో తేలిపోయింది
- 24 గంటల ఉచిత విద్యుత్ టీఆర్ఎస్ విధానం
- మంత్రులు సింగిరెడ్డి, జగదీశ్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పట్ల కాంగ్రెస్ మొదటి నుంచీ ద్రోహపూరిత పాత్రనే పోషించిందని, కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా తెలంగాణను నిర్లక్ష్యమే చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ అనేది ప్రజల హక్కు తప్ప కాంగ్రెస్ ఇచ్చుడు, తీసుకునుడు అనే వాదన అర్థరహితమన్నారు. శనివారం ఆయన బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌కు తెలంగాణ అంటే ఎప్పుడూ పట్టదని, తెలంగాణ ఉద్యమాన్ని కూడా కాంగ్రెస్ సీరియస్‌గా తీసుకోలేదని విమర్శించారు. చరిత్రను అర్థం చేసుకోని అజ్ఞానులే కేసీఆర్‌ను బషీర్‌బాగ్ కాల్పులకు కారణమంటారని, తెలంగాణ మలి ఉద్యమానికి కరెంటు, వ్యవసాయ రంగ సమస్యలే కారణమని చెప్పారు. బషీర్‌బాగ్ కాల్పుల తర్వాత కేసీఆర్ రాసిన లేఖనే తెలంగాణ ఉద్యమానికి మలుపని పేర్కొన్నారు. గత తొమిదేళ్లలో కరెంటు పోయి దెబ్బతిన్న రంగం ఏమీలేదన్నారు. 15 నిమి షాలో, అరగంటో కరెంటు పోతే 24 గంటల కరెంటు లేనట్టా అని ప్రశ్నించారు. కొన్ని సాంకేతిక కారణాలతో కరెంటు పోతే లాగ్ బుక్కులు అంటూ రాజకీయం చేస్తున్నారని, అజ్ఞానులే కరెంటు కొనుగోలుపై ఆరోపణలు చేస్తారన్నారు.

రేవంత్ ముందే బయటపెట్టారు

24 గంటల ఉచిత కరెంటు ఇవ్వొద్దు అనే కాంగ్రెస్ హైకమాండ్ విధానాన్ని రేవంత్ ముందే బయటపెట్టారని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. గతంలో కూడా రేవంత్ ఓటుకు నోటు కేసులో తొందర పడి చంద్రబాబును తట్టా బుట్టా సర్దుకుని వెళ్లేలా చేశారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అవినీతికి పేటెంట్ అని, ఉచిత విద్యుత్‌కు కాదని ఎద్దేవా చేశారు. కోమటిరెడ్డి గతంలో అనేక సవాళ్లు విసిరి పారిపోయారని, అలాంటి వ్యక్తి మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. రైతు బంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అమెరికాలో చంద్రబాబు అభిమానులు పెట్టిన మీటింగ్‌లో రేవంత్.. చంద్రబాబు ఎజెండానే మాట్లాడారని ఆరోపించారు. కరెంటు కొనుగోలు ఎలా జరుగుతుందో తెలియని అజ్ఞాని పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నారని, తెలంగాణ ఉద్యమానికి భూమిక కరెంటే అని తెలియక బెదిరింపులకు దిగుతున్నారన్నారు.

నీటిపారుదల శాఖకు 5,950 వీఆర్ఏలు!

▶ మొదటి పేజీ తరువాయి

మొత్తం రూ.23 వేల స్థూల వేతనం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. 5,950 మంది వీఆర్ఏలతోపాటు శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల కింద నిర్వాసితులుగా మారిన కుటుంబాల నుంచి మరో 200 మందిని లస్కర్లుగా నియమించుకోవడానికి నీటిపారుదల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రాజెక్టుల కింద నిర్వాసితులుగా మారిన కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించడానికి ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన జీవో 98 కింద 200 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఇప్పటికే కసరత్తు పూర్తయింది. త్వరలో ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష జరిపి లస్కర్ల నియామకంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. వీఆర్ఏలను లస్కర్లుగా నియమిస్తామని ఆయన చాలా ఏళ్ల కిందే ప్రకటించిన విషయం తెలిసిందే. సాగునీటి ప్రాజెక్టులు, కాల్వలు, తూములకు కాపలా కాస్తూ పంట పొలాలకు నీళ్లు అందేలా లస్కర్లు పనిచేయాల్సి ఉంటుంది. కాల్వల్లో పిచ్చి మొక్కలు తొలగించడం, గండ్లు పడితే ఉన్నతాధికారులకు తక్షణమే సమాచారం ఇవ్వడం వంటి విధులు నిర్వహిస్తారు. తెలంగాణ వచ్చాక కొత్త ప్రాజెక్టులను పెద్ద ఎత్తున నిర్మించినా, నిర్వహణకు అవసరమైన క్షేత్రస్థాయి సిబ్బందిని నియమించలేదు. లస్కర్ల నియామకంతో కొత్త ప్రాజెక్టుల నిర్వహణ మెరుగుపడే అవకాశాలున్నాయి.

..పరిరక్షించుకుందాం

▶ మొదటి పేజీ తరువాయి



లీడర్‌షిప్ అవార్డు అందుకుంటున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

చేపట్టిన విధానాలు, ప్రాధాన్యతలతో భారతదేశం సాధిస్తున్న ప్రగతిని వివరించారు. గత పదేళ్లుగా పర్యావరణ సుస్థిరత కోసం కేంద్ర ప్రభుత్వ కృషి కారణంగా నేడు టూరిజం వర్కింగ్ గ్రూప్ సమావేశాలకు ఎజెండా నిర్దేశించడంతోపాటు ముందుండి విజయవంతంగా నడిపామని మంత్రి కిషన్ రెడ్డి వివరించారు. పర్యాటకాన్ని ప్రోత్సహించడంతోపాటు, వారసత్వాన్ని కాపాడుకునేందుకు వివిధ దేశాలతో కలిపి థీమ్ బేస్డ్ సర్క్యూట్లను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. పర్యావరణ స్పృహతోపాటు పర్యాటకానికి సరైన గుర్తింపును తీసుకొచ్చే లక్ష్యంతో పాఠశాలలు, కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో.. 'యువ టూరిజం క్లబ్'లను ఏర్పాటు చేశామన్నారు. 2030 నాటికి పూర్తిచేసేలా నిర్దేశించుకున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకునే క్రమంలో ఇప్పటివరకు సాధించిన ప్రగతిని కూడా ఈ సమావేశంలో సమీక్షించారు. పర్యాటక రంగ సుస్థిరత, సమగ్రత లక్ష్యాల ప్రాధాన్యతతో భారత ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను చూసేందుకు 'మీరంతా భారత్ కు రండి'అని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి వారిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు సాబా కొరోశీ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాల పెంపు ఈనెల నుంచే..

- అభ్యాసన సంక్షోభాన్ని నివారించేందుకు 'తొలిమెట్టు'
- విద్యార్థులందరికీ మరో వారంలోగా యూనిఫారాలు అందాలి
- విద్యాశాఖ అధికారుల సమావేశంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెంచిన వేతనాలను ఈనెల నుంచి ఇవ్వనున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. వేతనాలను పెంచడం వల్ల ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న 54,201 మంది కుక్-కమ్ హెల్పర్లకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. తద్వారా ప్రభుత్వంపై ఏటా రూ.108.40 కోట్ల అదనపు భారం పడుతుందన్నారు. శనివారం తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థలో జరిగిన జిల్లా విద్యాశాఖాధికారుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. పాఠశాల విద్యలో ప్రధానంగా ప్రాథమిక స్థాయిలో చోటు చేసుకున్న అభ్యాసన సంక్షోభాన్ని నివారించి తరగతి వారీగా భాషా, గణితాల సామర్థ్యాలను సాధించేందుకు తొలి మెట్టు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో ఉన్న కనీస సామర్థ్యాలను గుర్తించేందుకు ఈ సంవత్సరం నుంచి ప్రతీ ఏటా స్టేట్ లెవెల్ అచీవ్ మెంట్ సర్వే నిర్వహించనున్నామని మంత్రి వెల్లడించారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాల కోసం....

పదవ తరగతిలో ఉత్తమ ఫలితాల సాధన కోసం విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రూ.కోటి కన్నా ఎక్కువ వ్యయమయ్యే పనులను పాఠశాల నిర్వహణ కమిటీలకు (ఎస్.ఎం.సి) అప్పగించి పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పలు జిల్లాల్లో విద్యార్థులకు అందజేయాల్సిన ఏకరూప దుస్తులు అందలేదన్న ఫిర్యాదులు వస్తున్నాయని, మరో వారం రోజుల్లోగా అందజేయకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. సమావేశంలో విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్యా సంచాలకులు శ్రీదేవసేన తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల పనితీరు మదింపునకు కమిటీలు

- రెగ్యులరైజేషన్ కసరత్తులో భాగంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- జిల్లా స్థాయి కమిటీ నోడల్ ఆఫీసర్‌గా అదనపు కలెక్టర్
- సభ్యులుగా పోలీసు, అటవీ అధికారులు



సాక్షి, హైదరాబాద్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్) సర్వీస్ రెగ్యులరైజేషన్ కసరత్తులో భాగంగా వారి పనితీరు మదింపునకు జిల్లా స్థాయి పనితీరు మూల్యాంకన కమిటీ (డిస్ట్రిక్ట్ లెవల్ పెర్ఫార్మన్స్ ఎవాల్యుయేషన్ కమిటీ)లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఎస్పీ లేదా ఎస్పీ నామినీగా డీఎస్పీ కంటే తక్కువ ర్యాంక్ కాని అధికారి, జిల్లా అటవీ అధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. వివిధ నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఈ కమిటీ జేపీఎస్‌ల పనితీరును మదింపు చేస్తుంది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శనివారం ఆదేశాలు జారీ చేశారు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేసే క్రమంలో ఈ కమిటీలు ఏర్పాటయ్యాయి. ఈ మేరకు పలు మార్గదర్శకాలను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మొత్తం 100 పాయింట్లతో మదింపు

- జిల్లా కమిటీకి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు.
- కమిటీ గ్రామ పంచాయతీలను సందర్శించి, ప్రభుత్వం నిర్దేశించిన పారామీటర్ల ఆధారంగా 4 ఏళ్ల సర్వీసు పూర్తిచేసిన జేపీఎస్‌ల పనితీరు అంచనా వేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తుంది.
- ఈ డేటాను, మదింపునకు సంబంధించిన స్కాన్డ్ కాపీలను పంచాయతీరాజ్ కమిషనర్ (పీఆర్) ఓ మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారు.
- జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు కమిటీలిచ్చే నివేదికలను పరిశీలించి జేపీఎస్‌ల సర్వీసు రెగ్యులరైజేషన్ ప్రతిపాదనలను పీఆర్ కమిషనర్‌కు సమర్పిస్తారు.
- ఈ నివేదికలపై పీఆర్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ తదనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటారు.
- రోడ్లు, మురుగు కాల్వల శుభ్రత, దోమల నివారణ, వైకుంఠధామాల నిర్వహణ, నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకం, ప్రకృతి వనాలు, ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ..తదితర అంశాలకు వేర్వేరుగా పాయింట్లు ఇవ్వడం ద్వారా, మొత్తం వంద పాయింట్లుగా మదింపు చేస్తారు.

సాగర్ నుంచి 5 టీఎంసీలు ఇవ్వండి

- కృష్ణా బోర్డును కోరిన ఏపీ..
- అభ్యంతరం తెలిపిన తెలంగాణ
- త్రిసభ్య సమావేశం వాయిదా వేయాలన్న తెలంగాణ అధికారులు

సాక్షి, హైదరాబాద్: గుంటూరు జిల్లా తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ జలాశయం నుంచి కుడికాల్వకు 5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కు ఏపీ విజ్ఞప్తి చేయడంతో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కొత్త జలవివాదం తలెత్తింది. నాగార్జునసాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతం 146 టీఎంసీల నిల్వలు మాత్రమే ఉన్నాయి. అందులో డెడ్ స్టోరేజీకి ఎగువన 13 టీఎంసీలే ఉండగా, హైదరాబాద్ నగర తాగునీటి, మిషన్ భగీరథ అవసరాలకు ఈ నీళ్లను నిల్వ ఉంచినట్టు తెలంగాణ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గత నీటి సంవత్సరం 2022-23లో ఏపీ తమ కోటాకి మించిన కృష్ణా జలాలను వినియోగించుకుందని, ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాశయంలో మిగిలి ఉన్న నీళ్లు కేవలం తెలంగాణ వేనని స్పష్టం చేస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు తాగునీటి సరఫరా కోసం ప్రతి నెలా 2 టీఎంసీల జలాలు అవసరమని, ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో నిల్వ ఉన్న నీళ్లు తెలంగాణ తాగునీటి అవసరాలకు నిల్వ ఉంచాలని కోరుతున్నారు. మరోవైపు ఏపీ విజ్ఞప్తిపై నిర్ణయం తీసుకోవడానికి ఈ నెల 19న నిర్వహించతలపెట్టిన త్రిసభ్య కమిటీ సమావేశాన్ని వాయిదా వేయాలని తెలంగాణ కోరింది. 19న వేరే సమావేశాలు ఉండడంతో 20 లేదా 21న త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించింది. త్రిసభ్య కమిటీ కన్వీనర్‌గా కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయిపూరే, ఏపీ, తెలంగాణ నీటిపారుదల శాఖల ఈఎన్సీలు నారాయణరెడ్డి, మురళీధర్ వ్యవహరిస్తారు.

క్లుప్తంగా...

ఆ ఇళ్లలో ఓట్ల తనిఖీ తప్పనిసరి

ఒకే ఇంట్లో ఆరుగురికి మించి ఓటర్లు ఉంటే తనిఖీ చేయాలి:సీఈఓ వికాస్‌రాజ్



సాక్షి, హైదరాబాద్: ఒకే ఇంట్లో ఆరుగురికి మించి ఓటర్లుంటే, తప్పనిసరిగా ఆ ఇంటిని సందర్శించి ఆ మేరకు ఓటర్లందరూ అక్కడ నివసిస్తున్నారా లేదా అన్న విషయాన్ని తనిఖీ చేసి ధ్రువీకరించుకోవాలని.. బూత్ స్థాయి అధికారుల (బీఎల్‌ఓ)ను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ ఆదేశించారు. ఓటర్ల జాబితా రెండో ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి పరిశీలన జరపాలని సూచించారు. అనర్హులు జాబితాలో ఉన్నట్టు గుర్తిస్తే వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని అన్నారు. ఓటర్ల జాబితాల రూపకల్పనలోబీఎల్‌ఓలకు శిక్షణనిచ్చే జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ల కోసం శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 34,891 మంది బీఎల్‌ఓలను వచ్చే ఎన్నికల కోసం సన్నద్ధం చేయాలని ఆదేశించారు. కొత్త ఓటర్ల నమోదు కోసం వచ్చే దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ జాబితాలో చోటు కల్పించాలని కోరారు.

నాకూ, సీఎంకు మధ్య బ్రోకర్లు, జోకర్లు ఉండరు

ఎమ్మెల్యే శంకర్‌నాయక్



సాక్షి, మహబూబాబాద్: 'శంకర్ నాయక్ టు కేసీఆర్.. కేసీఆర్ టు శంకర్ నాయక్.. అంతేకానీ నాకూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మధ్య దళారులు, పైరవీకారులు.. బ్రోకర్లు.. జోకర్లు ఉండరు'అని మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్ నాయక్ అన్నారు. శనివారం మహబూబాబాద్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తనకు టికెట్ రాదనే ప్రచారం నమ్మవద్దని కార్యకర్తలకు చెప్పారు. తాను ఎవరి పైరవీలు పట్టుకొని సీఎం దగ్గరకు వెళ్లనని అన్నారు. కొందరు తనకు టికెట్ ఇవ్వొద్దని.. రాదని ప్రచారం చేయడం వారి అవివేకానికి నిదర్శనమని పేర్కొన్నారు. కొద్దిరోజులుగా శంకర్ నాయక్‌కు టికెట్ ఇవ్వొద్దని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు వర్గీయులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో శంకర్ నాయక్ ఈ వ్యాఖ్యలు చేశారు.

తెలంగాణలో పేదల బతుకు భారమైంది

- మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించండి: షర్మిల



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో దొర కుటుంబం బంగారమైతే.. పేదలకు బతుకు భారమైందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. జీతాల కోసం , పథకాల కోసం పేదలు చేసుకొనే ఆత్మహత్యలు దొర బంగారు పాలనకు నిదర్శనమని శనివారం ఆమె ట్విట్టర్ వేదికగా ఎద్దేవా చేశారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు, జీతాలు రాక ఉద్యోగులు.. తమలాగా మరొకరికి కష్టం రాకూడదని లేఖలు రాసి మరీ ప్రాణాలు వదులుతున్నారని అన్నారు. నల్లగొండలో మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేసిన దంపతులను పొట్టనపెట్టుకున్న పాపం కేసీఆర్‌దేనన్నారు. గతంలో జీతం రావడం లేదని భర్త మహేశ్ ఆత్మహత్య చేసుకుంటే.. అతని భార్య పుష్పలత సైతం అదే కారణంతో ప్రాణాలు విడిచిందన్నారు. అభివృద్ధి అంటూ గొప్పలు చెప్పే మంత్రి హరీశ్‌రావుకైనా మిషన్ భగీరథ కార్మికుల కష్టాలు పట్టడం లేదన్నారు. సిరిసిల్లలో ప్రభుత్వ పథకాలు అందని గడపే లేదని చెప్పుకునేందుకు కేటీఆర్ సిగ్గుపడాలన్నారు.

రైతు రుణమాఫీకై 18న బీజేపీ నిరసనలు..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతాంగానికి రూ.లక్ష లోపు ఉన్న రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ నిర్ణయించింది. 2018 ఎన్నికల సందర్భంగా రైతుల రుణాలను మాఫీ చేస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని వెంటనే నెరవేర్చాలని బీజేపీ ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.

జాయింట్ సర్వేకు హాజరుకండి

పొంగులేటి సోదరుడికి నోటీసు

ఖమ్మం అర్బన్: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కాల్వ పరిధిలోని భూమికి సంబంధించి జాయింట్ సర్వేకు హాజరు కావాలని మాజీ ఎంపీ, కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డికి శుక్రవారం రాత్రి నీటిపారుదల శాఖాధికారులు నోటీసులు జారీ చేశారు. ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల గ్రామం నాగార్జునసాగర్ ప్రాజెక్టు 21వ ఎంబీసీ కాల్వ కోసం సేకరించిన భూమి సరిహద్దును నిర్ణయించడానికి శనివారం 9గంటలకు ఉమ్మడి సర్వే నిర్వహిస్తామని నోటీసులో పేర్కొన్నారు. కానీ.. తాను వైరల్ జ్వరంతో బాధపడుతూ హైదరాబాద్‌లో ఉన్నందున ఖమ్మం రాలేనని ప్రసాదరెడ్డి సమాధానం ఇచ్చారు. మరో తేదీ నిర్ణయిస్తే హాజరవుతానని స్పష్టం చేశారు. కాగా, శనివారం ఉదయం సర్వేకు హాజరుకావాలని శుక్రవారం రాత్రి నోటీసు పంపించడం చర్చనీయాంశమైంది.

ప్రజా ప్రభుత్వాన్ని తీసుకొస్తాం..

- ఇప్పుడు రాష్ట్రంలో ఏ వర్గమూ ఆనందంగా లేదు
- భయం భయంగా బతికే పోలీసుల రాజ్యమిది
- సాగునీటిలో రాష్ట్రానికి గుండుసున్నా
- ప్రాజెక్టుల వద్దకు వెళ్లి పరిస్థితులు వివరిస్తాం
- పాదయాత్ర అనుభవాలను మేనిఫెస్టోలో చేరుస్తాం
- సీఎం కుర్చీలో ఎవరు కూర్చుంటారన్నది ఇప్పుడు అప్రస్తుతం: సీఎల్పీ నేత భట్టి



శనివారం గాంధీభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క. చిత్రంలో రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రజల అవసరాలే ప్రధాన ఎజెండాగా ప్రజా ప్రభుత్వాన్ని త్వరలోనే తీసుకువస్తామని కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) నేత మల్లు భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో మార్పులు వచ్చే విధంగా తన పాదయాత్ర అనుభవాలను మేనిఫెస్టోలో పొందుపరుస్తామని వెల్లడించారు. ఈ ఏడాది మార్చి 16 నుంచి జూలై 2వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లాలోని పిప్పిరి గ్రామం నుంచి ఖమ్మం నగరం వరకు నిర్వహించిన 'పీపుల్స్ మార్చ్'అనుభవాలను శనివారం గాంధీభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన వివరించారు. తన పాదయాత్ర సందర్భంగా అనేక విషయాలను తాను ప్రత్యక్షంగా చూశానని, కొన్ని పరిస్థితులు తీవ్రంగా కలచివేశాయని చెప్పారు. తొమ్మిదిన్నరేళ్లుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న బీఆర్ఎస్ మసిపూసి మారేడు కాయ చేస్తోందని విమర్శించారు. గోబెల్స్ ప్రచారంతో అద్భుతాలు జరిగినట్టు, బంగారు కుటుంబాలు తయారయినట్టు కట్టుకథలతో నెట్టుకొస్తోందని భట్టి నిందించారు.

ఆ రూ.5లక్షల కోట్లు ఎటుపోయాయో?

"రాష్ట్రంలో రైతులు బాగుపడలేదు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదు. దళితులకు భూమి ఇవ్వలేదు. ఎస్సీ, ఎస్టీల సబ్‌ప్లాన్ అమలు కావడం లేదు. గిరిజనులకు పోడు హక్కులు కల్పించలేదు. ఐటీడీఏలను నిర్వీర్యం చేశారు.. యూనివర్సిటీల్లో నియామకాలు లేవు. మరి రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పెట్టిన తొమ్మిది బడ్జెట్‌ల నిధులు ఏమయ్యాయో తెలీదు. అప్పుగా తెచ్చిన రూ.5లక్షల కోట్లు ఎటుపోయాయో అర్థం కాదు. రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదు.'అని వ్యాఖ్యానించారు.

త్వరలో ప్రాజెక్టుల వద్దకు వెళ్తాం

సాగునీటిలో రాష్ట్రానికి గుండు సున్నా అని, గోదావరి, కృష్ణా నదులపై ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదని, కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టుల నుంచి నీరివ్వకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని భట్టి ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో చెప్పేందుకు, వాస్తవ పరిస్థితులను వివరించేందుకు త్వరలోనే ప్రాజెక్టుల వద్దకు వెళ్తామని, అక్కడ పరిస్థితులను ప్రజలకు వివరించి సెల్ఫీలు దిగి చూపెడతామని వెల్లడించారు.

ఇక్కడ ఫ్యూడల్.. అక్కడ బహుళజాతి సర్కారు

తెలంగాణ ఏర్పాటయ్యాక రాష్ట్రంలో స్వేచ్ఛ లేకుండా పోయిందని భట్టి వ్యాఖ్యానించారు. ఎవరు ఏం మాట్లాడాలన్నా భయపడుతున్నారని, ఏం మాట్లాడితే ఏం కేసు పెడతారో అనే భయంతో బతికే పోలీసు రాజ్యాన్ని తీసుకువచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో ఫ్యూడల్ ప్రభుత్వం, దేశంలో బహుళ జాతి ప్రభుత్వం కలిసి ప్రజలను దోచుకుంటున్నాయని వ్యాఖ్యానించారు.

వైఎస్సార్ పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడే మేనిఫెస్టోలో ఉచిత విద్యుత్

2004లో అధికారంలోకి రాగానే ఉచిత విద్యుత్‌ను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, ఉచిత విద్యుత్‌పై పేటెంట్ తమకే ఉందని భట్టి స్పష్టం చేశారు. ఈ రాష్ట్రంలో ఎవరూ ఆలోచించనప్పుడే 1999లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడే రైతులకు ఉచిత విద్యుత్‌ను మేనిఫెస్టోలో చేర్చామన్న విషయాన్ని గుర్తు చేశారు. ఉచిత విద్యుత్ పేరు చెప్పేముందు కాంగ్రెస్ పార్టీకి దండం పెట్టాలని వ్యాఖ్యానించారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా ఫామ్‌హౌస్ సంస్కృతిని తీసుకువచ్చారని ఆరోపించారు. జర్నలిస్టులకు ఎప్పుడు ఇండ్ల స్థలాలు ఇచ్చినా కాంగ్రెస్ పార్టీనే ఇచ్చిందని, మళ్లీ ఇచ్చేది కూడా కాంగ్రెస్ పార్టీ నేనని వ్యాఖ్యానించారు. సీఎం కుర్చీలో ఎవరు కూర్చుంటారన్నది ఇప్పుడు అప్రస్తుతమని ఓ ప్రశ్నకు సమాధానంగా భట్టి స్పష్టం చేశారు.

గన్‌పార్కు వద్ద అమరవీరులకు నివాళులు

నాంపల్లి: 1440 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం గన్‌పార్కు వద్ద కాంగ్రెస్ సీనియర్ నేతలు, కార్యకర్తలతో కలిసి భట్టి విక్రమార్క తెలంగాణ అమరవీరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు చల్ల నరసింహారెడ్డి, జగదీష్ రావు, బల్మూరి వెంకట్, అజ్మతుల్లా హుస్సేని, ప్రేమ సాగర్, సిరిసిల్ల రాజయ్య, కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, నూతి శ్రీకాంత్, పల్లవి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను ఎందుకు ఆహ్వానించలేదు?

విపక్ష పార్టీల కూటమి భేటీపై అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీని ఓడించాలనుకుంటున్న విపక్ష పార్టీలు బీజేపీ నిర్దేశించిన ఎజెండాను అనుసరించడం లేదన్న తేడాను చూపించాలని, భిన్నమైన ఎజెండాతో ముందుకు వెళ్తేనే ఫలితముంటుందని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. శనివారం పార్టీ కేంద్ర కార్యాలయమైన హైదరాబాద్ దారుస్సలాంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విపక్ష పార్టీల కూటమి చౌదరీల (ఉత్తర భారతదేశంలో భూస్వాములు, గ్రామ పెద్దలు) క్లబ్‌గా తయారైందని ఆయన చురకలంటించారు. బీజేపీ వ్యతిరేక భేటీకి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎందుకు ఆహ్వానించలేదని, సీఎం కేసీఆర్ దేశ రాజకీయాల్లో పెద్దన్న పాత్ర పోషిస్తున్నారని ఒవైసీ గుర్తు చేశారు.

యూసీసీని ఎలా అమలు చేస్తారు?: హిందూ వివాహ చట్టాన్ని మార్చలేని వారు, యూసీసీని ఎలా అమలు చేస్తారని ఒవైసీ ప్రశ్నించారు. ఆదివాసీలు ఎక్కువగా ఉన్న ఈశాన్యం మొత్తంలో యూసీసీని తీసుకొస్తారో లేదో బీజేపీ సమాధానం చెప్పాలన్నారు. యూసీసీని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

అసోం సీఎంపై ధ్వజం: ముస్లిం వ్యాపారుల వల్లనే కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని అసోం సీఎం హిమంతబిశ్వ శర్మ చేసిన వ్యాఖ్యలకు ఒవైసీ కౌంటరిచ్చారు. ఇది మతతత్వ ఆలోచన అని అభివర్ణిస్తూ.. అసోంలో విచిత్రమైన గుంపు తయారైందని, వారింట్లో గేదె పాలు ఇవ్వకపోయినా, కోడి గుడ్డు పెట్టకపోయినా దానికి ముస్లింలు కారణమంటారన్నారు. బహుశా వారి వ్యక్తిగత వైఫల్యాలకు కూడా మియా భాయ్ మీద నిందలు వేస్తారేమోనని చురకలంటించారు. ఇదే క్రమంలో మన ప్రధాని విదేశీ ముస్లింలతో చాలా చనువుగా ఉంటారు కదా.. మరి అక్కడికి వెళ్లినప్పుడు టమాటాలు, పాలకూరను, బంగాళాదుంపలను ఎగుమతి చేయమని ఆయా దేశాలను కోరితే బాగుంటుందని ఎద్దేవా చేశారు.

ప్రతిపక్షానికో న్యాయం.. పాలకపక్షానికో న్యాయమా?

ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆగ్రహం



లేఖను చూపుతున్న రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: ప్రతిపక్షాలు ప్రజాప్రతినిధులుగా ఉన్న చోట ఓ న్యాయం.. పాలకపక్షం ప్రాతినిధ్యం వహిస్తున్న చోట మరో న్యాయం అమలు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వంపై ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు మండిపడ్డారు. శనివారం దుబ్బాక పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. దుబ్బాక అభివృద్ధికి కొందరు నాయకులు అడుగడుగునా అడ్డుపడటం బాధకరమన్నారు. 2016లో సీఎం కేసీఆర్ దుబ్బాకకు వచ్చినప్పుడు ఫైర్‌స్టేషన్ కోసం ఓ రైతు ఎకరం భూమి ఇచ్చాడని, ఇంతవరకూ నిర్మాణం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షాత్తు సీఎం చెప్పిన మున్సిపల్ భవనానికి కూడా అతీగతి లేదన్నారు. టీయూఎఫ్ఐడీసీ నిధులు వచ్చి 16 నెలలు గడిచినా ఎలాంటి అభివృద్ధి చేస్తలేరు, చేయనిస్తలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుబ్బాక నియోజకవర్గానికి రావాల్సిన నిధులు, పెండింగ్ భవనాలు, అభివృద్ధి కోసం రూ.50 కోట్లు మంజూరు చేయాలని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, మున్సిపల్ మంత్రి కేటీఆర్‌లకు లేఖ పంపుతున్నట్లు చెప్పారు. దుబ్బాక మీద ప్రేమ ఉంటే హరీశ్‌రావు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. దుబ్బాకలో ఒక లైబ్రరీకి రూ.2 కోట్లు పెట్టలేకపోతున్నారని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు 2021లో టెండర్ అయితే ఇంతవరకు శిలాఫలకం వేస్తలేరని, అభివృద్ధి పనులకు శిలాఫలకాలు వేయకుండా ఎవరు అడ్డుకుంటున్నారో బీఆర్ఎస్ నాయకులు చెప్పాలని నిలదీశారు.



బీసీ రాజకీయ ప్లీనరీలో అభివాదం చేస్తున్న జాజుల, బూర నర్సయ్యగౌడ్ తదితరులు

బీసీలు రాజకీయంగా శాసించాలి..

- మేమెంతో.. మాకంతా దక్కాల్సిందే
- రాష్ట్రానికి బీసీ వ్యక్తి సీఎంగా ఉండటమే లక్ష్యంగా పనిచేయాలి
- వచ్చే ఎన్నికల్లో 60 మంది బీసీ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి పంపుదాం
- బీసీ సంక్షేమ సంఘం రాజకీయ ప్లీనరీలో జాజుల

మన్సూరాబాద్: వృత్తులు వేరైనా మనమంతా ఒక్కటేనని చాటిచెప్పాలని, యాచించడం మాని రాజకీయాలను శాసించే స్థాయికి బీసీలు ఎదగాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో శనివారం బీసీల రాజకీయ ప్లీనరీని నిర్వహించారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎంబీసీ మాజీ అధ్యక్షుడు తాడూరి శ్రీనివాస్, బీసీ కమిషన్ సభ్యుడు ఉపేందర్‌లతో పాటు పలు కులసంఘాల నాయకులు హాజరయ్యారు. మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించి ప్లీనరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో 60 మంది బీసీలను ఎమ్మెల్యేలుగా గెలిపిస్తామని, బీసీ వ్యక్తి సీఎం కావడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఓట్లు మావే... సీట్లు కూడా మావే, జనాభాలో మేమెంతో.. మాకంత దక్కాల్సిందేనని జాజుల కుండబద్దలు కొట్టారు. ఆగస్టు మూడవ వారంలో బీసీ సింహగర్జన సభను హైదరాబాద్‌లో నిర్వహించి బీసీల సత్తా చాటుతామన్నారు. ఓటును అమ్ముకున్నవాడు బానిసని... ఓటును నమ్ముకున్న వాడు బాస్ అని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. బీసీలు లేకుంటే మానవుడి మనుగడే ఉండదని, పుట్టిన బిడ్డ నుంచి చనిపోయే వరకు వివిధ రకాల ప్రక్రియలన్నీ బీసీ కులాలే చేపడతాయని ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ అన్నారు.

సంఘటితంగా పోరాడితే రాజ్యాధికారం

అస్తిత్వాన్ని కాపాడుకుంటూ సంఘటితంగా పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు. జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత పాలకులకు ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ఐక్యంగా ముందుకు సాగితే రాజ్యాధికారం సొంతమవుతుందని మందకృష్ణమాదిగ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యం లేకుండా కేసీఆర్ వివక్ష చూపారని ఆరోపించారు. రాజకీయాల్లో దాడులకు ప్రతిదాడులు నిర్వహించినప్పుడే రాజ్యాధికారం సొంతమవుతుందని డాక్టర్ విశారదన్ మహారాజ్ పేర్కొన్నారు. బీసీల లెక్కలు తేల్చకుండా కేంద్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు.

బీజేపీ 'పరివార' చర్చలు

▶ మొదటి పేజీ తరువాయి

చేశాం. ఈ భేటీల సందర్భంగా కార్యకర్తలు పిచ్చాపాటిగా అన్ని విషయాలపై మాట్లాడుకోవడంతో పాటు వివిధ అంశాలపై ఆరోగ్యకరమైన చర్చకు అవకాశం ఉంటుంది.."అని బీజేపీ నేతలు చెప్తున్నారు.

నిరంతరం కొనసాగించే యోచన

ప్రజలకు మరింత సేవ చేసేలా ప్రోత్సాహం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, పార్టీ పటిష్టత తదితర అంశాలపైనా 'లంచ్'భేటీల్లో దృష్టి పెట్టనున్నట్టు బీజేపీ నేతలు తెలిపారు. ఆదివారం ఈ బైఠక్‌లు జరిగాక.. వాటిని నిరంతరం కొనసాగించాలనే ఆలోచనతో బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఉందని వివరించారు. త్వరలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో.. శక్తి కేంద్రాల ఇన్‌చార్జులు (మూడు, నాలుగు పోలింగ్ బూత్‌లు కలిపి ఓ శక్తి కేంద్రం), ఆ పైస్థాయిల వారు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో వంద మంది, అంతకు మించి పాల్గొనేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు.

నేతలు అతిథులుగా..: ఆదివారం నిర్వహిస్తున్న లంచ్ బైఠక్ కార్యక్రమాల్లో ప్రతి నియోజకవర్గంలో ఒక్కో నేత ముఖ్య అతిథిగా హాజరవుతారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి ఒక ప్రకటనలో తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, కరీంనగర్‌లో ఎంపీ బండి సంజయ్, గద్వాలలో జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఆర్మూర్‌లో ఎంపీ ధర్మపురి అర్వింద్, బోథ్‌లో ఎంపీ సోయం బాపూరావు, హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్, దుబ్బాకలో రఘునందన్ రావు, మలక్‌పేటలో నల్లు ఇంద్రసేనారెడ్డి, మునుగోడులో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఇతర నియోజకవర్గాల పరిధిలో బీజేపీ ముఖ్య నేతలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పదాధికారులు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బైఠక్‌లకు హాజరవుతారని తెలిపారు.

సీఎం బంధువులే భూ రాబందులు: ఈటల



శామీర్‌పేట్: సీఎం కేసీఆర్ బంధువులే ధరణిని అడ్డు పెట్టుకొని రాబందుల్లా భూములను లాక్కుంటున్నారని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేట భూముల సమస్యపై కలెక్టరేట్ వద్ద ధర్నా చేసేందుకు వెళ్తున్న బొమ్మరాశిపేట రైతులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రైతులను ఈటల కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బొమ్మరాశిపేట రైతులు 50 యేళ్ల క్రితం భూములు కొనుగోలు చేసుకొని సాగు చేస్తున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బొమ్మరాశిపేట భూములను డిస్ట్రిబ్యూట్ నుండి తొలగించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఎంపీ కేకే కుమారులపై కేసు

- ఫోర్జరీ సంతకాలతో ఎన్ఆర్ఐ స్థలం ఆక్రమించినట్టు ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: అమెరికాలో స్థిరపడిన ఎన్ఆర్ఐ మహిళకు చెందిన స్థలాన్ని ఫోర్జరీ సంతకాలతో సొంతం చేసుకున్నారన్న ఫిర్యాదుపై బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ కె.కేశవరావు(కేకే) కుమారులు కె.విప్లవ్‌కుమార్, కె.వెంకటేశ్వర్‌రావు మీద బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. వివరాలిలా.. గత 35 ఏళ్లుగా అమెరికాలోని న్యూ జెర్సీలో నివాసం ఉంటున్న ఎన్ఆర్ఐ జి.జయమాల(72) 1983లో షేక్‌పేట మండలం సర్వే నెంబర్ 129(ఓల్డ్) 403(న్యూ) 939 గజాల స్థలాన్ని పి.సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తితో కలిసి షేక్ అలీఖాన్ అహ్మద్ వద్ద నుంచి కొనుగోలు చేశారు. కొన్నాళ్ల తర్వాత సదరు స్థలాన్ని రెండు భాగాలుగా చేసుకుని జయమాల 469 గజాలను అధీనంలోకి తీసుకున్నారు.

ఐటీ నోటీసులతో వెలుగులోకి..

కాగా, గతేడాది నవంబర్‌లో ఆమెకు ఆదాయపు పన్నుశాఖ నుంచి ఓ నోటీసు వచ్చింది. 2013–14 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లావాదేవీలలో సుమారు రూ.2.13కోట్ల విలువైన స్థలం విక్రయించారని, సదరు విక్రయానికి సంబంధించిన పన్ను చెల్లించలేదని, దాదాపుగా 10 ఏళ్లుగా పన్ను చెల్లించకపోవడంతో రూ.1.44 కోట్ల మేర పన్ను చెల్లించాలంటూ నోటీసులో పేర్కొన్నారు. దీంతో ఆమె అమెరికా నుంచి నగరానికి వచ్చి స్థలం వద్దకు వెళ్లి చూడగా అక్కడ ఎంపీ కేశవరావు కుటుంబం నివాసం ఉంటున్నట్లు తేలింది. 2013లో ఆ స్థలాన్ని ఎంపీ కేశవరావు కుమారుడు విప్లవ్‌కుమార్ ఎస్‌పీఏ (స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ) హోల్డర్‌ను అంటూ తన అన్న వెంకటేశ్వరరావుకు కేవలం రూ.3 లక్షలకు అమ్మినట్లు తేలింది.

కోర్టు ఆదేశాలతో కేసు..

జయమాల ఎస్‌పీఏ ఇచ్చినట్లు చెబుతున్న పత్రాలను తీసుకుని చూడగా తన సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించింది. ఈ పత్రాలను ఫోరెన్సిక్ ట్రూత్ ల్యాబ్స్‌కు పంపించి పరీక్ష చేయించగా అవి బోగస్ అని తేలింది. ఈ వ్యవహారంపై గతంలో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసిన జయమాల ఇటీవల 3వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ మేరకు కోర్టు ఆదేశాలతో కె.విప్లవ్‌కుమార్, కె.వెంకటేశ్వర్‌రావుల మీద ఐపీసీ 417, 464, 465, 468, 470, 471 రెడ్‌విత్ 120(బి), 156(3) సెక్షన్ల కింద బంజారాహిల్స్ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

- ప్రవాస భారతీయులకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపు
- దేశంలోనే పెట్టుబడులకు స్వర్గధామంగా రాష్ట్రం
- 9 ఏళ్లలో 47 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాక
- ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో బోనాల ఉత్సవాల్లో కవిత



బ్రిస్బేన్‌లో బోనాల ఉత్సవంలో కవిత

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామంగా నిలిచిందని, ప్రవాస భారతీయులు సొంత రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. గత 9 ఏళ్లలో 47 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని చెప్పారు. ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో భారత్ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ప్రవాస తెలంగాణ వాసు ల నివాసాల్లో బోనాలను అలంకరించుకొని భారత్ జాగృతి కార్యకర్తలతో కలిసి కవిత స్థానిక దేవాలయానికి వెళ్లారు. అక్కడ బోనాలను సమర్పించిన అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడ్డ నాటికి ఐటీ పరిశ్రమలో తెలంగాణలో3.5 లక్షల ఉద్యోగాలు ఉంటే ఇప్పుడు 9.5 లక్షలకు పైగా ఉన్నాయన్నారు.

దేశంలో రెండు ఐటీ ఉద్యోగాల్లో ఒకటి తెలంగాణలోనే

దేశంలో రెండు ఐటీ ఉద్యోగాలు ఉంటే అందులో ఒకటి తెలంగాణలోనే ఉంటుందని కవిత పేర్కొన్నారు. జీఎస్డీపీలో జాతీయ సగటు కంటే తెలంగాణ ఎక్కువ నమోదు చేసిందని చెప్పారు. ఆస్ట్రేలియా రాజకీయాల్లో భారతీయులు రాణిస్తుండడం గర్వకారణమన్నారు. బోనాల ఉత్సవాల్లో తెలంగాణ జాగృతి ఆస్ట్రేలియా విభాగం అధ్యక్షులు శ్రీకర్ రెడ్డి, బీఆర్ఎస్ ఆస్ట్రేలియా విభాగం అధ్యక్షులు కాసర్ల నాగేందర్ రెడ్డి, బీటీఏ ప్రెసిడెంట్ కిషోర్, నాయకులు విజయ్ కోరబోయిన తదితరులు పాల్గొన్నారు.



ఎన్నిసారులు గద్దించినను లోబడనివాడు
మరి తిరుగులేకుండ హఠాత్తుగా నాశనమగును.
– క్రైస్తవ ధర్మం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.చతుర్దశి రా.9.23 వరకు, తదుపరి అమావాస్య **నక్షత్రం:** ఆరుద్ర రా.2.42 వరకు తదుపరి పునర్వసు, **వర్జ్యం:** ఉ.10.03 నుండి 11.46 వరకు, **దుర్ముహూర్తం:** సా. 4.51 నుండి 5.43 వరకు, **అమృతఘడియలు:** సా.4.02 నుండి 5.43 వరకు.

సూర్యోదయం : 5.37
సూర్యాస్తమయం : 6.34
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

సోనియా గాంధీ (కాంగ్రెస్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

"వస్తున్నారు కదా?!" అని నేనే స్వయంగా పవార్‌కి, కేజ్రీవాల్‌కి ఫోన్ చేసి మరీ అడిగాను.

"బెంగళూరు కదా.." అన్నారు పవార్.

"బెంగళూరే కదా?" అన్నారు కేజ్రీవాల్.

పవార్ 'బెంగళూరు కదా..' అనడంలో 'గుర్తుంది సోనియాజీ..' అని చెప్పడం ఉంది. కేజ్రీవాల్ 'బెంగళూరే కదా?' అని అడగడంలో.. 'మీటింగ్‌ని సిమ్లా నుంచి బెంగళూరు మార్చినట్లే బెంగళూరు నుంచి మళ్లీ ఏ బెంగాల్‌కో మార్చలేదు కదా?..' అన్న విరుపు ఉంది.

కేజ్రీవాల్ కాంగ్రెస్ మీద బాగా కోపంగా ఉన్నారు. ఐయ్యేఎస్‌ల పోస్టింగ్‌లు, ట్రాన్స్‌ఫర్‌లు కేజ్రీవాల్ చేతిలోంచి లాగేసుకుంటూ కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా రాజ్యసభలో ఓటు వేస్తామని పట్నా మీటింగులో కాంగ్రెస్ ఆయనకు మాట ఇవ్వలేదు. అదీ కోపం.

సమయం వచ్చేవరకు వేచి ఉండే ఓపిక లేని వారికి సమయానికి ముందే కోపం వచ్చేస్తుంది.

కేజ్రీవాల్‌కు ఆర్డినెన్స్ తలనొప్పి అయితే, పవార్‌కు అజిత్ తలనొప్పి. మమతా బెనర్జీకి లెఫ్ట్ తలనొప్పి. కాంగ్రెస్‌కు ఆప్ తలనొప్పి.



నితీశ్ కుమార్‌కు సొంత పార్టీలోనే 45లో 44 తలనొప్పులు. మిగిలిన ఒక్కటీ ఆ నొప్పులన్నిటినీ భరించే ఆయన సొంత తల. అంతా కలిసి మోదీ అనే తలనొప్పిని వదిలించుకోవాలని అనుకున్నప్పుడు ఎవరి తలనొప్పులతో వారు యూనిటీగా ఉండకపోతే ఎలా?!

బెంగళూరులో రేపు అన్ని పార్టీలవాళ్లం సమావేశం అవుతున్నాం. రేపు చిట్ చాట్. ఎల్లుండి సీరియస్ మేటర్స్.

"మామ్! అలా కాకుండా మొదటే సీరియస్ మేటర్స్ ఫినిష్ చేసేసుకుంటే, తర్వాత రిలాక్స్‌డ్‌గా చిట్ చాట్‌లో కూర్చోవచ్చు కదా?" అంటున్నాడు రాహుల్.

మీటింగ్ మొదటి రోజే ఒక ఉమ్మడి ప్రధాని అభ్యర్థిని, మీటింగ్ మొదటి రోజే ఒక ఉమ్మడి కో–ఆర్డినేటర్‌ని ఎంపిక చేసుకుంటే రెండో రోజు చిట్‌చాట్‌కి అలిగేవాళ్లు అలిగి మిగిలేవాళ్లు మిగిలితే ఎలా?!

రాహుల్‌తో ఆ మాటే అన్నాను.

"కానీ మామ్.. ఆ ప్రధాని అభ్యర్థి తను కాదని, ఆ కోఆర్డినేటర్ కూడా తను కానే కాదని ముందురోజే తేలిపోయి, ఆ భారాన్ని తప్పించుకున్నామన్న నిశ్చింత వల్ల రెండో రోజు చిట్‌చాట్‌కి ఉత్సాహంగా ఎదురు చూసేవారు కూడా ఉండొచ్చు కదా.." అన్నాడు రాహుల్!

సీరియస్ మేటర్స్‌కి రాహుల్ ఎందుకనో అలవాటు పడటం లేదు.

పవార్‌కి, కేజ్రీవాల్‌కి ఫోన్ చేశాక.. "మిగతావాళ్లకు మీరు చేసి చెప్పండి ఖర్గేజీ.." అని ఖర్గేకి ఫోన్ చేసి చెప్పాను.

"సోనియాజీ! ఈసారి కొత్తగా 8 పార్టీలు మీటింగ్‌కు వస్తున్నాయి. మొత్తం కలిపి 24 పార్టీలు. అందరికీ ఇన్విటేషన్ పంపాను. లాలూజీకి ఒంట్లో బాగోలేదు. అయినా వస్తానన్నారు. ఫరూఖ్, ఒమర్‌లలో ఒకరే మీటింగ్‌కి రావచ్చు. ఫరూఖ్ అయితే స్టాలిన్‌ని పీఎం అభ్యర్థిగా ముందుకు తెస్తే బాగుంటుందని అంటున్నారు. మిగతా వాళ్ల మనసులో ఏముందో తెలియడం లేదు.." అన్నారు ఖర్గే.

"మరి రాహుల్ మనసులో ఏముందో తెలుసుకున్నారా ఖర్గేజీ.." అని అడిగాను.

"తెలుసుకున్నాను సోనియాజీ.. ముందు చిట్ చాట్ కానిద్దాం. తర్వాతే సీరియస్ మేటర్ అంటున్నారు.." అని చెప్పారు ఖర్గే!

"రాహుల్‌తో నేనన్నమాటే రాహుల్ మీతో అన్నాడా?" అని నవ్వాను.

"రాహుల్ బాబు నాతో అన్నది.. మీరు రాహుల్ బాబుతో అన్నది కాదు సోనియాజీ. ముందు మోదీని ఓడిద్దాం. ఆ తర్వాత పీఎంగా మనలోంచి ఒకర్ని పిక్ చేసుకుందాం, అన్నారు" అని చెప్పారు ఖర్గే.

ఆ మాట నాకెంతో సంతృప్తినిచ్చింది.

మోదీని ఓడించడం చిట్ చాట్ వ్యవహారం అనీ, ప్రతిపక్షాల్లోంచి పీఎం అభ్యర్థిగా ఒకరిని ఎంపిక చేసుకోవడమే సీరియస్ మ్యాటర్ అనీ రాహుల్ అనుకుంటున్నాడంటే.. రాహుల్ సీరియస్ విషయాలకు మెల్లిగా అలవాటు పడుతున్నాడనే కదా!

ఇంటిదొంగ – ఈశ్వరన్!

జనతంత్రం



వర్ధెల్లి మురళి

సింగపూర్ మంత్రి ఈశ్వరన్ తొలగింపు, అరెస్ట్ వార్తలు మన దగ్గర కూడా చాలా ఆసక్తిని రేకెత్తించాయి. ఇందుకు మూడు కారణాలున్నాయి. ప్రభుత్వ వ్యవహారాల్లో అవినీతి అత్యల్పంగా కనిపించే సింగపూర్‌లో అవినీతి ఆరోపణలపై ఒక మంత్రి అరెస్ట్ కావడం మొదటి కారణం. రెండవది ఈశ్వరన్ భారతీయ సంతతికి చెందినవాడు కావడం. మూడో కారణం మరీ ముఖ్యమైనది. ఆయన మన చంద్రబాబు నాయుడుకు అత్యంత సన్నిహితుడు కావడం. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన గ్లోబల్ రియల్ ఎస్టేట్ వెంచర్ అమరావతిలో ఈశ్వరన్ కూడా భాగస్వామి.

అమరావతి కోర్ ఏరియాలో 1691 ఎకరాల భూమిని రాజధాని స్టార్టప్ ఏరియాగా డెవలప్ చేసే కాంట్రాక్టును సింగపూర్ కన్సార్టియానికి చంద్రబాబు అప్పగించారు. ఈ ఒప్పందం కోసం ఈశ్వరన్, ఆయన సింగపూర్ టీమ్ పలుమార్లు విజయవాడకు వచ్చారు. చంద్రబాబు, లోకేశ్‌లు కూడా సింగపూర్‌లో పర్యటించారు. చివరికి 2017లో ఒప్పందం కుదిరింది. ఇది సింగపూర్ ప్రభుత్వ సంస్థలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుదుర్చుకుంటున్న ఒప్పందంగా బిల్డప్ ఇచ్చారు. సింగపూర్ మంత్రిగా ఉన్న ఈశ్వరన్ స్వయంగా ఈ కార్యక్రమానికి హాజరు కావడంతో నాటకం రక్తికట్టింది. ఆయనతోపాటు పాల్గొన్న సింగపూర్ 'అధికారులు' కూడా ఆ తర్వాత తమ అవతారాలను మార్చడం వింతగొలిపే విషయం.

అసెండస్ – సింగ్ బ్రిడ్జ్, సెంబ్ కార్ప్ అనే ప్రైవేట్ కంపెనీల కన్సార్టియంతో ఒప్పందం కుదిరింది. ఇవి ప్రభుత్వ కంపెనీ లేనని బాబు సర్కార్ బుకాయించింది. సింగపూర్‌లో చాలా కంపెనీల్లో ప్రభుత్వ సంస్థల వాటా అంతో ఇంతో ఉంటుంది. సెంబ్ కార్ప్‌లో కూడా టుమాసెక్ హోల్డింగ్స్ లిమిటెడ్ అనే ప్రభుత్వ సంస్థ పెట్టుబడి ఉన్నది. కానీ మెజారిటీ వాటా ప్రైవేట్‌దే! ఈ టుమాసెక్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు ఒక మూడేళ్లపాటు ఈశ్వరన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. సెంబ్‌కార్ప్‌లో టుమాసెక్ పెట్టుబడి వెనుక ఆయన పలుకుబడి ఉపయోగపడి ఉండవచ్చు. సెంబ్‌కార్ప్‌పై ఆయనకు ప్రత్యేక ఆసక్తి కూడా ఉండవచ్చు.

సింగపూర్ కన్సార్టియంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాన్ని చూసి ఆరోజుల్లోనే పలువురు ముక్కున వేలేసుకున్నారు. సింగపూర్ కన్సార్టియం, కేపిటల్ సిటీ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కలిసి అమరావతి డెవలప్‌మెంట్ పార్ట్‌నర్ (ఏడీపీ) ఏర్పాటయింది. ఈ సంస్థకు ప్రభుత్వం 1691 ఎకరాల భూమిని అప్పగించింది. కనీస ధర ఎకరాకు రూ.4 కోట్లుగా నిర్ణయించింది. అంటే ఈ మొత్తం భూమి కనీస విలువ 6,764 కోట్లు. ఇంత విలువ చేసే భూమిని ఏడీపీకి ప్రభుత్వం ఉచితంగానే ఇచ్చింది. ఇందులో 250 ఎకరాల భూమిని సింగపూర్ కంపెనీలకు ఉచితంగా కేటాయించింది. ఆ భూమిని అభివృద్ధి చేసుకుని వారే అమ్ముకోవచ్చు. ఈ మొత్తం భూమిలో మౌలిక సదుపాయాల కల్పన కోసం 5500 కోట్ల రూపాయలను ఖర్చు చేయడానికి బాబు సర్కార్ అంగీకరించింది.

అమరావతి డెవలప్‌మెంట్ పార్ట్‌నర్ (ఏడీపీ)తో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా ఉండే సిటీ డెవలప్‌మెంట్ మేనేజింగ్ కమిటీ (సీసీడీఎంసీ) తన వాటా కింద 221 కోట్లు పెట్టుబడిగా పెడుతుంది. భూమి విలువతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం పెట్టే ఖర్చు 12,485 కోట్లు. ఇందులో సింగపూర్ కన్సార్టియం పెట్టే ఖర్చు ఒక్క రూపాయి కూడా లేదు. భూమిని అభివృద్ధి చేసి ప్లాట్లుగా వేసి విక్రయించడానికి ఇంకో 3,137 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇందులో 306 కోట్ల ఖర్చును సింగపూర్ కన్సార్టియం భరిస్తుంది. మొత్తం పెట్టుబడిలో కన్సార్టియం ఖర్చుపెట్టేది సుమారు రెండు శాతం! కానీ వ్యాపారంలో దాని వాటా 58 శాతం. రాష్ట్ర ప్రభుత్వ సంస్థ సీసీడీఎంసీ వాటా 42 శాతం మాత్రమే. సొమ్మొకడిది సోకొకడిది అనే సామెతకు ఈ ఒప్పందం సరైన ఉదాహరణ. ఇది కాకుండా మరో 250 ఎకరాల భూమి కన్సార్టియంకు ఉచితంగా దక్కుతుంది. అభివృద్ధి చేసిన ప్లాట్లను అమ్మి వ్యాపారం చేసే బాధ్యత అమరావతి డెవలప్‌మెంట్ పార్ట్‌నర్ (ఏడీపీ)ది కాదు. ఇందుకోసం మరో మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ అమరావతి మేనేజిమెంట్ సర్వీసెస్ పేరుతో విజయవాడ అడ్రస్‌తో ఆర్‌వోసీలో రిజిస్టరయింది. దీని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా బెంజిమిన్ యాప్ నియుక్తులయ్యారు. స్టార్టప్ ఏరియా ఒప్పందం కోసం జరిగిన చర్చల్లో యాప్ సింగపూర్ ప్రభుత్వ అధికారి హోదాలో పాల్గొన్నారు. చివరికి విజయవాడలో రిజిస్టరయిన కంపెనీకి ఈవోగా అవతారం మారింది. అమరావతి కుంభకోణంలో ఇటువంటి వింతలు ఇంకెన్నో బయటపడాల్సి ఉన్నది.



చంద్రబాబు – ఈశ్వరన్‌ల మధ్య పెనవేసుకున్న బంధం ఈనాటిది కాదు. సుమారు రెండు దశాబ్దాల చరిత్ర ఉందని చెబుతారు. సింగపూర్‌లో చంద్రబాబుకు స్టార్ హోటళ్లు ఉన్నాయనే ప్రచారం ఎప్పటినుంచో ఉన్నది. ఈశ్వరన్ పదవీచ్యుతి, అరెస్ట్ వెనుక కూడా ఓ హోటల్ కనెక్షన్ ఉన్నది. ఆంగ్ బెంగ్ సెంగ్ అనే వ్యక్తి హోటల్ ప్రాపర్టీస్ లిమిటెడ్ అనే సంస్థ వ్యవస్థాపకుడు. మేనేజింగ్ డైరెక్టర్. అవినీతి, అక్రమ వ్యవహారాల ఆరోపణపై ఆంగ్‌ను సీపీఐబీ (కరప్ట్ ప్రాక్టీసెస్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో) అరెస్ట్ చేసింది. అతడిని విచారిస్తున్న నేపథ్యంలోనే ఈశ్వరన్ తీగ దర్యాప్తు సంస్థకు దొరికింది. ఆంగ్ బెంగ్ సెంగ్ కంపెనీ ఆధ్వర్యంలో యాభైకి పైగా నక్షత్ర హోటళ్లు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్నాయట. ఇవన్నీ ఆంగ్ సొంతం కావు. వివిధ దేశాల రాజకీయ ప్రముఖులు, సంపన్నుల సొమ్ముతో భారీ హోటళ్లు నిర్మించి వాటిని తాను లీజుకు తీసుకుని నడుపుతుంటాడు. మన దగ్గర ప్రచారంలో ఉన్నట్టు చంద్రబాబుకు స్టార్ హోటళ్లు ఉన్నాయా? ఉంటే అవి సింగపూర్‌లోనే ఉన్నాయా? లేక సింగపూర్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంకెక్కడైనా ఉన్నాయా అనే అంశంపై కచ్చితమైన సమాచారం లేదు. కానీ చంద్రబాబుకు ఈశ్వరన్‌తో ఉన్న బంధం, ఈశ్వరన్‌కు హోటల్ ప్రాపర్టీస్ అధిపతి ఆంగ్‌తో అనుమానాస్పద కనెక్షన్‌ను బట్టి చూస్తే చంద్రబాబు హోటళ్ల ప్రచారానికి బలం చేకూరుతున్నది.

చంద్రబాబు – ఈశ్వరన్‌ల మధ్య పెనవేసుకున్న బంధం ఈనాటిది కాదు. సుమారు రెండు దశాబ్దాల చరిత్ర ఉందని చెబుతారు. సింగపూర్‌లో చంద్రబాబుకు స్టార్ హోటళ్లు ఉన్నాయనే ప్రచారం ఎప్పటినుంచో ఉన్నది. ఈశ్వరన్ పదవీచ్యుతి, అరెస్ట్ వెనుక కూడా ఓ హోటల్ కనెక్షన్ ఉన్నది. ఆంగ్ బెంగ్ సెంగ్ అనే వ్యక్తి హోటల్ ప్రాపర్టీస్ లిమిటెడ్ అనే సంస్థ వ్యవస్థాపకుడు. మేనేజింగ్ డైరెక్టర్. అవినీతి, అక్రమ వ్యవహారాల ఆరోపణపై ఆంగ్‌ను సీపీఐబీ (కరప్ట్ ప్రాక్టీసెస్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో) అరెస్ట్ చేసింది. అతడిని విచారిస్తున్న నేపథ్యంలోనే ఈశ్వరన్ తీగ దర్యాప్తు సంస్థకు దొరికింది. ఆంగ్ బెంగ్ సెంగ్ కంపెనీ ఆధ్వర్యంలో యాభైకి పైగా నక్షత్ర హోటళ్లు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్నాయట. ఇవన్నీ ఆంగ్ సొంతం కావు. వివిధ దేశాల రాజకీయ ప్రముఖులు, సంపన్నుల సొమ్ముతో భారీ హోటళ్లు నిర్మించి వాటిని తాను లీజుకు తీసుకుని నడుపుతుంటాడు. మన దగ్గర ప్రచారంలో ఉన్నట్టు చంద్రబాబుకు స్టార్ హోటళ్లు ఉన్నాయా? ఉంటే అవి సింగపూర్‌లోనే ఉన్నాయా? లేక సింగపూర్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంకెక్కడైనా ఉన్నాయా అనే అంశంపై కచ్చితమైన సమాచారం లేదు. కానీ చంద్రబాబుకు ఈశ్వరన్‌తో ఉన్న బంధం, ఈశ్వరన్‌కు హోటల్ ప్రాపర్టీస్ అధిపతి ఆంగ్‌తో అనుమానాస్పద కనెక్షన్‌ను బట్టి చూస్తే చంద్రబాబు హోటళ్ల ప్రచారానికి బలం చేకూరుతున్నది.

ఆంగ్ బెంగ్ సెంగ్‌పై వచ్చిన ఆరోపణలేమిటి? వాటితో ఈశ్వరన్‌కు ఉన్న సంబంధమేమిటి? అసలు ఈశ్వరన్‌ను పట్టడానికే ఆంగ్‌ను ఎరగా వేశారా? ఈశ్వరన్‌పై జరగనున్న దర్యాప్తు ఎక్కడికి వెళ్తుంది? ఆ దర్యాప్తుకు అమరావతి తీగ తగులుతుందా లేదా? తగిలితే చంద్రబాబు భవిష్యత్తేమిటి? వగైరా ప్రశ్నలకు త్వరలోనే సమాధానం దొరకవచ్చు. సింగపూర్ దర్యాప్తులో అమరావతి కోణం తగిలినా తగలకపోయినా, ఈ ప్రాజెక్టులో లక్షల కోట్లు ఆర్జించాలనుకున్న చంద్రబాబు కల మాత్రం కరిగిపోయినట్టే భావించాలి. అంతేకాదు, వచ్చే ఎన్నికల్లో జగన్ సర్కార్‌ను ఎదుర్కోవడానికి చంద్రబాబు దగ్గర పనికొచ్చే అస్త్రాలేమీ లేవు. అమరావతినీ, రాజధానినీ ఒక మిడిల్‌క్లాస్ సెంటిమెంట్‌గా మార్చి రంగంలో నిలబడేందుకు బాబు దళం ఆపసోపాలు పడుతున్నది. సింగపూర్ దర్యాప్తులో అమరావతి తీగ తగిలితే, అంతర్జాతీయ స్థాయిలో వివాదాస్పదమైతే సెంటిమెంట్ పప్పులుడకవు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షం పరిస్థితి దయనీయంగా తయారైంది. ఎదురుదెబ్బలు వరసగా తగులుతున్నాయి. అధికార వైసీపీ కులమతాలకు అతీతంగా పేద, మధ్యతరగతి వర్గాల్లో గణనీయంగా బలపడింది. ఇటీవల జరిగిన రెండు మూడు సర్వేలు ఈ విషయాన్ని నిర్ధారించాయి. వైసీపీ ఓటింగ్ బలం 51 నుంచి 55 శాతం వరకు ఉంటుందని ఆ సర్వేలు ప్రకటించాయి. నిజానికి సర్వేలు కూడా అవసరం లేదు. పేదలు – పెత్తందార్ల ప్రయోజనాల నడుమ విభజన రేఖ ఏర్పడింది. ప్రతిపక్షం పేదల వ్యతిరేక వైఖరిని బహిరంగంగానే తీసుకుంటున్నది. ప్రజలకు అత్యంత ఉపయోగకరంగా మారిన వలంటీర్ వ్యవస్థను, గ్రామ సచివాలయాలను రద్దు చేయాలని ప్రతిపక్షం డిమాండ్ చేస్తున్నది. పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియంలో పాఠాలు చెప్పొద్దని అభాసుపాలైంది. ప్రాణాంతకమైన మద్యం ధరలు తగ్గించాలని కోరుతున్నది. పేదలకు ఇళ్లు కట్టించడంపై కోర్టులకెక్కుతున్నది. దశాబ్దాల తర్వాత వ్యవసాయ కూలీలకు భూపంపిణీ చేయతలపెడితే హర్షించలేకపోతున్నది. ఆరోగ్య విప్లవంపై అవాకులు పేలుతున్నది. ఈ తరహా ఆత్మహత్యాసదృశ వైఖరితో ప్రతిపక్షం తనను తాను హననం చేసుకుంటున్నది. ముప్పాతిక శాతం ప్రజల హృదయాల నుంచి వెలివేతకు గురవుతున్నది.


ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షం పరిస్థితి దయనీయంగా తయారైంది. ఎదురుదెబ్బలు వరసగా తగులుతున్నాయి. అధికార వైసీపీ కులమతాలకు అతీతంగా పేద, మధ్యతరగతి వర్గాల్లో గణనీయంగా బలపడింది. ఇటీవల జరిగిన రెండు మూడు సర్వేలు ఈ విషయాన్ని నిర్ధారించాయి. వైసీపీ ఓటింగ్ బలం 51 నుంచి 55 శాతం వరకు ఉంటుందని ఆ సర్వేలు ప్రకటించాయి. నిజానికి సర్వేలు కూడా అవసరం లేదు. పేదలు – పెత్తందార్ల ప్రయోజనాల నడుమ విభజన రేఖ ఏర్పడింది. ప్రతిపక్షం పేదల వ్యతిరేక వైఖరిని బహిరంగంగానే తీసుకుంటున్నది. ప్రజలకు అత్యంత ఉపయోగకరంగా మారిన వలంటీర్ వ్యవస్థను, గ్రామ సచివాలయాలను రద్దు చేయాలని ప్రతిపక్షం డిమాండ్ చేస్తున్నది. పేద పిల్లలకు ఇంగ్లిషు మీడియంలో పాఠాలు చెప్పొద్దని అభాసుపాలైంది. ప్రాణాంతకమైన మద్యం ధరలు తగ్గించాలని కోరుతున్నది. పేదలకు ఇళ్లు కట్టించడంపై కోర్టులకెక్కుతున్నది. దశాబ్దాల తర్వాత వ్యవసాయ కూలీలకు భూపంపిణీ చేయతలపెడితే హర్షించలేకపోతున్నది. ఆరోగ్య విప్లవంపై అవాకులు పేలుతున్నది. ఈ తరహా ఆత్మహత్యాసదృశ వైఖరితో ప్రతిపక్షం తనను తాను హననం చేసుకుంటున్నది. ముప్పాతిక శాతం ప్రజల హృదయాల నుంచి వెలివేతకు గురవుతున్నది.

మరోపక్క తెలుగుదేశం పార్టీకీ, చంద్రబాబుకూ గురుతుల్యునిగా, రక్షకునిగా నిలబడుతున్న రామోజీ పాపభాండం బద్దలైంది. 'మార్గదర్శి' పేరుతో చేసిన చట్టవిరుద్ధ నిర్వాకం మెడకు చుట్టుకుంటున్నది. ముదివయసు విచక్షణను కోల్పోయింది. అడ్డగోలు రాతలతో యెల్లో మీడియా విశ్వసనీయతను జారవిడుచుకున్నది. రెండు వారాలకే వారాహి యాత్ర రోత పుట్టించింది. నటుడి మనోధృతిపై జనంలో శంక మొదలైంది. ఒక ప్రయోగం నిష్ఫలమైంది. ఇప్పుడు బాబు కూటమికి ఎటుచూస్తే అటు చీకటి. పటు నిరాశ. అన్నీ దుశ్శకునములే! కొసరుగా ఇప్పుడీ సింగపూర్ పీడకల!!

vardhelli1959@gmail.com

ఆది నుంచి ఫిరాయింపులే!

సందర్భం



జిల్లా గోవర్ధన్

1958 నాటి సంగతి; పూనా(ఇప్పుడు పుణె) సిటీ, 'బృహన్ మహారాష్ట్ర కాలేజి ఆఫ్ కామర్స్'లో స్టూడెంట్స్ యూనియన్ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఇరు ప్యానల్ అభ్యర్థులు చివరి రోజు రాత్రి తమ తమ విజయావకాశాలను బేరీజు వేసుకున్నారు. ఓటమిని శంకించిన ఓ గ్రూప్ లీడర్ ఒక పథకం వేశాడు. ఆ రోజు మధ్య రాత్రి, ఆయన ఓ నలుగురు మిత్రులతో హాస్టల్ గదుల్లో నిద్రిస్తున్న కొందరు రైవల్ గ్రూప్ విద్యార్థులను నిద్ర లేపి తమ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా బతిమాలాడు. బదులుగా, తన టీం గెలిచిన వెంటనే కాలేజి యాజమాన్యంతో సంప్రదించి వారి సమస్యలను తీరుస్తానని హామీ ఇచ్చాడు. తెల్లవారే వరకు ఈ ప్రచారం నడిచింది. మరుసటి రోజు జరిగిన ఎన్నికల్లో ఆయన టీం గెలిచింది. ఆ టీమ్ లీడర్ మరెవరో కాదు– శరద్ చంద్ర గోవిందరావ్ పవార్.



కాలేజీలో డిగ్రీ పూర్తి చేసిన శరద్ రావ్ నేరుగా యూత్ కాంగ్రెస్ కార్యకర్త అయ్యారు. ఆ తర్వాత మహారాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎదిగి, తన 27వ ఏట (1967లో) ఎమ్మెల్యేగా ఎన్నికై వైబీ చవాన్ ఆశీస్సులతో మొదటిసారి రాష్ట్ర క్యాబినెట్ మంత్రి (1972) కూడా అయ్యారు. 1977 లోక్ సభ ఎన్నికలలో జనతా పార్టీ ప్రభంజనంతో కేంద్రంలో కాంగ్రెస్ అధికారం కోల్పోవటమే కాక, నిలువునా చీలి రెడ్డి కాంగ్రెస్, ఇందిరా కాంగ్రెస్ (1978)గా ఏర్పడ్డాయి. ఆ తర్వాత 1978లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ మెజారిటీ సాధించక పోవటంతో, రెండు కాంగ్రెస్ పార్టీలూ కూటమిగా ఏర్పడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. వసంత్ దాదా పాటిల్ (రెడ్డి కాంగ్రెస్) ముఖ్య మంత్రి అయ్యారు. శరద్ పవార్ రెవెన్యూ మంత్రిగా ఆయన క్యాబినెట్‌లో చేరారు. కొన్ని రోజులకే, జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్ర శేఖర్ (మాజీ కాంగ్రెస్ యంగ్ టర్క్ లీడర్) స్నేహాన్ని ఆసరా చేసుకుని, యంగ్ పవార్ కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పార్టీని వీడి, ప్రతిపక్ష జనతా పార్టీ మద్దతుతో తన 38వ ఏట (జూలై, 1978) ముఖ్య మంత్రి పీఠాన్ని కైవసం చేసుకున్నారు. తెల్లబోవటం కాకలు తీరిన రాష్ట్ర కాంగ్రెస్ నేతల వంతైంది. ఇందిరా గాంధీ 1980లో కేంద్రంలో తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో శరద్ పవార్ సీఎం పదవి కోల్పోయారు. ఆ తర్వాత 'కాంగ్రెస్ (సెక్యులర్)' పేరుతో కొంత కాలం ప్రాంతీయ పార్టీ నడిపించారు పవార్ సాబ్. ఇందిరాజీ హత్య తరువాత రాజీవ్ గాంధీ పవార్‌ను, తన పార్టీ బలగంతో తిరిగి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. 1988 జూన్‌లో శరద్ పవార్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు.

1991లో నాగపూర్ అసెంబ్లీ సమావేశాల్లో, శివసేన పార్టీ అంతర్గత కుమ్ములాటను గమనించి, ఆ పార్టీ ఓబీసీ నేత చగన్ భుజ్‌బల్, మరో 16 మంది శివ సేన ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ తీర్థం ఇప్పించారు సీఎం పవార్. ఆయన పర్యవేక్షణలో అలా శివసేన నుండి మొదటిసారిగా 'వలసలు' ప్రారంభమయ్యాయి. ఇక పదేళ్ల అనంతరం (2001) కొంతమంది పార్టీ నాయకులను తీసుకొని కాంగ్రెస్‌కు మరోసారి తిలోదకాలు ఇచ్చి, 'నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ' (ఎన్సీపీ)ని స్థాపించారు.

1989 నుండి మూడు దశాబ్దాల వరకు హిందూత్వ భావజాలం పులుముకున్న శివసేన – భారతీయ జనతాపార్టీలు ప్రతీ ఎన్నికలోనూ కలిసే పోటీ చేశాయి. 1995–2000 ఈ కూటమి ప్రభుత్వాన్నీ ఏర్పాటు చేసింది. ఇక 2019 ఎన్నికల్లో ఈ కూటమి 161 సీట్లు గెలవటంతో సునాయాసంగా ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సింది, కాని అది కుదర్లేదు. కారణం, ముఖ్యమంత్రి పదవి తమకే చెందాలని 56 సీట్లు గెలుచుకున్న శివసేన మారాం చేయడమే. ఇంతలో ఎన్సీపీ నాయకుడు అజిత్ పవార్, తన బాబాయి సీనియర్ పవార్‌ను కాదని భాజపాతో చేతులు కలిపారు. ఫలితంగా భాజపా నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్ సీఎం, అజిత్ డిప్యూటీ సీఎంగా ప్రభుత్వం ఏర్పడింది. తనను విడిచి వెళ్లిపోయిన ఎమ్మెల్యేలను పవార్ సాహెబ్ చాకచక్యంగా తిరిగి తన గూటిలోకి చేర్చుకోవటంతో అజిత్ పవార్ పాచిక పారలేదు. ఇక సంఖ్యా బలం కోల్పోయిన ఈ కొత్త ప్రభుత్వం, 60 గంటల్లోనే (26.11.2019న) పడిపోవటం విశేషం.

ఆ తర్వాత శరద్ పవార్ రంగంలోకి దిగి, తనదైన శైలిలో చకచకా పావులు కదిలించారు. 'మహా వికాస్ అఘాడి' పేరుతో శివసేన (56), ఎన్సీపీ (54), కాంగ్రెస్ (44) కూటమిని ఏర్పాటు చేసి, శివసేన కోరిక మేరకే ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రిగా (28.11.2019) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దీంతో 105 స్థానాలు గెలిచిన భాజపా ప్రతిపక్షానికి పరిమితం అయ్యింది. దిగ్భ్రాంతికి గురైన భాజాపా తనతో శివసేనకు ఉన్న మూడు పదుల దోస్తీని తుంచిన శరద్ పవార్‌తో పాటు, శివసేన అధినాయకుడు ఉద్ధవ్‌కూ గుణపాఠం నేర్పాలని పకడ్బందీగా ప్లాన్ చేసింది.

45 ఏళ్ల క్రితం పవార్ రచించిన రాజకీయ స్క్రిప్ట్‌నే ఆదర్శంగా తీసుకొని 2022 జూన్‌లో ఏక్‌నాథ్ శిందేని ఉపయోగించి శివసేననూ, 2023 జూలైలో అజిత్ పవార్‌ను ఉపయోగించి ఎన్సీపీని... చీల్చి కొత్త ప్రభుత్వాల ఏర్పాటును దిగ్విజయంగా పూర్తి చేసి 'టిట్ ఫర్ టాట్' అంది భారతీయ జనతా పార్టీ. ఔను మరి, మహారాష్ట్రలో ప్రస్తుతం ఈ రెండు ప్రాంతీయ పార్టీలు (శివసేన, ఎన్సీపీ) సంస్థాపరంగా చెదిరి, కోలుకోలేని స్థితిలో, తెరచాప తెగిన నావలా మారాయి.

చివరిగా, క్యాన్సర్ జబ్బుకు 'షికార్' అయినప్పటికీ, 83 ఏళ్ల సీనియర్ నేత శరద్ చంద్ర పవార్, 'నా టైర్డ్ హు, నా రిటైర్డ్ హు' అంటూ, ధీమాగా సానుభూతి కోసం (ఓటు బ్యాంకు), రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో ఇప్పుడు సుడిగాలి ప్రచారం మొదలు పెట్టారు. తన ఫార్ములా తనకే బెడిసి కొట్టడంతో ఏర్పడ్డ (రాజకీయ) గాయం, మరో వైపు పార్టీ అనుయాయులు తననే పార్టీ అధ్యక్ష పదవి నుండి వెలివేయటంతో ఒంటరి పక్షి అయ్యారు. ఈ సంక్షోభం నుంచి ఆయన ఎలా బయట పడతారో చూడాలి మరి!

(శరద్ పవార్ స్వీయచరిత్ర 'ఆన్ మై టర్మ్స్', వైభవ్ పురంధరే రాసిన 'ది రైజ్ ఆఫ్ ది శివసేన' ఆధారంగా)

వ్యాసకర్త విశ్రాంత పి.ఎఫ్. కమిషనర్ । 9819096949

రాజకీయోద్యమంతోనే...

కారంచేడు మాదిగలపై ఆధిపత్య కుల దురహంకారుల ఊచకోతకు ఈ నెల 17కు ముప్పై ఎనిమిది ఏళ్లు నిండుతాయి. మాదిగలపై, ఇతర దళిత కులాలపై రెండు తెలుగు రాష్ట్రాల్లో అంటరానితనం, గ్రామ బహిష్కారాలు, కులవివక్ష, అత్యాచారాలు, ఇప్పటికీ, ఇంకా పెద్దయెత్తున కొనసాగుతూనే ఉన్నాయి. ఉద్యోగాలకు పనికొచ్చే క్వాలిటీ, పోటీ చదువులకు మాదిగలు దూరం చేయబడుతూనే ఉన్నారు.

చరిత్ర పొడవునా రిజర్వేషన్ల అమలులో ఆధిపత్య కులాల ప్రభుత్వాలు తమ బాధ్యతగా, అమలు చేయాల్సిన రిజర్వేషన్లను ఒక 'హక్కు'గా గుర్తించడం లేదు. రిజర్వేషన్లను 'భిక్ష' స్థాయికి దిగజార్చాయి. అపహాస్యం పాలు చేశాయి. సమాజంలో ఎనభై ఐదు శాతంగా ఉన్న బలహీన వర్గాలతో కొత్త రూపాల్లో వెట్టిచాకిరీని ఆధిపత్య కులాల సమాజమూ, దాని ప్రభుత్వాలూ అనేక రూపాల్లో కొనసాగిస్తున్నాయి. అణగారిన కులాల, జాతుల, తెగల వారు తమ రాజకీయ చైతన్యంతోనే తమపై జరుగుతున్న అన్ని రకాల దోపిడీలను నిరోధించుకోగలరు. కోల్పోయిన అన్ని హక్కులను తిరిగి సాధించుకోగలరు. రాజకీయాల్లో చురుకైన పాత్ర, భాగస్వామ్యం ఉంటేనే సాధికారత సిద్ధిస్తుంది.



అందుకు పొలిటికల్ విజన్, పొలిటికల్ ప్రోగ్రామ్, త్యాగపూరితమైన నూతన నాయకత్వం, రాజకీయ సంస్థగా సంఘటితం కావడం జరగాలి. అప్పుడు మాత్రమే సామాజిక వనరుల్లో, అధికారంలో భాగస్వామ్యం సాధించుకోవడం మాదిగలకు సాధ్యం అవుతుంది. నాయకత్వాన్ని గుడ్డిగా నమ్మినందు వల్ల, రాజకీయ కార్యక్రమం లేనందు వల్ల, మాదిగ విద్యావంతులు చురుకుగా, సామాజిక బాధ్యతల్లో లేనందు వల్ల మాదిగ 'దండోరా' ఉద్యమం విఫలమైంది లేదా సాగతీతకు లోనైంది అనే సంగతిని మాదిగలు ఇకనైనా గ్రహించాలి.

దక్షిణ భారతదేశంలోని ప్రతి రాష్ట్రంలో, ముఖ్యంగా ఒక్కొక్క తెలుగు రాష్ట్రంలో, రాష్ట్రానికి సుమారు యాభై లక్షల మందికి పైచిలుకు జనాభాగా ఉన్న 'మాదిగలు', 'చిందు', 'బైండ్ల', 'మోచి', 'మాష్టి', 'సమగర', 'గోసంగి', 'గొడగలి', 'గొడారి' వంటి చర్మకార కులాల జనాభా ఉన్నది. వీరంతా రాష్ట్రం లేదా భాష, సామాజిక స్థితి పునాదిగా ప్రతి రాష్ట్రంలో స్థానిక, స్వీయ రాజకీయ పార్టీని, వ్యవస్థల్ని స్థాపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 'నా ఓటే నా సార్వభౌమాధికారం', 'మా ఓట్లే మా అధికారం' అనే రాజకీయ చైతన్యంతో సాగాలి. ఆధిపత్య కులాల రాజకీయ పార్టీలకు తమ ఓట్లను అప్పగించడానికి బదులుగా, సొంత రాజకీయ దృక్పథంతో, సొంత పార్టీ నిర్మాణం, సొంత రాజకీయ కార్యక్రమం, సొంత నాయకత్వాన్ని నిర్మించుకొని తమపై జరుగుతున్న దోపిడీ, పీడనల్ని మాదిగ చర్మకార కులాల వారు రద్దు చేసుకోవలసిన అవసరం ఉంది.

మాదిగల్లో వేల సంఖ్యలో ఉద్యోగులు, వృత్తి నిపుణులు, రచయితలు, కవులు, గాయకులు, తత్వవేత్తలు, వక్తలు, వనరులు కలిగినవారు, నాయకులు ఉన్నారు. వీరందరి మధ్య రాజకీయ సయోధ్య, సమన్వయం జరగాలి. వీరంతా రాజకీయ ఉద్యమానికి సిద్ధమవ్వాలి. రాజకీయ ప్రతిఘటన ద్వారానే తమపై కొనసాగుతున్న 'కారంచేడు' వంటి దమనకాండలనూ, సామాజిక అన్యాయాలనూ, అత్యాచారాలనూ ఆపుకోగలరు. ఈ రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించడమే కారంచేడు అమరులకు మనమిచ్చే నివాళి!

– కృపాకర్ మాదిగ, రాజకీయ విశ్లేషకుడు – సాంఘిక ఉద్యమ నాయకుడు

(రేపు కారంచేడు మృతవీరుల దినం)



సైకిల్ చక్రంతో కలుపుతీత యంత్రం

సైకిల్ చక్రం రైతు సమస్యకు పరిష్కారం చూపించింది. పెద్దపల్లి జిల్లా నందిమేడారం గ్రామానికి చెందిన రైతు మండపెల్లి శివయ్య పత్తిలో కలుపు నివారణకు యంత్రాన్ని తయారు చేశాడు. బీటెక్ చదువుతున్న కొడుకు సలహాలతో మూడు నాగళ్లు, ఇనుప పైపులు, చిన్న రాడ్లు, ఒక సైకిల్ చక్రంతో ఈ యంత్రం రూపొందించాడు. తాను తయారు చేసిన యంత్రం ఉంటే జోడెడ్లు అవసరం లేదని శివయ్య స్పష్టం చేశాడు. పది మంది చేసే పనిని ఇద్దరు, ముగ్గురితో చేయొచ్చని పేర్కొన్నాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి: మందకృష్ణ



బౌద్ధనగర్: రానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని ప్రధాని అభ్యర్థి హోదాలో మోదీ 2013లో హైదరాబాద్ వచ్చినప్పుడు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ నెల 8న వరంగల్ వచ్చిన మోదీకి వినతిపత్రం సమర్పించగా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం వర్గీకరణబిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టని యెడల ఆగస్టు రెండోవారంలో మాదిగలశక్తిని బీజేపీ చవిచూడాల్సి వస్తుందన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా దక్షిణాదిలోని మాదిగలతో హైదరాబాద్ శివారులో విశ్వరూప మహాసభ నిర్వహిస్తామని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఇంటి ముందు నుంచే తమ ధర్నాలు ప్రారంభిస్తామని చెప్పారు. కేంద్రం మీద ఒత్తిడి పెట్టే విధంగా కాంగ్రెస్ బాధ్యత తీసుకోవాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తెలంగాణ, ఏపీ సీఎంలు అఖిలపక్షాలను కేంద్రం వద్దకు తీసుకెళ్లాలని కోరారు.

2న వీరశైవ లింగాయత్‌ల మహాధర్నా




మహాధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పంజగుట్ట: వీరశైవ లింగాయత్‌లను వెంటనే ఓబీసీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగబలిజ సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. డిమాండ్ సాధనకు అన్ని వీరశైవ, లింగబలిజ సంఘాలు కలిసి ఆగస్టు 2వ తేదీన ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా, దీక్ష నిర్వహించనున్నట్లు తెలిపింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహాధర్నా పోస్టర్‌ను సంఘం గౌరవాధ్యక్షుడు పటోళ్ల సంగమేశ్వర్, అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప, జాతీయ లింగాయత్ సమన్వయ సమితి కన్వీనర్ అవినాశ్ బోసికర్, రాష్ట్ర బసవదళ్ అధ్యక్షుడు శంకర్ పటేల్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 2009లో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి తమను బీసీ జాబితాలో కలిపారని, 14 ఏళ్లు గడుస్తున్నా ఇంకా ఓబీసీ జాబితాలో చేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తాము విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నామని పేర్కొన్నారు. ఓబీసీల్లో చేర్చాలంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీతో తీర్మానం చేసి కేంద్రానికి పంపినా స్పందించడంలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు భారీ వాహన డ్రైవర్లకు లైసెన్సు రెన్యువల్ సమయంలో ఒకరోజు అవగాహన, శిక్షణ కార్యక్రమం ఇవ్వడాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్రం జారీ చేసిన ఆదేశాలకు అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారు. డబ్బు వసూలే ధ్యేయంగా ఏర్పడ్డ కొన్ని ప్రైవేటు డ్రైవింగ్ స్కూళ్లతో కుమ్మక్కైన కొందరు అధికారులు రవాణాశాఖలో తెరవెనక చక్రం తిప్పుతున్నారు.

లైసెన్స్ టు కిల్!

కేంద్రం ఆదేశాలను తుంగలో తొక్కి హెవీ మోటార్ లైసెన్స్ రెన్యువల్స్



రెన్యువల్ సమయంలో ఒకరోజు ప్రత్యేక శిక్షణ నిబంధన బేఖాతరు

- సిరిసిల్లలోని 'టైడ్స్' నుంచి కాకుండా తామే సర్టిఫికెట్లు జారీ చేసేలా ప్రైవేటు డ్రైవింగ్ స్కూళ్ల ఒత్తిడి
- తెరవెనక చక్రం తిప్పుతున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: ట్రక్కుల్లాంటి భారీ వాహనాలు నడిపే డ్రైవర్లకు హెవీ మోటార్ వెహికల్ లైసెన్స్ తప్పనిసరి. తమ లైసెన్సులను ప్రతి ఐదేళ్లకోసారి (ట్రాన్స్‌పోర్టు కేటగిరీ) రెన్యువల్ చేసుకోవాలి. అదే ప్రమాదకర పదార్థాలు తరలించే వాహనాల డ్రైవర్లు మూడేళ్లకోసారి రెన్యువల్ చేసుకోవాలి. రెన్యువల్ సమయంలో కేంద్రప్రభుత్వ నిర్దేశిత పద్ధతిలో డ్రైవర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలి. వాహనాలు నడపడం, జాగ్రత్తలు తీసుకోవడం, ప్రమాదాలను తప్పించేందుకు అనుసరించాల్సిన పద్ధతులు, ప్రమాదాన్ని నివారించలేని పక్షంలో వీలైనంతవరకు దాని తీవ్రత తగ్గేలా చూడటం, రోడ్లలో వస్తున్న మార్పులు.. ఇలా పలు అంశాల్లో ఆధునిక సాంకేతికత ఆధారంగా ఆ శిక్షణ కార్యక్రమం ఉండాలి. ఆ శిక్షణ పూర్తి చేసినట్టు సర్టిఫికెట్ వచ్చిన వారికి మాత్రమే లైసెన్స్ రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. కొందరు డ్రైవర్లు మధ్యలో కొన్నేళ్లపాటు వేరే ఉద్యోగంలో ఉండి, మళ్లీ డ్రైవింగ్‌కు వచ్చే వారుంటారు. వారు డ్రైవింగ్ ఆపేసిన తర్వాత స్కిల్స్ తగ్గిపోతాయన్నది శాస్త్రీయంగా నిరూపణ అయింది. ఇలాంటి వారికి ఈ తరహా శిక్షణ అవశ్యమని కేంద్రం పేర్కొంది.

రాష్ట్రంలో సిరిసిల్లలోని 'టైడ్స్' ఎంపిక

గత ఏడాది మన దేశంలో రోడ్డు ప్రమాదాల రూపంలో లక్షన్నర కంటే ఎక్కువ మంది చనిపోయారు. కొన్నేళ్లుగా ఈ సంఖ్య ఇదే రీతిలో నమోదవుతుండటంతో సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. దీంతో వాటిని నివారించేందుకు కేంద్రం కొన్ని సూచనలు చేసింది. అందులో భారీ వాహనాలను నడిపే డ్రైవర్లు తరచూ.. ఇటు డ్రైవింగ్, అటు వాహనాల్లో వస్తున్న మార్పులు, ఇతర అంశాలపై అవగాహన పెంచుకోవాల్సి ఉంది. రాష్ట్రంలో ఈ శిక్షణ కోసం సిరిసిల్ల సమీపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (టీఐడీఎస్)'ను ఎంపిక చేసింది.



రాజన్నసిరిసిల్ల జిల్లాలోని ఇంటిగ్రేటెడ్ డ్రైవింగ్ స్కూల్

ఏం జరుగుతోంది?

గతంలో ప్రైవేట్ డ్రైవింగ్ స్కూళ్ల నుంచే డ్రైవర్లు శిక్షణ సర్టిఫికెట్ పొందేవారు. చాలా డ్రైవింగ్ స్కూళ్లలో శిక్షణ ఇవ్వకుండానే, రూ.5 వేల వరకు వసూలు చేసి సర్టిఫికెట్ ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. దీన్ని తీవ్రంగా పరిగణించిన కేంద్ర ప్రభుత్వం... రూ.20 కోట్ల వ్యయంతో అత్యాధునికంగా తీర్చిదిద్దిన సిరిసిల్లలోని టైడ్స్‌ను శిక్షణకు ఎంపిక చేసింది. దీంతో కొందరు ప్రైవేటు డ్రైవింగ్ స్కూళ్ల యజమానులు పైరవీ అధికారులతో కుమ్మక్కయ్యారు. సిరిసిల్లకు వెళ్లి డ్రైవర్లు శిక్షణ తీసుకోవటం కష్టమని, అన్ని ప్రాంతాల్లో డ్రైవింగ్ స్కూళ్లు అందుబాటులో ఉన్నందున వాటిల్లో శిక్షణకు అవకాశం కల్పించాలన్న ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. దీన్ని అమల్లోకి తెచ్చేందుకు అధికారులు ఉన్నతస్థాయిలో ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. లైసెన్సు ఇచ్చేప్పుడు ప్రైవేటు డ్రైవింగ్ స్కూళ్ల నుంచి తెచ్చిన సర్టిఫికెట్లనే పరిగణనలోకి తీసుకున్నప్పుడు, రెన్యువల్‌కు అంగీకరిస్తే ఏంటన్న కోణంలో ఈ ఒత్తిళ్లు నడుస్తున్నట్టు సమాచారం. దీంతో రాష్ట్రంలో వేరువేరు ప్రాంతాల్లో అనుబంధ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న సూచనలు వస్తున్నాయి. అవసరమైతే, ఆర్టీసీ శిక్షణ కేంద్రాల సహకారం తీసుకోవాలని కూడా చెబుతున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక
- జగిత్యాల మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ
- కొందరు బాధ్యులు విధుల్లో లేకపోవడంపై ఆగ్రహం



జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో వైద్యులతో సమావేశం నిర్వహిస్తున్న మంత్రి హరీశ్‌రావు

జగిత్యాల: పేదలకు మెరుగైన వైద్యం అందించాలంటే వైద్యులు సమయపాలన పాటించాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. డాక్టర్లు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లోనే ఉండాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం జగిత్యాల జిల్లాలోని మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

సూపరింటెండెంట్ సహా పత్తాలేని పలువురు

మంత్రి వచ్చిన సమయంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు విధుల్లో లేరు. దీంతో విచారణకు మంత్రి ఆదేశించారు. ఇక స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వకుండానే మంత్రి మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు నేరుగా ఆస్పత్రికి చేరుకున్నారు. దాదాపు గంటన్నర పాటు వార్డుల్లో కలియ తిరిగారు. ఆ సమయంలో గైనకాలజిస్ట్ అరుణశ్రీ లీవ్ పెట్టకుండా వెళ్లిపోవడం, పీడియాట్రిక్‌లోని ఇద్దరు ప్రొఫెసర్లు విధుల్లో లేకపోవడం, అనస్తీషియా సిబ్బంది అందుబాటులో లేకపోవడంతోపాటు, ఆప్తాల్మజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుజాత లీవ్‌కు దరఖాస్తు చేయకుండా వెళ్లిపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బాధ్యులకు మెమో జారీచేయాలని డీఎంఏ రమేశ్‌రెడ్డిని ఆదేశించారు. కాగా, 'వైద్యులు ఉన్నా.. లేనట్లే'శీర్షికన ఈనెల 7న 'సాక్షి'కథనం ప్రచురించింది. స్పందించిన మంత్రి.. ఇటీవల జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆస్పత్రిలోని వైద్యులతో నేరుగా మాట్లాడారు. అంతటితో ఆగకుండా ఆకస్మికంగా తనిఖీకి వచ్చారు.

గుండెపోటుతో పంచాయతీ కార్మికుడి మృతి



మల్లయ్య

కౌటాల: కుమురంభీం జిల్లాలో ఓ పంచాయతీ కార్మికుడు గుండెపోటుతో మృతిచెందాడు. కౌటాల మండలం నదీమాబాద్ గ్రామంలో శనివారం ఈ ఘటన జరిగింది. గొడిసెల మల్లయ్య (57) అనే వ్యక్తి 30 ఏళ్లుగా ఇదే మండలంలోని నాగేపల్లి పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. శుక్రవారం కౌటాలలో నిర్వహించిన పంచాయతీ కార్మికుల సమ్మెలో పాల్గొని సాయంత్రం ఇంటికి వచ్చాడు. కార్మికులను ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తుందో.. లేదోననే మనోవేదనతో రాత్రి పడుకున్నాడు. శనివారం ఉదయం నిద్ర లేవలేదు. నిద్రలోనే గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కౌటాల ఎంపీడీఓ నస్రుల్లాఖాన్, ఎంపీఓ మౌనిక, కార్యదర్శులు సాయికృష్ణ, సంధ్య మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. కాగా, మల్లయ్య కుటుంబ సభ్యులను బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు. మల్లయ్య అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోశారు.

దిందా వాగుపై వంతెన ఎప్పుడు నిర్మిస్తారు?

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

చింతలమానెపల్లి(సిర్పూర్): ప్రజల ప్రాణాలంటే ప్రభుత్వానికి లెక్కే లేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన కుమురంభీం జిల్లా చింతలమానెపల్లి మండలం దిందా గ్రామ సమీపంలోని వాగు వద్ద లోలెవల్ వంతెనను పరిశీలించారు. వాగుపై కొత్త వంతెన ఎప్పుడు నిర్మిస్తారని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో దిందా వాగు దాటుతూ రామకృష్ణ అనే యువకుడు చనిపోయిన సమయంలో స్థానిక ఎమ్మెల్యే వాగు వద్ద కొబ్బరికాయ కొట్టి ఏడాదిలోగా వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ఎనిమిదేళ్లు గడిచినా వంతెన నిర్మాణం జరగలేదన్నారు. పల్లెల అభివృద్ధిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. 'మన మేమైనా ఇండియా– పాకిస్తాన్ బార్డర్‌లో ఉన్నామా.. లేక బంగ్లాదేశ్ సరిహద్దులో ఉన్నామా'అని ఆయన ఈ సందర్భంగా ధ్వజమెత్తారు.

అయ్యా.. వినండి

'అయ్యా.. కేసీఆర్‌గారు, మంత్రులు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కోనప్పగారు ఇక్కడి ప్రజల సమస్యలు వినండి. ఫామ్‌హౌస్‌లకు వెళ్లే రహదారులను అద్దంలా నిర్మించుకుంటున్నారు. బంగళాలు, సెక్రటేరియట్‌లు నిర్మిస్తారు.. కానీ ప్రజల ప్రాణాలు కాపాడేందుకు నిధులు లేవా' అని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు.



దిందా వాగు వద్ద మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

సహకార సంఘాల్లో ఔషధాల విక్రయం

- సొసైటీల్లో జన్ ఔషధి కేంద్రాల ఏర్పాటు
- గ్రామీణ ప్రజలకు తక్కువ ధరకే మందులు అందించడానికి కేంద్ర సర్కారు నిర్ణయం
- ప్రయోగాత్మకంగా జిల్లాకు నాలుగు సొసైటీలు ఎంపిక



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: వ్యవసాయాధారిత సేవలు అందించే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)లో ఇకపై ఔషధాలను కూడా విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చౌకగా లభించే జనరిక్ మందులను గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సహకార సంఘాలు రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు ఇప్పిస్తున్నాయి. ధాన్యం, ఇతర పంటల కొనుగోలుతోపాటు కొన్ని జిల్లాల్లో పెట్రోల్ బంక్‌లు, సూపర్‌మార్కెట్లు, వే బ్రిడ్జిలు కూడా ఈ సంఘాలు నిర్వహిస్తున్నాయి. ఇదే తరహాలో సొసైటీల్లో జనరిక్ మందులను విక్రయించాలని నిర్ణయించారు.

జిల్లాకు నాలుగు సంఘాలు ఎంపిక..

రాష్ట్రవ్యాప్తంగా 906 సహకార సంఘాలున్నాయి. ఇందులో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లకు అనుబంధంగా 798 పీఏసీఎస్‌లు ఉండగా, వాణిజ్య బ్యాంకులకు అనుబంధంగా మరో 108 సహకార సంఘాలున్నాయి. కాగా, ప్రయోగాత్మకంగా ఒక్కో జిల్లాకు నాలుగు జన్ ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. కేంద్రం సూచన మేరకు ఆర్థిక, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు పకడ్బందీగా నిర్వహించే నాలుగు సొసైటీల వివరాలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల సహకార శాఖాధికారులను ఆదేశించింది. ఈ ఆదేశాల ప్రకారం జిల్లా సహకార శాఖాధికారుల నుంచి ఎంపిక చేసిన సహకార సంఘాల (సొసైటీ) వివరాలు రాష్ట్ర ప్రభుత్వానికి అందాయి. ఇదిలా ఉంటే సంగారెడ్డి జిల్లానుంచి ఐదు సంఘాల పేర్లు పంపించారు. ఇస్మాయిల్‌ఖాన్‌పేట్, గుమ్మడిదల, ఝరాసంగం, ఏడాకులపల్లి, అందోల్ సహకార సంఘాలు ఇందులో ఉన్నాయి.

ఫార్మసీ లైసెన్స్‌లు ఎలా?

ఔషధాలు విక్రయించాలంటే ఫార్మసీ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. అయితే సొసైటీల్లో జన్ ఔషధి కేంద్రాలకు ఫార్మసీ లైసెన్సులు ఎలా? అనే అంశంపై ఇంకా మార్గదర్శకాలు రాలేదని సహకారశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఫార్మసిస్టును నియమించుకుని ఈ కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని కొందరు అధికారులు చెబుతున్నారు.

మహోద్యమంగా గ్రీన్ ఇండియా చాలెంజ్

- రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్



ఇంద్రకరణ్‌రెడ్డి, గంగులతో కలసి మొక్కలు నాటుతున్న సంతోష్‌కుమార్

జగిత్యాల: మూడు మొక్కలతో ప్రారంభమైన గ్రీన్ ఇండియా చాలెంజ్.. ప్రజల భాగస్వామ్యంతో మహోద్యమంగా మారిందని గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కొండగట్టు, కొడిమ్యాలలోని రిజర్వ్ ఫారెస్ట్‌ను మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, గంగుల కమలాకర్, సీఎస్ శాంతికుమారి, చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్‌తో కలిసి శనివారం సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలిదశలో కొడిమ్యాల రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని 1,094 ఎకరాల అటవీభూమిని దత్తత తీసుకుని అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మొక్కలు నాటామన్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ, కొండగట్టు క్షేత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు.

క్లుప్తంగా...

కీలక దిశగా చంద్రయాన్‌-3



చంద్రయాన్‌ కక్ష్య దూరాన్ని ఇలా పెంచుతారు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా)/తిరువనంతపురం/శ్రీహరికోట: విజయవంతంగా రోదసి చేరిన చంద్రయాన్‌–3 ప్రయోగం 41 రోజుల ముఖ్యమైన ప్రయాణంలో కీలక దశ దిశగా సాగుతోంది. దానికి జత చేసిన థ్రస్టర్లను మండించే ప్రక్రియను ఇస్రో శాస్త్రవేత్తలు శనివారం నుంచే మొదలు పెట్టారు. తద్వారా ఉపగ్రహాన్ని భూమి నుంచి కక్ష్య దూరం పెంచే ప్రక్రియ మొదలైంది. అంతిమంగా చంద్రయాన్‌–3ని ఆగస్టు 23న చంద్రుని దక్షిణ ధ్రువంపై వీలైనంత సున్నితంగా దించాలన్నది లక్ష్యం. చంద్రయాన్‌–3ని శుక్రవారం మధ్యాహ్నం ఏపీలోని తిరుపతి జిల్లా శ్రీహరికోటలో సతీశ్‌ ధవన్‌ అంతరిక్ష కేంద్రం (షార్‌) వేదికగా విజయవంతంగా ప్రయోగించడం తెలిసిందే. రోదసిలో దాని ప్రయాణం అద్భుతంగా సాగుతోందని తిరువనంతపురంలోని విక్రం సారాబాయి స్పేస్‌ సెంటర్‌ డైరెక్టర్‌ఎస్‌.ఉన్నికృష్ణన్‌ నాయర్‌ శనివారం మీడియాకు తెలిపారు. తొలి దశ ప్రయోగం నూటికి నూరు శాతం విజయవంతమైందన్నారు.

ఆజం ఖాన్‌కు మరో కేసులో రెండేళ్ల జైలు



రాంపూర్‌: 2019 నాటి రెచ్చగొట్టే ప్రసంగం కేసులో సమాజ్‌వాదీ పార్టీ నేత ఆజం ఖాన్‌(74)కు రెండేళ్ల జైలు శిక్ష పడింది. ఎంపీ/ఎమ్మెల్యేల కేసులను విచారించే ప్రత్యేక కోర్టు జడ్జి శోభిత్‌ బన్సల్‌ శనివారం ఈ మేరకు తీర్పు వెలువరించారు. 2019 లోక్‌సభ ఎన్నికల వేళ మిలక్‌ కొత్వాలీ ప్రాంతం ఖటనగరియా గ్రామంలో బహిరంగ సభలో చేసిన విద్వేష ప్రసంగం కేసులో ఆజంఖాన్‌కు కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. దాంతో, ఆయన శాసనసభ్యత్వంపై అనర్హత వేటుపడింది. ఆ తీర్పును సెషన్స్‌ కోర్టు కొట్టివేసింది. పలు కేసుల్లో దోషిగా ఉన్న ఆజంఖాన్‌ 27 నెలల పాటు జైలులో ఉన్నారు. 2022 మేలో సుప్రీం కోర్టు ఆజం ఖాన్‌కు మధ్యంతర బెయిల్‌ మంజూరు చేసింది.

నాటో నాటో.. ఎప్పుడో ఎప్పుడో!



ఎస్‌.రాజమహేంద్రారెడ్డి

నాటో (నార్త్‌ అట్లాంటిక్‌ ట్రీటీ ఆర్గనైజేషన్‌) సభ్య దేశాల సమావేశం ఉక్రెయిన్‌ ఆశలపై నీళ్లు చల్లింది. నాటో.. నాటో అంటూ కలవరించిన ఉక్రెయిన్‌ ఇప్పుడు నాటు.. నాటు అనక తప్పడం లేదు. గతేడాది మాడ్రిడ్‌లో జరిగిన సమావేశం అనంతరం స్వీడన్‌, ఫిన్లండ్‌లను కూటమిలో చేర్చుకుంటున్నట్టు నాటో ప్రకటించింది. ఆ రెండు దేశాలు జూలై 11, 12 తేదీల్లో లిథువేనియాలో జరిగిన సమావేశాలకు కూడా హాజరయ్యాయి. ఇదే బాటలో నాటో కూటమి తమను కూడా అక్కున చేర్చుకుంటుందని ఉక్రెయిన్‌ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆశించారు. కానీ ఆయన అనుకున్నదొకటైతే జరిగింది మరొకటి! ఉక్రెయిన్‌ భవిష్యత్తు తమతోనే ముడిపడి ఉంటుందని సమావేశం చివరి రోజు నాటో పేరుకు ఒక ప్రకటన చేసినా, ఆ భవిష్యత్తు ఎప్పుడు ఆరంభమవుతుందో మాత్రం స్పష్టం చేయలేదు. దాదాపు 500 రోజులకు పైగా రష్యాతో యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్‌కు పశ్చిమ దేశాలు ఆయుధ సామగ్రితో పాటు యుద్ధ ట్యాంకులు, ఫైటర్‌ జెట్‌లను సమకూరుస్తూ అండగా ఉన్నప్పటికీ, ఆ సాయం వెనక ఆయా దేశాల ఊగిసలాట ధోరణి జెలెన్‌స్కీని కలవరపరుస్తూనే వస్తోంది. ప్రతిదానికీ చేతులు జోడించి ఎదురు చూడాల్సి రావడం ఆయనకు మింగుడు పడటం లేదు. నాటో కూటమిలోకి ప్రవేశం దక్కితే ఈ అవస్థ ఉండదన్నది జెలెన్‌స్కీ ఆలోచన. నిజానికి నాటోలో చేరితే ఉక్రెయిన్‌ రక్షణ బాధ్యతను కూటమి దేశాలన్నీ సంయుక్తంగా మోయాల్సి ఉంటుంది. ఉక్రెయిన్‌ భవితవ్యాన్ని, రష్యాతో జరుగుతున్న యుద్ధ గమనాన్ని శాసించే నాటో సభ్యత్వ వ్యవహారంలో నిజానికి ఏం జరిగింది? ఉక్రెయిన్‌కు సభ్యత్వమిచ్చేందుకు ఎందుకు నాటో పచ్చజెండా ఊపలేదు? అసలు జెలెన్‌స్కీ ఆశించిందేమిటి? వివరాల్లోకి వెళ్దాం...

సభ్యత్వంపై ఉక్రెయిన్‌ను ఊరిస్తున్న నాటో

రష్యాతో యుద్ధం ముగిసేదాకా ఇంతే!

తెలిసీ తెలివిగా తన్నాడుతున్న జెలెన్‌స్కీ

జెలెన్‌స్కీ ఏం ఆశిస్తున్నదీ సుస్పష్టం. గత సెప్టెంబరుకు ముందు ఇదే విషయంపై ఆయన మాట్లాడుతూ, నాటోలో ఉక్రెయిన్‌కు సభ్యత్వం కావాలన్న తన అభ్యర్థనను 2023 జూలైలో లిథువేనియాలో జరిగే కూటమి సమావేశంలో వ్యక్తం చేస్తానని అన్నారు. కానీ ఈ వ్యాఖ్యల్లో మొక్కుబడితనమే తప్ప గాఢమైన కోరికేమీ ధ్వనించలేదు. ఉక్రెయిన్‌ ప్రాంతాలైన లుహాన్స్క్‌, డొనెట్స్క్‌, ఖెర్సన్‌, జపోరిజియాలను తమ భూభాగాలుగా గుర్తిస్తున్నట్టు రష్యా

అనుకున్నదొక్కటి...

అధ్యక్షుడు పుతిన్‌ గత సెప్టెంబరులో ప్రకటించగానే జెలెన్‌స్కీ స్వరం మారిపోయింది. నాటోలో తమకు పూర్తి సభ్యత్వమిచ్చే అంశాన్ని ఆగమేఘాల మీద పరిశీలించాల్సిందిగా జెలెన్‌స్కీ అభ్యర్థించడం మొదలెట్టారు. అంటే నాటో సభ్యత్వాన్ని ఉక్రెయిన్‌ సీరియస్‌గా ఆశిస్తున్నది కేవలం ఏడాది క్రితం నుంచేనని సుస్పష్టం. నాటో మార్గదర్శకాల ప్రకారం యూరప్‌లోని ఏ దేశమైనా సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. పన్నెండు దేశాల కూటమిగా మొదలైన నాటో సభ్య దేశాల సంఖ్య ఇప్పుడు 32కు పెరిగింది. లిథువేనియాలోని విల్నియస్‌లో జరిగిన నాటో భేటీకి హాజరైన జెలెన్‌స్కీ పనిలో పనిగా లుకిస్కస్‌ స్క్వేర్‌లో జరిగిన ఓ సభలో తమ అభీష్టాన్ని అక్కడి జనాలతో పంచుకున్నారు. సభా వేదికపై 'ఉక్రెయిన్‌–నాటో 33' నినాదాన్ని కూడా ప్రదర్శించడం విశేషం.

లుకిస్కస్‌ స్క్వేర్‌ సభా వేదికపై ప్రదర్శితమైన 'ఉక్రెయిన్‌–నాటో 33' బ్యానర్‌ అక్కడివారి మది దోచినా, ఉక్రెయిన్‌ మెడలో ఇప్పటికిప్పుడే 'నాటో–33' గుర్తింపు కార్డు పడటం మాత్రం నాటో నేతల్లోనే చాలామందికి అసలు ఇష్టం లేదు. అందుకే 'అప్పుడే కాదం'టూ ఉక్రెయిన్‌ అభ్యర్థనను సున్నితంగా తిరస్కరించారు. ఒకవైపు



నాటో నేతలకే ఇష్టం లేదు...!


యుద్ధం కొనసాగుతుండగా మరోవైపు ఉక్రెయిన్‌కు సభ్యత్వాన్ని మంజూరు చేస్తే నాటో దేశాలన్నీ రష్యాపై ప్రత్యక్షంగా యుద్ధ బరిలోకి దిగాల్సి వస్తుంది. నాటో నిబంధనల ప్రకారం ఏ సభ్య దేశంపై దాడి జరిగినా కూటమిలోని దేశాలన్నీ సంయుక్తంగా ఎదురు దాడి చేయాల్సి ఉంటుంది. నాటో నిబంధనల్లోని ఆర్టికల్‌–5 ఈ విషయాన్ని స్పష్టంగా నిర్దేశించింది. నాటో చరిత్రలో ఇప్పటిదాకా ఒకే ఒక్కసారి, అమెరికాపై 9/11 ఉగ్ర దాడులు జరిగినప్పుడు ఈ నిబంధన అమలైంది. ఒకవేళ ఇప్పుడు గనక ఉక్రెయిన్‌కు సభ్యత్వమిస్తే కూటమిలోని మిగతా 32 దేశాలూ రష్యాపై యుద్ధానికి దిగాల్సి వస్తుంది. 'నాటో దేశాల భూభాగంలో ఒక్క అంగుళం కూడా వదులుకోవడానికి మేం సిద్ధంగా లేం. ఇప్పుడు యుద్ధం నడిమధ్యలో ఉంటే తలపడటానికి సిద్ధంగా ఉన్నాం. అసలు ఆ మాటకొస్తే ఇప్పుడు మేమంతా రష్యాతో యుద్ధం చేస్తున్నట్టే లెక్క' అని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ వ్యాఖ్యానించడం గమనార్హం. నాటో కూటమి తమ సభ్య దేశాల పట్ల ఎంతటి అంకితభావంతో ఉంటుందో బైడెన్‌ ఈ వ్యాఖ్యలతో ప్రపంచానికి చాటారు. అయితే బైడెన్‌ వ్యాఖ్య వెనక అసలు ఉద్దేశాన్ని బ్రిటన్‌ రక్షణ మంత్రి జెన్‌ వాలెస్‌ కుండబద్దలు కొట్టారు. 'ప్రస్తుతం యుద్ధం మధ్యలో ఉన్న దేశాన్ని ఇప్పటికిప్పుడు కూటమిలోకి ఆహ్వానించలేం. అలా చేయడం మొత్తం కూటమినీ యుద్ధభూమిలోకి లాగడమే అవుతుంది'' అంటూ అసలు విషయం చెప్పకనే చెప్పారు. యుద్ధం ముగిశాక గెలుపోటములతో నిమిత్తం లేకుండా వీలైనంత త్వరగా ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చుకుంటామని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌ సభ్యత్వానికి నాటో ఇలా సూత్రప్రాయంగా అంగీకరించినా అధికార ముద్ర ఎప్పుడు పడుతుందో చెప్పలేం. యుద్ధం ముగిసేదాకా ఉక్రెయిన్‌కు నాటో మోక్షం లేదని స్పష్టంగా తెలిసిపోతున్నా, యుద్ధం ఎప్పుడు ముగుస్తుందనేది మాత్రం అస్పష్టం!

జెలెన్‌స్కీకీ ముందే తెలుసు...!

యుద్ధం జరుగుతుండగా నాటో సభ్యత్వం రావడం కల్లేనని జెలెన్‌స్కీకీ తెలుసు. అయితే రష్యాపై ఒత్తిడి పెంచేందుకు ఆయన పదేపదే నాటో సభ్యత్వం కోసం డిమాండ్‌ చేస్తూ వస్తున్నారు. ఆయన గతంలో చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. 'యుద్ధం జరుగుతుండగా నాటో సభ్యత్వం మాటే ఉండదు. మాకది ఇష్టం లేక కాదు, కానీ అసాధ్యం' అని జెలెన్‌స్కీ ఐదారు నెలల క్రితం కీవ్‌లో తన మనసులో మాటను సుస్పష్టంగా చెప్పారు. అయితే యుద్ధం ముగిసిన వెంటనే నాటో సభ్యత్వం లభించేలా ఓ రోడ్‌మ్యాప్‌ను ఖరారు చేసుకోవడానికే పదేపదే ఇలా సభ్యత్వం కోసం డిమాండ్‌ చేస్తూ వస్తున్నారు. సభ్యత్వంపై ఎటూ తేల్చని నాటో కనీసం ఆ దిశగా ఎలాంటి కార్యాచరణనూ ప్రకటించకపోవడం ఉక్రెయిన్‌ అధ్యక్షుడిని నిరాశకు గురి చేసింది. ఇది ఒకరకంగా ఉక్రెయిన్‌ను అగమ్యగోచరమైన పరిస్థితిలోకి నెట్టిందనే భావించాలి. ఉక్రెయిన్‌ ఉక్రెయిన్‌గా నిలవాలంటే యుద్ధాన్ని గెలవాలి, లేదా రష్యాతో సంధి కుదుర్చుకోవాలి. ఈ రెండు పరిస్థితుల్లోనే ఉక్రెయిన్‌ నాటోలో చేరగలుగుతుంది. ఓడిపోతే ఉక్రెయిన్‌ రష్యాలో అంతర్భాగంగా మారిపోతుంది. అప్పుడిక దానికి నాటో ప్రస్తావన అవసరమే లేకుండా పోతుంది. గెలుపోటములను కాలమే నిర్ణయిస్తుంది. కానీ ఇప్పటిదాకా 'అయితే గియితే'లో ఉన్న నాటో సభ్యత్వ అంశం 'ఆ సుదినం ఎప్పుడు' అనేదాకా అయితే వచ్చింది. ప్రస్తుతానికి ఉక్రెయిన్‌కు ఊరటనిచ్చే విషయం ఇదొక్కటే. యుద్ధం త్వరలో ఓ కొలిక్కి వచ్చి ఉక్రెయిన్‌కు నాటో తలుపులు తెరుకోవాలని కోరుకుందాం! తెరుచుకుంటాయనే ఆశిద్దాం!!

ఉక్రెయిన్‌లో దక్షిణ కొరియా అధ్యక్షుడు

కీవ్‌: రష్యా దురాక్రమణకు లోనైన తమ భూభాగాలను తిరిగి దక్కించుకునేందుకు సర్వం ఒడ్డుతున్న ఉక్రెయిన్‌కు మద్దతు పలుకుతున్న దేశాల సంఖ్య పెరుగుతుంది. శనివారం దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్‌ సుక్‌ ఇయోల్‌ ఉక్రెయిన్‌లో పర్యటించారు. నాటో భేటీ కోసం లిథువేనియాకు వచ్చిన యూన్‌ సతీసమేతంగా ఉక్రెయిన్‌ వెళ్లారు. ఉక్రెయిన్‌ సేనల తీవ్ర ప్రతిఘటనలతో వెనుతిరుగుతూ రష్యా మూకలు సృష్టించిన నరమేధానికి సాక్షిగా నిలిచిన బుచా, ఇర్పిన్‌ నగరాల్లోని ఘటనాస్థలాలను యూన్‌ సందర్శించి మృతులకు నివాళులర్పించారు. యుద్ధంలో తలమునకలైన ఉక్రెయిన్‌కు మానవీయ, ఆర్థికసాయం అందిస్తూ ద.కొరియా తనవంతు చేయూతనందిస్తోంది. కానీ ఆయుధసాయం మాత్రం చేయట్లేదు. యుద్ధంలో మునిగిన దేశాలకు ఆయుధాలు అందించకూడదనే తన దీర్ఘకాలిక విధానాన్ని ద.కొరియా ఇంకా కొనసాగిస్తోంది. అయితే మందుపాతరలను గుర్తించి నిర్వీర్యంచేసే ఉపకరణాలు, అంబులెన్సులు, సైనికయేతర వస్తువులను మాత్రం అందించేందుకు తమ సమ్మతి తెలిపింది. ఉక్రెయిన్‌ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోనూ యూన్‌ భేటీ అయ్యారు. పలు అంశాలపై చర్చించారు. యుద్ధ తీవ్రంకాకుండా ఆపగలిగే పరిష్కార మార్గాలను అన్వేషించాలని నిర్ణయించారు.



యూన్‌, జెలెన్‌స్కీ భేటీ దృశ్యం

ఎమ్మెల్యేల్లో 44% మంది నేరచరితులు

ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా వెల్లడైందన్న ఏడీఆర్‌

న్యూఢిల్లీ: దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన శాసనసభ్యుల్లో సుమారు 44 శాతం మంది నేరచరితులున్నారని అసోసియేషన్‌ ఫర్‌ డెమోక్రాటిక్‌ రిఫార్మ్స్‌(ఏడీఆర్‌) తేల్చింది. రాష్ట్రాల అసెంబ్లీలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఎన్నికైన ప్రస్తుత శాసనసభ్యులు ఎన్నికల సంఘానికి స్వయంగా అందజేసిన అఫిడవిట్లను పరిశీలించిన ఏడీఆర్‌, నేషనల్‌ ఎలక్షన్‌ వాచ్‌(ఎన్‌ఈడబ్ల్యూ)లు ఈ విషయాన్ని తేల్చాయి. దేశంలోని 28 రాష్ట్రాల అసెంబ్లీలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 4,033 ఎమ్మెల్యేలకు గాను 4,001 మంది ఎమ్మెల్యేల అఫిడవిట్‌లను పరిశీలించాయి. వీరిలో 1,136 మంది అంటే 28% మందిపై హత్య, హత్యాయత్నం, కిడ్నాప్‌ తదితర తీవ్రమైన క్రిమినల్‌ కేసులున్నాయని పేర్కొంది.

'ఫ్రెంచి పరేడ్‌'కు 'రాఫెల్‌ పాసు'!

మోదీపై రాహుల్‌ వాగ్బాణాలు



న్యూఢిల్లీ: రాఫెల్‌ యుద్ధవిమానాల కొనుగోలు ఒప్పందం కోసం ఫ్రాన్స్‌లో పర్యటించడం ద్వారా బాస్టిల్‌ డే కవాతులో పాల్గొనే అవకాశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సంపాదించారని కాంగ్రెస్‌ నేత రాహుల్‌ గాంధీ ఎద్దేవా చేశారు. ''మణిపూర్‌లో ఓ వైపు విద్వేషాగ్ని వ్యాపిస్తోంది. ఈ అంశాన్ని యూరప్‌ పార్లమెంట్‌ కూడా పట్టించుకుని చర్చకు పెట్టింది! కానీ మన ప్రధాని మాత్రం అసలేం పట్టనట్లు కూర్చున్నారు. మణిపూర్‌పై ఇంతవరకు ఒక్కమాటా మాట్లాడలేదు. పైగా రాఫెల్‌ ఒప్పందంతో పారిస్‌లో బాస్టిల్‌ డే కవాతులో పాల్గొనే పాస్‌ సంపాదించారు'' అంటూ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్‌ నేత జైరాం రమేశ్‌ కూడా, ''1997లో రిచర్డ్‌ నెల్సన్‌ 'ది మూన్‌ అండ్‌ ది గెట్టో' అని ఒక వ్యాసం రాశారు. అందులో ఏముందంటే.. అద్భుత సాంకేతికత సాధించిన అమెరికా చంద్రుడిపై కాలుమోపింది. కానీ స్వదేశంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం కనుగొనలేకపోయింది. ఇప్పుడు ఆ వ్యాసాన్ని భారత్‌లో మాత్రం 'ది మూన్‌ అండ్‌ మణిపూర్‌'గా చదువుకోవాలి'' అని విమర్శించారు.

విసుగెత్తిన యువరాజు: బీజేపీ కౌంటర్‌

రాహుల్‌ విమర్శలపై బీజేపీ నేత స్మృతి ఇరానీ స్పందించారు. 'ఫ్రాన్స్‌లో నిరసనలు, అల్లర్ల విషయాన్ని ప్రస్తావించని ఈయూ పార్లమెంట్‌.. భారత్‌లో మణిపూర్‌ అంశంపై చర్చకు సిద్ధమవుతాయి. ఇదే రాహుల్‌ ఆశించేది. భారత అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని ఆయన కోరుకుంటున్నారు. ఫ్రాన్స్‌ అత్యున్నత పురస్కారంతో మోదీని సత్కరించడంతో విసుగు చెందిన యువరాజు 'మేక్‌ ఇన్‌ ఇండియా' లక్ష్యాలను తుంగలో తొక్కుతున్నారు. ప్రజలు తిరస్కరించిన రాహుల్‌ రక్షణ ఒప్పందాలు తమ హయాంలో జరగలేదే అని తెగ బాధపడిపోతున్నారు' అని స్మృతి ఇరానీ ఆరోపించారు. ఇన్నేళ్లూ మణిపూర్‌ సమస్యను అపరిష్కృతంగా తయారుచేసిన ఘనత కాంగ్రెస్‌దే అని బీజేపీ నేత అమిత్‌ మాలవీయ ఆగ్రహం వ్యక్తంచేశారు. ''లైంగిక వేధింపులపై ఉద్యమిస్తున్న మహిళా అథ్లెట్లకు ఈ మహిళా నేత కనీస మద్దతు ఇవ్వరు. కానీ రాహుల్‌పై విమర్శలకు రెడీ అవుతారు'' అంటూ స్మృతిపై కాంగ్రెస్‌ మహిళా నేత సుప్రియా శ్రీనాథే విమర్శలు గుప్పించారు.

సొంత కరెన్సీలోనే చెల్లింపులు





అబుధాబిలో గౌరవవందనం స్వీకరిస్తున్న మోదీ. మోదీకి స్వాగతం పలుకుతున్న యూఏఈ అధ్యక్షుడు షేక్‌ మొహమ్మద్‌ అల్‌నహ్యాన్‌


- ఫాస్ట్‌ పేమెంట్ల అనుసంధానం
- భారత్‌, యూఏఈ కీలక ఒప్పందాలు
- మోదీ, యూఏఈ అధ్యక్షుడు చర్చలు

అబుధాబి: భారత్‌–యూఏఈ సంబంధాలు మరో కీలక మైలురాయికి చేరుకున్నాయి. వాణిజ్య చెల్లింపులను ఇకపై సొంత కరెన్సీలోనే చేపట్టాలని రెండు దేశాలు నిర్ణయించుకున్నాయి. ఫ్రాన్సులో పర్యటన ముగించుకున్న ప్రధాని నరేంద్ర మోదీ తిరుగు ప్రయాణంలో శనివారం యూఏఈ రాజధాని అబుదాబిలో ఆగారు. అధ్యక్షుడు షేక్‌ మహమ్మద్‌ బిన్‌ జాయెద్‌ అల్‌ నహ్యాన్‌తో సమావేశమయ్యారు. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సెపా) కుదిరిన ఏడాదిలోనే రెండు దేశాల మధ్య వాణిజ్యం 20 శాతం మేరకు పెరగడంపై నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం 85 బిలియన్‌ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యం ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరిగే జీ20 భేటీ సమయానికి 100 బిలియన్‌ డాలర్లకు చేరుకోవాలని ఆకాంక్షించారు. వాణిజ్య చెల్లింపులను సొంత కరెన్సీలోనే చేపట్టాలని, ఇండియన్‌ యూనిఫైడ్‌ పేమెంట్స్‌ వ్యవస్థ(యూపీఐ)ను యూఏఈకి చెందిన ఇన్‌స్టంట్‌ పేమెంట్‌ ప్లాట్‌ఫాం(ఐపీపీ)తో అనుసంధానం చేయాలని అంగీకారానికి వచ్చారు. రెండు దేశాల పేమెంట్స్‌ మెసేజింగ్‌ సిస్టమ్స్‌ను లింక్‌ చేసే విషయం పరిశీలించాలని కూడా నిర్ణయించారు. ఢిల్లీ ఐఐటీ క్యాంపస్‌ను యూఏఈలో ఏర్పాటు చేసే విషయమై రెండు దేశాల విద్యాశాఖాధికారులు ఎంవోయూపై సంతకాలు చేశారు. పరస్పర వాణిజ్య చెల్లింపులను భారత్‌ కరెన్సీ రూపాయి, యూఏఈ కరెన్సీ దిర్హంలో చేసేందుకు ఉద్దేశించిన ఎంవోయూపై రెండు దేశాల సెంట్రల్‌ బ్యాంకుల ప్రతినిధులు సంతకాలు చేశారని మోదీ తెలిపారు. ఇరు దేశాల మధ్య బలపడుతున్న ఆర్థిక సహకారం, పరస్పర విశ్వాసానికి ఇది నిదర్శనమన్నారు. ఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సు కాప్‌28 అధ్యక్ష బాధ్యతల్లో ఉన్న యూఏఈకి భారత్‌ మద్దతుగా నిలుస్తుందని ప్రధాని తెలిపారు. మరింత సుస్థిర అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై కాప్‌28 అధ్యక్షుడిగా నియమితులైన సుల్తాన్‌ అల్‌ సబేర్‌తో చర్చించానన్నారు. కాప్‌28 వార్షిక సమావేశాలు దుబాయ్‌లో నవంబర్‌ 30 నుంచి డిసెంబర్‌ 12వరకు జరగనున్నాయి. ఈ సమావేశాలకు మోదీని సబేర్‌ ఆహ్వానించారు. పర్యావరణ మార్పులకు గురైన దేశాలకు వాగ్దానం ప్రకారం 100 బిలియన్‌ డాలర్ల సాయం అందించాలని సంపన్న మోదీ, అల్‌ నహ్యాన్‌ సంయుక్త ప్రకటనలో కోరారు. ''యూఏఈ అధ్యక్షునితో భేటీ సంతోషం కలిగించింది. అభివృద్ధిపై ఆయన దార్శనికత ప్రశంసనీయం. భారత్‌–యూఏఈ సంబంధాలపై సమగ్రంగా చర్చించాం'' అని మోదీ ట్వీట్‌ చేశారు. అంతకుముందు అబుధాబి అధ్యక్ష భవనం వద్ద నహ్యాన్‌ మోదీకి ఎదురేగి ఆత్మీయ ఆలింగనంతో స్వాగతం పలికారు. మోదీ సైనిక వందనం స్వీకరించారు. అనంతరం మోదీకి నహ్యాన్‌ విందు ఇచ్చారు. రాత్రికి ప్రధాని భారత్‌ చేరుకున్నారు. యూఏఈ సెంట్రల్‌ బ్యాంకుతో ఒప్పందం అన్ని లావాదేవీలకూ వర్తిస్తుందని ఆర్‌బీఐ తెలిపింది. ''పెట్టుబడులు, రెమిటెన్స్‌లకు దీనితో ఊతం లభిస్తుంది. యూఏఈలోని భారతీయులకు లావాదేవీల చార్జీలు తగ్గడమే గాక సమయం కూడా కలిసొస్తుంది'' అని తెలిపింది.

అనర్హతపై సుప్రీంకు రాహుల్‌

న్యూఢిల్లీ: మోదీ ఇంటి పేరు వివాదానికి సంబంధించిన క్రిమినల్‌ పరువు నష్టం కేసులో కాంగ్రెస్‌ నేత రాహుల్‌గాంధీ సుప్రీంకోర్టు తలుపు తట్టారు. తనను దోషిగా ఖరారు చేస్తూ సూరత్‌ కోర్టు ఇచ్చిన తీర్పుపై స్టేకు గుజరాత్‌ హైకోర్టు నిరాకరించడాన్ని సవాలు చేశారు. రాహుల్‌ తరఫు న్యాయవాది శనివారం ఈ మేరకు సుప్రీంకోర్టులో అపీలు దాఖలు చేశారు. రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ గత మార్చి 23న సూరత్‌ కోర్టు తీర్పు వెలువరించడం, 24 గంటల్లోపే ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ స్పీకర్‌ నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. దీనిపై స్టే కోరుతూ రాహుల్‌ గుజరాత్‌ హైకోర్టును ఆశ్రయించారు. అయితే రాజకీయాల్లో స్వచ్ఛత అవసరమని పేర్కొంటూ కింది కోర్టు తీర్పుపై స్టే ఇచ్చేందుకు గుజరాత్‌ హైకోర్టు జూలై 7న నిరాకరించింది. రాహుల్‌కు రెండేళ్ల శిక్ష సరైనదేనని న్యాయమూర్తి జస్టిస్‌ హేమంత్‌ ప్రచక్‌ ఆ సందర్భంగా పేర్కొన్నారు. ''రాహుల్‌పై నమోదైన కేసు వ్యక్తిగత పరువు నష్టానికి సంబంధించినది కాదు. సమాజంలో ఒక పెద్ద వర్గాన్ని ప్రభావితం చేసిన వ్యాఖ్యలకు సంబంధించినది. పైగా రాహుల్‌ లోక్‌సభ సభ్యుడు. దేశాన్ని 50 ఏళ్లకు పైగా దేశాన్ని పాలించిన రెండో అతి పెద్ద పార్టీకి అధ్యక్షునిగా ఉన్నారు. వేలాది మందిని ఉద్దేశించి 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తూ మోదీ ఇంటి పేరుపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. పైగా దీన్ని వీలైనంత సంచలనాత్మకంగా మార్చి, తద్వారా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే ఉద్దేశంతో ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ పేరును ఉద్దేశపూర్వకంగా ప్రస్తావించారు. అంతేగాక హిందూత్వ సిద్ధాంతవాది వి.డి. సావర్కర్‌ తదితరులపై పరువు నష్టం వ్యాఖ్యలకు సంబంధించి రాహుల్‌ ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఇప్పటికే 10 క్రిమినల్‌ కేసులు ఎదుర్కొంటున్నారు'' అని తీర్పులో న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ కేసులో స్టే లభిస్తే రాహుల్‌ లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణ జరిగేది.

ఆస్పత్రిలో చేరిన నెతన్యాహు



జెరుసలేం: ఇజ్రాయెల్‌ ప్రధానమంత్రి బెంజమిన్‌ నెతన్యాహు(73) శనివారం అకస్మాత్తుగా ఆస్పత్రిలో చేరారు. టెల్‌అవీవ్‌లోని షెబా ఆస్పత్రిలో నెతన్యాహుకు చికిత్స అందిస్తున్నారని ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొంది. ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని, వైద్య పరీక్షలు జరుగుతున్నాయని తెలిపింది. ఇంతకు మించి వివరాలు వెల్లడించలేదు. ఇంటి దగ్గర ఉండగా సొమ్మసిల్లి పడిపోవడంతో నెతన్యాహును ఆస్పత్రికి తీసుకెళ్లారంటూ ఇజ్రాయెల్‌ వార్తా వెబ్‌సైట్‌ ఒకటి పేర్కొంది. ఆయన బాగానే ఉన్నారని, ఆస్పత్రిలో నడుస్తున్నారని కూడా తెలిపింది. అయితే, ఈ వార్తలు అధికారికంగా ధ్రువీకరణ కాలేదు. ఇజ్రాయెల్‌లో సుదీర్ఘకాలం దాదాపు 15 ఏళ్లుగా నెతన్యాహు అధికారంలో కొనసాగుతున్నారు.

18న ఎన్డీఏ భేటీకి రండి

ఎల్జేపీ సహా పలు పార్టీలకు నడ్డా లేఖ

న్యూఢిల్లీ: ఎన్డీయే పక్షాలతో ఈనెల 18న జరగబోయే కీలక భేటీకి పలు పార్టీల అగ్రనేతలను బీజేపీ ఆహ్వానిస్తోంది. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా వారికి ఈ మేరకు లేఖ రాశారు. లోక్‌ జనశక్తి పార్టీ (రామ్‌ విలాస్‌) నేత చిరాగ్‌ పాశ్వాన్‌కూ లేఖ అందింది. ఆయనతో కేంద్ర మంత్రి నిత్యానంద్‌ రాయ్‌ ఇప్పటికే భేటీ కావడం తెలిసిందే. బిహార్‌ మాజీ సీఎం, హిందుస్తానీ ఆవామ్‌ మోర్చా చీఫ్‌ జితన్‌ రామ్‌ మాంఝీ కూడా హాజరవుతారని సమాచారం. మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక ఇంతటి విస్తృతస్థాయిలో ఎన్డీయే భేటీ జరగనుండటం ఇదే తొలిసారి.

వాగ్నర్‌ అనుభవంతో బెలారస్‌ బలోపేతం!

మిన్స్క్‌ (బెలారస్‌): ఉక్రెయిన్‌లో రష్యా తరఫున యుద్ధంలో పాల్గొన్న ప్రైవేట్‌ సైన్యం వాగ్నర్‌ గ్రూప్‌ అనుభవాన్ని వాడుకోవాలని బెలారస్‌ భావిస్తోంది. వాగ్నర్‌ సేన శనివారం ఆ దేశంలో బెలారస్‌లో అడుగుపెట్టింది. ఇరు సైన్యాల మధ్య సమన్వయం కోసం సంయుక్త సైనిక విన్యాసాలు తదితరాలకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. మెరుపువేగంతో షూటింగ్‌, ప్రథమ చికిత్సలో బెలారస్‌ సైనికులకు వాగ్నర్‌ గ్రూప్‌ బలగాలు తర్ఫీదునిస్తున్న వీడియో వైరల్‌గా మారింది.

కోలుకుంటున్న ఢిల్లీ

కాస్తంత తగ్గిన యమున నీటి మట్టం • చాలా ప్రాంతాలు జలదిగ్బంధంలోనే

ఆగ్రాలో తాజ్‌మహల్‌ వెంట ఉధృతంగా ప్రవహిస్తున్న యమునా నది



న్యూఢిల్లీ: ఢిల్లీలో కుంభవృష్టి వర్షాలు లేకున్నా ఎగువప్రాంతాల నుంచి యమునా నది మోసుకొచ్చిన వరదనీటితో అల్లాడిపోయిన దేశ రాజధాని నెమ్మదిగా తెరిపినపడుతోంది. గురువారం రాత్రి అత్యంత ప్రమాదకరంగా 208.66 మీటర్లుగా ఉన్న నది నీటిమట్టం శనివారం ఉదయం పదిగంటలకు 207.43 మీటర్లకు తగ్గడమే ఇందుకు కారణం. వరదముంపు ప్రాంతాల్లో పరిస్థితులు నెమ్మదిగా కుదుటపడుతున్నాయని డివిజనల్‌ కమిషనర్‌ అశ్వనీ కుమార్‌ చెప్పారు. 'అవిశ్రాంతంగా శ్రమిస్తున్న అధికారులపై ఎన్నికైన 'ప్రభుత్వం' విమర్శలు చేయడం తగదు. ఇది అధికారుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తుంది' అని ఆప్‌ సర్కార్‌నుద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. హరియాణాలోని హత్నీకుండ్‌ బ్యారేజీ నుంచి వరదనీటి ఔట్‌ఫ్లో తగ్గడంతో ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో వరదప్రభావం గంట గంటకు తగ్గుతోంది. అయితే భారతవాతావరణ శాఖ మాత్రం ఢిల్లీలో వచ్చే రెండ్రోజులు వర్షాలు పడతాయని సూచించింది. భీకరవర్షాల బారిన పడిన ఉత్తరాఖండ్‌, హిమాచల్‌ ప్రదేశ్‌, ఉత్తరాఖండ్‌లో మరో ఐదు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలుపడే అవకాశం ఉందని అంచనావేసింది. దీంతో యమునా నీటిమట్టం మళ్లీ పెరుగుతుందనే భయాలు ఢిల్లీవాసుల్లో వ్యక్తమయ్యాయి.

ఆక్రమణలే ముంచాయి

ఢిల్లీలో వరదకు కారణం నదీ పరివాహక ప్రాంతాల ఆక్రమణ అని కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) సీనియర్‌ అధికారి ఒకరు విశ్లేషించారు. 'గతంలో వరదనీరు విస్తారమైన ప్రాంతం గుండా ప్రవహించేది. ఇప్పుడు ఆ ప్రాంతమంతా ఆక్రమణలతో ఇరుకై పోయింది. దీంతో ఇరుకుదారుల్లో ఎత్తుగా ప్రవహించి సుదూర ప్రాంతాలను వరదముంచెత్తింది. గతంతో పోలిస్తే ఈఏడాది హత్నీకుండ్‌ బ్యారేజీ నుంచి నీరు ఢిల్లీకి చాలా తక్కువ సమయంలో, ఎక్కువ పరిమాణంలో చేరుకుంది' అని అధికారి విశ్లేషించారు. 'యమున ఎగువ ప్రాంతం మొత్తంలో ఒకేసారి భారీవర్షాలు పడటం ఈసారి పెద్ద వరదకు మరో కారణం' అని ఇంటర్నేషనల్‌ యూనియన్‌ ఫర్‌ కన్జర్వేషన్‌ ఆఫ్‌ నేచర్‌(ఐయూసీఎన్‌) భారత ప్రతినిధి యశ్‌వీర్‌ భట్నాగర్‌ చెప్పారు.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 16 । జూలై । 2023

విద్యుద్దీపాల కాంతుల్లో సింహవాహిని అమ్మవారి ఆలయం



న్యూస్‌రీల్

కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టి శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2018 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అనుదీప్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై హైదరాబాద్ జిల్లాకు కలెక్టర్‌గా వచ్చారు. ఆయనను జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు. జిల్లా రెవెన్యూ అధికారి సూర్యలత, లా ఆఫీసర్ సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు , కలెక్టరేట్ సిబ్బంది కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. అందరూ కష్టపడి పని చేసి అన్ని విషయాల్లో జిల్లాను ముందుంచేలా, లబ్ధిదారులకు అన్ని సకాలంలో సంక్షేమ ఫలాలు అందేలా పని చేయాలని సిబ్బందికి సూచించారు.

బల్దియాకు ముగ్గురు మున్సిపల్ కమిషనర్లు

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న బదిలీల్లో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ముగ్గురు మున్సిపల్ కమిషనర్లు, ఒక అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బల్దియాకు బదిలీ అయ్యారు. సీడీఎంఏలో జాయింట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న బి.గీతారాధిక, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ కె.నారాయణరావు, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌లను బల్దియాకు బదిలీ అయ్యారు. పోచారం మున్సిపల్ కమిషనర్‌గా వెళ్లిన బల్దియా ఏఎంసీ సురేష్‌ను తిరిగి జీహెచ్‌ఎంసీకి బదిలీ చేశారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ వీరిని ఆయా పోస్టుల్లో నియమించనున్నారు.

58 మంది ఆకతాయిలకు అరదండాలు

సాక్షి, సిటీబ్యూరో: మహిళలను వేధించే పోకిరీలను పోలీసులు వదిలిపెట్టడం లేదు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మహిళలను వెంబడిస్తూ.. వేధిస్తున్న ఆకతాయిలకు అరదండాలు విధించారు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో మహిళలను వేధించిన 58 మంది పోకిరీలను షీ టీమ్స్ పోలీసులు సాక్ష్యాధారాలతో న్యాయస్థానంలో హాజరుపరచగా.. నిందితులకు కోర్టు జైలు శిక్ష విధించింది. ఇందులో అయిదుగురు ఆకతాయిలకు 8 రోజులు జైలు శిక్ష విధించగా.. 5 కేసులలో 4 రోజులు, 21 కేసుల్లో 3, 12 కేసుల్లో 2 రోజులు శిక్షతో పాటు 15 కేసుల్లో ఒక్కొక్కరికి రూ.250 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

జిల్లా గణాంకాల సంకలనం విడుదల



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ శాఖల పూర్తి వివరాలతో ముఖ్య ప్రణాళిక శాఖ రూపొందించిన హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్ –హైదరాబాద్ జిల్లా–2022 సంకలనాన్ని జిల్లా నూతన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విడుదల చేశారు. శనివారం ఆయనన తన చాంబర్‌లో ఆవిష్కరించి ముఖ్య ప్రణాళిక అధికారి, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ సంకలంలో జనాభా, వాతావరణం, ఆరోగ్యం , కుటుంబ సంక్షేమం, విద్య, రవాణా, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, పబ్లిక్ ఫైనాన్స్, డిస్ట్రిక్ ఎకానమీ, సోషల్ సెక్యూరిటీ తదితర సమగ్ర వివరాలు ఉన్నాయి. ప్రభుత్వ పరిపాలన విభాగాలు, పారిశ్రామికవేత్తలు, స్టాటిస్టిషన్స్, పరిశోధకులు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమని ముఖ్య ప్రణాళికా అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రణాళికా శాఖ సంయుక్త సంచాలకులు, ముఖ్య ప్రణాళికా అధికారి డాక్టర్ సురేందర్ నారాయణదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

23 నుంచి హైలైఫ్ ఎగ్జిబిషన్

బంజారాహిల్స్: ఈ నెల 23 నుంచి 25 వరకు హెచ్‌ఐసీసీ నోవాటెల్ హోటల్‌లో హైలైఫ్ ఫ్యాషన్, లగ్జరీ, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన సన్నాహక ప్రదర్శన శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం.10లో నిర్వహించారు. సినీనటి వర్షతో పాటు పలువురు మోడల్స్ డిజైనర్ దుస్తులు, ఆభరణాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. దేశ వ్యాప్తంగా ప్రఖ్యాత డిజైనర్లు తమ అరుదైన ఉత్పత్తులను ఇందులో ప్రదర్శించబోతున్నారని నిర్వాహకులు తెలిపారు. డిజైనర్ స్పెషల్, వెడ్డింగ్ స్పెషల్, జ్యూవెలరీ, దుస్తులు ఇందులో ప్రత్యేకతగా ఉండబోతున్నాయని వెల్లడించారు.



అమ్మవారికి సారె తీసుకెళ్తున్న దృశ్యం

ధూం.. ధాం! బోనం

సండే స్పెషల్

నేడు నగరంలో ఆషాఢ మాసం బోనాల జాతర

- అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రులు
- సర్వం సిద్ధమైన పాతబస్తీలోని దేవాలయాలు

చార్మినార్: ఆషాఢ మాసం బోనాలకు భాగ్యనగరం ముస్తాబైంది. పాతబస్తీతో సిటీ వ్యాప్తంగా ఉత్సవ సంబరం అంగరంగ వైభవంగా జరగనుంది. డప్పు చప్పుళ్లు.. బ్యాండ్ మేళాలు.. పోతరాజుల విన్యాసాలు.. శివసత్తుల పూనకాలు.. భక్తుల భావోద్వేగాల మధ్య బోనాల జాతర ఆద్యంతం ఆధ్యాత్మిక వైభవాన్ని చాటనుంది. గత నెల 22న గోల్కొండ జగదాంబ అమ్మవారికి సమర్పించిన బోనంతో ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఈ నెల 7న పాతబస్తీలోని చారిత్రాత్మక పురాతన దేవాలయాల అమ్మవార్లకు కలశ స్థాపన, అభిషేకం, అలంకరణ, నైవేద్యం, తీర్థ ప్రసాదాలతో బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 9న అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపు కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఘటస్థాపన అనంతరం వరుసగా ప్రతిరోజూ పూజలు నిర్వహించిన భక్తులు.. నేడు అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలు సమర్పించనున్నారు. సోమవారం పాతబస్తీ ప్రధాన వీధుల్లో అమ్మవారి సామూహిక ఘటాల ఊరేగింపు కన్నుల పండువగా జరగనుంది.



అమ్మవారి ఆలయం వద్ద భక్తుల సందడి

ముస్తాబైన దేవాలయాలు

ఈ నేపథ్యంలో పాతబస్తీలోని లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి దేవాలయం, మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర అమ్మవారు, ఉప్పుగూడ శ్రీ మహంకాళి, సుల్తాన్‌షాహీ శీతల్‌మాత మహంకాళి, గౌలిపురా నల్లపోచమ్మ, గౌలిపురా శ్రీ మహంకాళి దేవాలయం, అక్కన్న మాదన్న శ్రీమహంకాళి తదితర దేవాలయాలు బోనాల ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఈ సందర్భంగా పాతబస్తీలోని ప్రధాన దేవాలయాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహ్మద్ మహమూద్ అలీ తదితరులు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా..

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలె భాస్కర్ రాజ్ తెలిపారు. నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌లతో పాటు పలువురు అధికార, అనధికార ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాతబస్తీలోని ప్రధాన అమ్మవారి దేవాలయాలను సందర్శించనున్నారు.

సారె సమర్పించిన 2,116 మంది మహిళలు

చాంద్రాయణగుట్ట: శ్రీ శైవక్షేత్ర పీఠాధిపతులు శివ స్వామి వారి ఆధ్వర్యంలో లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారికి శనివారం 2,116 మంది వనితా శక్తి మహిళలు, 51 మంది వేద విద్యార్థులు, కేరళ వాద్యాలు, సన్నాయి మేళంతో సారె సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో చీకోటి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సారె తీసుకెళ్తున్న సందర్భంగా అతివల ఆనందం

అమ్మవారికి స్వర్ణ ఖడ్గం



చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారికి దాతల సహకారంతో శనివారం అరకిలో బరువున్న స్వర్ణ ఖడ్గం బహూకరించారు. భక్తులు, దాతల సహకారంతో తయారు చేయించిన ఈ ఖడ్గాన్ని లాల్‌దర్వాజాలోని కోట మైసమ్మ దేవాలయం నుండి ఆలయ ప్రధాన అర్చకులు నర్సింహయ్య శర్మ, ఆలయ చైర్మన్ సి.రాజేందర్ యాదవ్‌లు ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బి.మారుతీ యాదవ్, కన్వీనర్ జి.అరవింద్ గౌడ్, మాజీ చైర్మన్లు కె.వెంకటేష్, కె.విష్ణుగౌడ్, బంగ్లా రాజు యాదవ్, పోసాని విజయ్ కుమార్, సి.రాజ్‌కుమార్ యాదవ్, కాశీనాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేటలో కాల్పుల కలకలం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

- వివాహేతర సంబంధం కారణంగా వివాదం
- పిల్లలను తనతో పంపించాలని అడిగినందుకు గొడవ
- మహిళ భర్తపై ఎయిర్‌గన్‌తో కాల్పులు జరిపిన ప్రియుడు
- హైదరాబాద్ శివార్లలోని సెలబ్రిటీ రిసార్ట్స్‌లో ఘటన
- ఈ ఘటనతో వెలుగులోకి సదరు మహిళ, సీరియల్ నటుడి మోసాలు



శామీర్‌పేట: వివాహేతర సంబంధం నేపథ్యంలో కాల్పులు జరిపిన ఘటన కలకలం రేపింది. ఓ వ్యక్తి భార్యతో కలసి ఉంటున్న వ్యక్తి.. పిల్లల కోసం వచ్చిన ఆమె భర్తపై ఎయిర్‌గన్‌తో కాల్పులు జరిపాడు. శనివారం హైదరాబాద్ శివార్లలోని శామీర్‌పేటలో ఉన్న సెలబ్రిటీ రిసార్ట్స్‌లో ఈ ఘటన జరిగింది. బాలానగర్ డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని హిందూజా థర్మల్ పవర్ సంస్థలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న సిద్ధార్థ్ దాస్‌కు ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే గ్రంథి స్మితతో కొన్నేళ్ల కింద వివాహం జరిగింది. వారికి 17 ఏళ్ల కుమారుడు, 13 ఏళ్ల కుమార్తె ఉన్నారు. మనస్పర్ధల కారణంగా సిద్ధార్థ్, స్మిత నాలుగేళ్లుగా విడివిడిగా ఉంటున్నారు. విడాకుల కేసు కోర్టులో నడుస్తోంది. స్మిత కొన్నేళ్ల కింద పరిచయమైన సీరియల్ నటుడు మనోజ్‌తో కలసి శామీర్‌పేట సెలబ్రిటీ రిసార్ట్స్‌లోని విల్లా నంబర్ 21లో సహజీవనం చేస్తున్నారు. ఇన్నాళ్లుగా ఇద్దరు పిల్లలు స్మిత దగ్గరే ఉన్నారు.

చెల్లిని హింసిస్తున్నారని కుమారుడు చెప్పడంతో..

ఇటీవల న్యాయస్థానాన్ని ఆశ్రయించిన సిద్ధార్థ్ దాస్.. కోర్టు ఆదేశాలతో తన కుమారుడిని ఈ నెల 12న విశాఖపట్నానికి తీసుకెళ్లాడు. ఈ సందర్భంగా తల్లి స్మిత, ఆమె ప్రియుడు మనోజ్ కలిసి తనను, చెల్లిని తీవ్రంగా హింసించిన విషయాన్ని తండ్రి సిద్ధార్థ్‌కు కుమారుడు వివరించాడు. దీంతో బాధపడిన సిద్ధార్థ్.. శనివారం ఉదయం సెలబ్రిటీ రిసార్ట్స్‌లోని విల్లా వద్దకు వెళ్లి కుమార్తెను తనతో పంపించాలని కోరాడు. దీనిపై వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో అక్కడే ఉన్న మనోజ్ రెచ్చిపోయి.. ఎయిర్‌గన్‌తో సిద్ధార్థ్‌దాస్‌పై కాల్పులు జరిపాడు. వాటి నుంచి తప్పించుకున్న సిద్ధార్థ్ డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు వెంటనే విల్లా వద్దకు చేరుకుని ఎయిర్‌గన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఘటనకు సంబంధించి ముగ్గురిని విచారిస్తున్నారు. మనోజ్ కంటే స్మిత వయసులో పెద్దదని, వారి మధ్య వివాహేతర సంబంధం ఆరోపణలు సరికాదని.. ఒక దగ్గర కలిసుంటే వివాహేతర సంబంధం ఉన్నట్లేనా? అని మనోజ్ తండ్రి పేర్కొన్నారు.

కాల్పుల ఘటనతో వెలుగులోకి మోసాలు

ఈ కాల్పుల ఘటనపై మనోజ్, స్మితలను విచారిస్తున్న సమయంలో.. వారు పలు మోసాలకు పాల్పడిన విషయాన్ని పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. మనోజ్ సీరియళ్లలో నటిస్తున్న నేపథ్యంలో అతడు, స్మిత కలిసి.. సినిమాల్లో అవకాశాలు ఇప్పిస్తామంటూ సంపన్న వర్గాల అమ్మాయిలకు ఎరవేస్తున్నట్టు తేల్చినట్టు సమాచారం. ఇలా ఇటీవలే ఓ సంపన్న యువతి నుంచి రూ.50 లక్షలు వసూలు చేశారని గుర్తించినట్టు సమాచారం. ఈ ఆరోపణలకు సంబంధించి కూడా దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు చెప్తున్నారు. ఇక సిద్ధార్థ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మనోజ్‌పై ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న గన్‌లో ఎలాంటి మందు గుండు సామాగ్రి, ఉంది? కాల్పులు జరిపారా? లేదా అన్నదాన్ని నిర్ధారించేందుకు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించినట్టు తెలిపారు.

సినిమానే నా కెరీర్



- నాన్న బాటలోనే రాణిస్తా.. సేవలు కొనసాగిస్తా..
- మనసులో మాటను వెలిబుచ్చిన ఘట్టమనేని సితార



సాక్షి, సిటీబ్యూరో: సామాజిక మాధ్యమాల్లో ఈ మధ్య సోషల్ సెలబ్రిటీగా మారిన సూపర్‌స్టార్ మహేష్ బాబు కుమార్తె సితార ఘట్టమనేని కూడా చలనచిత్ర రంగంలోకి అడుగిడుతుందనే ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ.. స్వయంగా సితారనే స్పందించింది. భవిష్యత్‌లో తాను సినిమాల్లో నటిస్తానని, సినిమా రంగంలో తనకూ ఆసక్తి ఉందని తెలిపింది. తాజాగా సితార నటించిన పీఎంజే జ్యువెల్స్ యాడ్ షార్ట్ ఫిల్మ్ 'ప్రిన్సెస్' ప్రివ్యూను శనివారం బంజారాహిల్స్‌లోని పార్క్‌హయత్ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సితార తన తల్లి నమ్రతా శిరోద్కర్‌తో కలిసి హాజరైంది. షార్ట్ ఫిల్మ్‌తో పాటు సితార కలెక్షన్స్‌తో రూపొందించిన లుక్ బుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సితార మాట్లాడుతూ... వాణిజ్య ప్రకటనలో నటించడంతో వచ్చిన తన తొలి పారితోషికాన్ని చారిటీ కోసం ఖర్చు చేశానంది. అమ్మ– నాన్న.. తనతో బెస్ట్ ఫ్రెండ్స్‌గా ఉంటారని, ఏ విషయమైనా వారితోనే పంచుకుంటానని సంతోషాన్ని వ్యక్తం చేసింది. న్యూయార్క్‌లోని ప్రతిష్టాత్మక టైమ్స్ స్క్వేర్ వేదికపై పీఎంజే జ్యువెల్స్ ఆధ్వర్యంలో సితార సిగ్నేచర్ కలెక్షన్స్ ప్రారంభించడం పట్ల తన తండ్రి మహేష్ బాబు ఎంతో సంతోషంగా ఉన్నారని, తన అమితమైన ఆనందాన్ని స్వయంగా చూశానని సితార తెలిపింది.

మహేష్ భావోద్వేగానికి గురయ్యారు..

సితార యాడ్ ఫిల్మ్ చూసినప్పుడు మహేష్‌బాబు భావోద్వేగంతో కంటతడి పెట్టుకున్నారని నమ్రతా శిరోద్కర్ తెలిపారు. ఈ సందర్భంగా 'మీ తనయుడు గౌతమ్ సినిమాల్లోకి ఎప్పుడు వస్తారు' అని నమ్రతను మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. గౌతమ్ ప్రస్తుతం తన చదువుపై ఆసక్తిగా ఉన్నాడని, ఆరేడేళ్ల తర్వాత సినిమాల్లోకి వస్తాడని పేర్కొన్నారు. కేవలం కొన్ని అంశాలను పరిగణించి సినిమా రంగాన్ని కొందరు చెడుగా చూస్తారు.. కానీ సినిమా రంగం చాలా ఉన్నతమైనదని, ఎంతో మందికి గొప్ప వేదిక అని నమ్రత వివరించారు. శౌర్య పరువు దర్శకత్వం వహించిన ఈ షార్ట్ ఫిల్మ్‌ని పీఎంజే జ్యువెల్స్ అధికారికంగా ఈ నెల 19న విడుదల చేయనున్నామని జ్యువెల్స్ ప్రిన్సిపల్ డిజైనర్ డైరెక్టర్ దినేష్ జైన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ రక్షిత జైన్, నిమేష్, కిరణ్, సీమ, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

'చెత్త నుంచి విద్యుత్'.. త్వరలో మరో ప్లాంట్

- 14.5 మెగావాట్ల సామర్థ్యంతో ఉత్పత్తి ప్రారంభించనున్న దుండిగల్ ప్లాంట్
- మరిన్ని ప్లాంట్లతో వచ్చే ఏడాదిలోగా 101 మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యం
- ట్విట్టర్ ద్వారా వెల్లడించిన మంత్రి కేటీఆర్



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగర శివార్లలోని దుండిగల్‌లో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ త్వరలో ప్రారంభం కానుంది. ప్లాంట్ పనులు పూర్తి కావడంతో త్వరలోనే ప్రారంభోత్సవం జరగనున్నట్లు మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. జవహర్‌నగర్‌లోని చెత్తనుంచి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ద్వారా ప్రస్తుతం రోజుకు 20 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. దుండిగల్ ప్లాంట్ అందుబాటులోకి వస్తే 14.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. వెరసీ.. మొత్తం 34.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తవుతుందని తెలిపారు. వచ్చే సంవత్సరాంతానికి ఇతర ప్లాంట్లతో కలిపి 101 మెగావాట్ల విద్యుత్‌ను చెత్తనుంచి ఉత్పత్తి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. గ్రేటర్ నగరం నుంచి రోజుకు ప్రస్తుతం దాదాపు 7,500 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. దుండిగల్ ప్లాంట్‌కు 1500 మెట్రిక్ టన్నుల చెత్త అవసరం. అందులోంచి 800 మెట్రిక్ టన్నుల మండించే గుణమున్న చెత్త (ఆర్‌డీఎఫ్)తో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు. హైదరాబాద్‌తో పాటు శివారు మున్సిపాలిటీల నుంచి వెలువడే చెత్తతో రోజుకు 101 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగనుందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. వ్యర్థాన్ని అర్థంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం వీటిపై శ్రద్ధ చూపుతోందని మంత్రి పేర్కొన్నారు.

101 మెగావాట్ల లక్ష్యమిలా..

జవహర్‌నగర్ ప్రస్తుత ప్లాంట్ పూర్తి సామర్థ్యం 24 మెగావాట్లు. దీంతోపాటు మరో ప్లాంట్ ద్వారా ఇంకో 24 మెగావాట్లు. దుండిగల్ ద్వారా దాదాపు 15 మెగావాట్లు, ప్యారానగర్, యాచారం, బీబీనగర్ ప్లాంట్ల ద్వారా మరో 77 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. వచ్చే సంవత్సరం 2024 డిసెంబర్ నాటికి ఈ లక్ష్యం చేరుతామని మంత్రి పేర్కొన్నారు.

ఆర్టీసీ బంపర్ ఆఫర్

ముగ్గురు కలిసి పయనిస్తే 10% రాయితీ



సాక్షి, సిటీబ్యూరో: ఎయిర్‌పోర్టు ప్రయాణికుల కోసం ఆర్టీసీ మరో బంపర్ ఆఫర్‌ను ప్రవేశపెట్టింది. కనీసం ముగ్గురు ప్రయాణికులు కలిసి ప్రయాణం చేస్తే టికెట్ చార్జీల్లో రాయితీ లభిస్తుంది. ముగ్గురు నుంచి ఎంతమంది ప్రయాణికులైనా సరే కలిసి ప్రయాణం చేసినప్పుడు మొత్తం చార్జీల్లో 10 శాతం వరకు తగ్గింపు ఇవ్వనున్నట్లు ఆర్టీసీ సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ వెంకన్న తెలిపారు. క్యాబ్‌లు, ఇతర ప్రైవేట్ వాహనాల పోటీని ఎదుర్కొనేందుకు ఆర్టీసీ ఈ రాయితీ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు, కుటుంబాలతో కలిసి వెళ్లే ప్రయాణికులను సైతం ఆకట్టుకొనేందుకు ఈ సదుపాయాన్ని ప్రవేశపెట్టినట్లు వెంకన్న చెప్పారు. ప్రస్తుతం నగరంలోని వివిధ మార్గాల్లో ప్రతి రోజు వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రయాణికుల ఆదరణ చూరగొనేందుకు ఆర్టీసీ ఇప్పటికే బస్సుల్లో వైఫై తదితర సదుపాయాలను ప్రవేశపెట్టింది. వివిధ మార్గాల్లో ఎయిర్‌పోర్టు వరకు కనిష్ఠంగా రూ.50 నుంచి గరిష్ఠంగా రూ.300 వరకు టికెట్ చార్జీలు ఉన్నాయి. కుటుంబ సభ్యులు కలిసి వెళ్లినప్పుడు ప్రయాణించే దూరం, ప్రయాణికుల సంఖ్యను బట్టి రాయితీ పెద్ద మొత్తంలోనే ఉంటుందని అధికారులు చెప్పారు. ప్రయాణికుల ఆదరణ పెరుగుతున్న దృష్ట్యా వివిధ రూట్‌లలో మరిన్ని బస్సులను ప్రవేశపెట్టేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. త్వరలో నగరానికి రానున్న కొత్త ఎలక్ట్రికల్ ఏసీ బస్సుల్లో 20 బస్సులను ఎయిర్‌పోర్టుకు నడపనున్నట్లు ఆర్‌ఎం చెప్పారు.



MUSIC & DANCE

■ **Piano, Singing, Guitar, Violin, Flute,** Harmonium, Keyflute, Keyboard, Veena, Sitar, Drums Kit, Saxophone. Ph: 9246341990 (WhatsApp) [H-780892]



■ శంకర్ పల్లి, చేవెళ్ల, పరిగి, షాద్ నగర్, శంషాబాద్, తాండూర్, మహబూబ్ నగర్, ల్యాండ్స్ & ఓపెన్ ప్లాట్స్, అన్ని రకాల ప్రాపర్టీస్ అమ్మబడును, & కొనబడును. ఫైనాన్స్ Also. ఫోన్ : 9440571029 [HA-788928]

■ **Suchitra Circle Kompally Gated Community 2 & 3 BHK for Sale Ready to Move. No GST. Rate @ 4299per Sft. Ph: 9000091355** [HA-8582]

FLAT FOR SALE

■ **Nallakunta 2BHK Flat 1st Floor, 1037 Sft. East Face, Car Parking, Lift, Well Furnish, 100% Vastu, Sale Ph: 8801083536** [HA-11298]

■ **Prajwalla Temple Tree. HMDA Aprv.** Gated 2BHK Apts, Ashoknagar Beeramguda, 1 KM Mumbai Highway, Ph: 9959006688, 9032823846 [H-780942]

■ **Nagole Bandlaguda Anandnagar** Ready to Occupy 3BHK E/F (1650 Sft.) with All Fecilities. Ph: 9059490490, 9908090718. [H-788502]

■ **Mehdipatnam 1104 Sft 2BHK,** 3rd Flr. with Two Balconies, N/F, Car Parking, Lift, All Facilitis at Navodaya Colony, St. Ann's College. Rs. 43 Lakhs, Negotiable. Ph: 9396484990 [HA-13944]

■ **Filmnagar: 3 BHK (1500Sft.) Flat** For Sale in Sai Castle, 1st Floor with all Amenities. Prime Area. Rs. 90Lakhs. Ph: 9885517755 [H-780929]

■ **Pragathi Nagar, 3BHK, 1800 Sft.** Floor wise West Face, HMDA, 4 Floors, Corner Bit, 40 Feet Roads, Ready to Move. Ph: 9848225164. [H-780940]

■ **Chandanagar Near Hitech City New 3** BHK RERA Approved flats Offer Price 5876/- only per Sq. ft Offer unitil 15th August only. Ph :9346302740, 9912269666 [H-781537]

■ **Kapra Next to D.Mart Last Few 2 & 3BHK** Flats for Resale: Gated Community, Club House Swimming Pool No. GST Call: 9502277099. [H-780842]

■ **3BHK Flats in 8Acre Gated Community, Quality Construction Must See! Near NFC/ECIL, for Site Visit Call: 9849487470.** [H-780843]

HOUSE FOR SALE

■ నారపల్లి JRS ఇంటర్నేషనల్ స్కూల్ దగ్గర వీధి నెం-5, వినాయక్‌నగర్ కాలనీ, 197 Sq.yds. ఇండిపెండెంట్ హౌస్ 3బెడ్ రూమ్స్ @ 88 Lkahs. Neg. ఫోన్ : 9705791480, 8341930442 [H-780727]

■ వనస్థలిపురం **FCI** కాలనిలో నార్త్ / వెస్ట్ 270 గంజాలు, న్యూ డూప్లెక్స్ హౌస్, **G+2, 4800Sft.** అమ్మకానికి కలదు. సంప్ర: 9849688626 [HA-1686]

■ బడంగ్‌పేట **Bachpan** స్కూల్ దగ్గర 200 గ॥, W/F కొత్త ఇల్లు అమ్మకమునకు కలదు. **Ground Flr. 2BHK, 1st Floor 3BHK Rs:1.5cr Ph: 9441300240** [H-788924]

■ బండ్లగూడ జాగీర్, కిస్మత్‌పూర్, యాదాద్రి కాలనీ 140 గ॥ల॥ ఇండిపెండెంట్ ఇల్లు (G+1,E/F40ft. Road) Rs. 1.58cr. అమ్మకమునకు కలదు, గండిపేట (మం), రంగారెడ్డి (జిల్లా), ఫోన్: 8008843371, 8555918283 [H-781539]

■ **ఆంధ్రప్రదేశ్, కాకినాడ జిల్లా, సామర్లకోటలో** 1235 గజాలలో Building Sale కలదు. గజం : 24,000/-. మాట్లాడుకోవచ్చును. ✆ : 83415 16208, 92961 07984 [R-1234039]

■ **House for Sale Padmawati Nagar Allapure G+1, 4 Portions. Rent Coming 50,000, 120 Sq.Yds. Ph: 9989193672, 9866714213** [H-788724]

■ **3 Indp. New Houses 133 Sq.yds E/F, Telephone Colony, Meerpet, Near TKR College, Ph: 8977253063** [H-780939]

■ **Near Bandlaguda, Keesara Mandal, 161 Sq. Yards, East Face Independent House for Sale. Ph: 9866999905, 8367444644.** [H-780930]

■ **Munaganoor, Hayath Nagar, 404 Sq.Yds** P.No. 63 & 64, Sy. No. 64 Indep. House 196Sq.Yds. P.No. 68, Plot For Sale. 100% Vaastu. Contact: 9010219658, 7901091081. [H-781242]

■ **2BHK Flats & Indp. Houses & plots for Sale HMDA Main Road 1/2 KM Isnapur, Balaji Hills. Ph: 9849049842, 7673912669** [H-780937]

PLOT FOR SALE
KALYANIPURI, UPPAL
WEST FACE, 50 FEET ROAD, FACING, 413 SY. YARDS
FULL LRS PAID
DIRECT PURCHASERS CONTACT ONLY.
SEMI COMMERCIAL
9948969668
9346663988

LAND FOR SALE

■ 2800 గజాల HMDA 8000 గజాలు DTCP 22 గుంటలు, ఆదిబట్ల TCS దగ్గర ORR ఎగ్జిట్ No. 12, సాగర్‌హైవే లో అమ్మకానికి కలవు. ఫోన్ : 9848475375 [H-781249]

■ ఆంధ్రప్రదేశ్, కాకినాడ జిల్లా, జగ్గంపేట హైవేకి 1/2 km గుర్రంపాలెం రోడ్ అనుకుని 5 ఎకరములు లే అవుట్‌లకు అనుకూలమైనవి. ఎకరా 6 కోట్లు (Crores) మాట్లాడుకోవచ్చును. ✆ : 83415 16208,92961 07984 [R-1234040]

■ **2 Acres @ Padalapally (V),** Thoopran (M), Medak (Dist), Sy.No. 185/1, Rs. 1.30 Cr. P/Acre. Clear Title. Negotiable & Open Plot 27x60 for Sale 35,000 P/Sq.yard. @ Bharathnagar, Moulali, Hyd. Ph: 9440886371 [H-189225]

■ **Jodimetla, Pocharam, Warangal High way** 2nd bit 1500 Sq. Yds East Face, Suitable School, Hospital @ 55k per Sq.yd. Full LRS Paid. Loan Facility. Contact: 9391005628 [H-780722]

LEASE / RENT

■ వేగంగా అభివృద్ధి చెందుతున్న బి.బి.నగర్ వరంగల్ హైవే ఎయిమ్స్ దగ్గర మెయిన్ రోడ్ నుండి 2వ ప్లాట్, 41,400 చ॥గజాలు, 1.25 లక్షల చ॥ అడుగుల షెడ్లు (8) లీజ్ / రెంట్ కు సిద్ధంగా కలవు చ॥ అడుగు రెంట్ రూ. 8/-. కాల్: 8885870000, 9849123696 [HA-11297]

■ **Near to Warangal H/way 14000sft Newly Constructed in 4000sqyds function Hall for Lease @Hanmapur Jagdevpur Main Road Bhongir with New Genset furniture Cutlery sets Cont: 9985670600** [H-796916]

PLOT FOR SALE

■ ఆషాఢం స్పె. ఆఫర్. బెంగళూరు హైవే ఫేసింగ్ @ కొత్తూరు, షాద్‌నగర్ & ముంబై హైవే ఫేసింగ్, @ సదాశివపేట, HMDA, DTCP, అప్రూవ్డ్ హౌసింగ్ ప్లాట్లు స్పా.రి. రెడీ టూ కన్‌స్ట్రక్షన్. ఫోన్: 9966752929 [H-189308]

■ కేవలం 4,25,000/-లకే 121గజాల ఫామ్‌ల్యాండ్ ప్లాట్లు ఆలేరు-జీడికల్ 100 Ft. రోడ్డుకి 18ఎకరాల మా వెంచర్‌లో 10 శ్రీగంధం+10 ఫ్రూట్ మొక్కలతో 12సం॥ ఫ్రీ మెయింటెనెన్స్ MOU అగ్రిమెంట్ కూడా ఇస్తాం. EMI 24నెలలు (5,00,000) లక్షలకే, క్లి.టై. స్పాట్ రిజి. ఫోన్: 7032547694 [H-788725]

■ ECIL చౌరస్తాలాగా కాబోతున్న ECIL నెమలి చౌరస్తాలో 120గ॥లు G+1 బిల్డింగ్ పర్మిషన్ కే॥6 లక్షలకే రిజి॥తో 40/30 రోడ్లు, 24గం॥ సెక్యూరిటీ. Ph: 6309771255 [H-189454]

■ కేవలం రూ. 3,02,500/- కే. 121 చ॥గ॥ ఫాం ల్యాండ్ 10 మహాగని మొక్కలతో జగదేవ్‌పూర్ కి 4 కి.మీ. దూరంలో సంప్ర: 9704499045 [H-781248]

■ ఏలూరు టౌన్‌లో ప్లాట్ అమ్మబడును 180 గజాలు DTCP లేఅవుట్ అంబికా నగర్, (బీడీ కాలనీ), తంగెళ్లమూడి, ఏలూరు. సంప్ర: 9000005736 [H-189554]

■ హైదరాబాద్‌లో ఫార్మాసిటీ గా అభివృద్ధి చెందుతున్న యాచారం నందు విల్లా ప్లాట్స్ & ఓపెన్ ప్లాట్స్ కలవు. గజం. 10999/-. ఫోన్ : 7989747927 [HA-13943]

■ శ్రీరాంకాలనీ జల్‌పల్లి బాలాపూర్ 118 **Sq.Yds.** రిజిస్టర్డ్ S/F గజం 25,000/-, క్లియర్ టైటిల్ డైరెక్ట్ ఓనర్. ఫోన్ : 9133503242, 8555846858 [H-781534]

■ VJA, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. గన్నవరం, బందరు రోడ్డు, కంచికచర్ల దగ్గర శ్రీగంధం మొక్కలతో ఇళ్ళ ప్లాట్స్ చ॥గ॥ 1,900/-, నుండి 17,500. సంప్ర : ✆ 93906 65999 [B-96]

■ గజం కేవలం 2500/- మాత్రమే మీ పెట్టుబడి పదింతలు అయ్యే అద్భుత అవకాశం. సాగర్‌హైవే ఇబ్రహీంపట్నం వద్ద అన్ని డెవలప్‌మెంట్స్‌తో ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 8919577389 [HA-9968]

■ బెంగుళూరు హైవే షాద్‌నగర్ @ రాజాపూర్ 104 ఎకరాల ఫ్రూట్ ప్లాంటేషన్ ఫామ్ ల్యాండ్ రిసార్ట్ కలిగిన వెంచర్ లో 2.5 గుంటల ప్లాట్లు కలవు. గజం 6499/- ఫిక్స్‌డ్ 24/7 సెక్యూరిటీ, కాంపౌండ్ వాల్స్, అన్ని డెవలప్‌మెంట్స్ తో కలవు. క్లి॥టై॥ స్పాట్ రిజి॥ సంప్ర: 8790142136 [H-780840]

■ 16 పండ్ల మొక్కలతో, వాస్తుకు అనుగుణంగా, పక్కా డాక్యుమెంట్స్‌తో రూ. 2,50,000/-లకే ఫామ్ ల్యాండ్ (121గ॥) కొనండి. Hero Bike ఉచితంగా పొందండి. 9700518878, 9154047148. [WA-7204]

■ **Manikonda Panchvati Colony East/South Corner 300 Sq. Yds. Plot for Sale Contact 9am to 10 pm. Ph: 9246546336.** [HA-4247]

■ **Alwal 377 Sq.Yds. N/F Plot for Sale** @ Bhavani Nagar, with Parking+3 Floors Permission, Plot Size 40 x 85 Very Near to Main Road. Ph : 9989657778 [H-781544]

■ **Open Plot For Sale 266sq. Yards** North Face Srikrishna Hills Colony Road No. 05, Near Bommala Gudi Hayathnagar. Ph : 9069062829 [HA-11295]

■ **Kompally County-III, Fully Developed Villas & Open Plots Approved by HMDA Ready for sale, Ph: 8886518833, 8374674689** [H-780936]

భూమి అమ్మకం
హైదరాబాద్ - వరంగల్ 4 లైన్ల హైవేకు ఆనుకొని ... 26 ఎకరములు భూమి 3 లక్షల ... అమ్మబడును. ఆసక్తిగల వారు
సంప్ర: 9959910909

■ **165 Sq. Yds East Face Koukur** Near Alwal Plot For Sale, 35,000 Per Sq. Yd. Contact: 9908833477, 9963124333 [H-780931]

■ **100 Yds Plot N/Face Vidya Maruti Nagar Chinna Cherlapally @ 42,000 For Sale Call: 9246573766, 6305744592** [H-796910]

■ **@Koheda near pedda Amberpet** -HMDA (LRS) approved plots of sizes plot no.3-181 Sqy., plot No.47-319 Sqy, Plot No.49-233 Sqy, Plot No.83-520Sqy, Plot No.50-200 Sqy. Contact: 9666759480/ 9246363369 [H-189553]

TO-LET

■ హైదరాబాద్, కూకట్‌పల్లి ఏరియాలో ప్రముఖ జ్యూయలరీ షోరూం ప్రారంభించేందుకు 5000Sft గల బిల్డింగ్ అండర్ గ్రౌండ్ సెల్లార్ పార్కింగ్, గ్రౌండ్ ఫ్లోర్, 1st ఫ్లోర్ అద్దెకు కావలెను. 9490010684, 9493924146 [G-788973]

■ **School Building for Rent** @Karmanghat. Swimming Pool, Cricket Ground, Badminton, Dance Studio Also Available to Use. Ph: 6301366527 [HA-29820]

■ **Rooms. Available for Coaching Center/Tutions @Vanasthalipuram Main Road Phone: 9494800160** [WB-15737]

VILLAS FOR SALE

■ **New-age design premium villas for sale in Raviryala for just Rs.1.80 Crores. Contact: + 91 7353585358 Sark Projects** [HA-94164]



■ మీ బంగారం తాకట్టులో ఉండా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788602]

■ **Soochi Fintech Private Limited, Consult** for Finance (From Pvt./ Nationalised Banks & institutions), Chits (1 Lakh to 2 Crore), Fixed Income plans (Monthly/Maturity), Insurance (Life, Health& General) & Abroad Education. Ph:040-24440129, 7337440129, Mail ID: gns.sharma@soochi.in [H-781447]

BUSINESS SERVICE



■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును **Ph: 9100329739** [H-788716]

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్ మరియు ఏ ఇతర ఫైనాన్స్ లో ఉన్నా మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ఫోన్ : 8886456484. [H-189261]

BUSINESS OFFER

■ డిగ్రీలు, అనుభవంతో పనిలేదు స్త్రీ/పు ఎవరైనా కార్పొరేట్ సంస్థలో బిజినెస్ మేనేజర్ గా పార్ట్ / ఫుల్ టైం పని చేస్తూ 20వేల నుండి లక్ష వరకు సంపాదించండి. ఫోన్ : 9989747897 [H-189213]

■ బ్రాయిలర్ కోళ్ళు & నాటు కోళ్ళ పెంపకం మరియు వాటి ఉత్పత్తి (Production) మెషినరీ విభాగంలో 1 లక్ష నుండి ఆపైన పెట్టుబడులు కావలెను. ఫోన్ : 9441015276 [HA-13613]

■ రియల్ ఎస్టేట్‌లో పార్ట్‌టైమ్ వర్క్ చేయడం ద్వారా మంచి ఆదాయం సంపాదించడం & ఫీల్డ్ వర్క్ లేకుండా కస్టమర్లను సంపాదించడం అను అంశంపై ఉచిత సెమినార్. ఫోన్ : 9849416132 [HA-2028]

■ సింగిల్ డాక్యుమెంట్స్, హోమ్, మోర్టిగేజ్, టేక్ ఓవర్, 40Sq.yds to 150 Sq.yds వరకు ప్లాన్ లేకున్నా అధిక డబ్బు IT రిటర్న్స్ లేకున్నా ఇప్పించబడును. ఫోన్ : 7396226332 [H-780844]

■ **GET Monthly Fixed Income** మీ అకౌంట్‌లో పెట్టుబడి పెట్టుకొని ప్రతి నెలా క్యాష్ 5 Digits సంపాదించుకునే అద్భుత అవకాశం More Details Contact: 7337416456 [H-189210]

■ **Investors Wanted: Business Opportunity, Wanted Investors for New Technology Business Monthly returns 200% & More Safe and Secure Long Time Business, Good Investment Contact: Genuine Investors. Ph : 6303485202.** [H-781523]

CHITS & DEPOSITS

■ కపిల్ చిట్‌ఫండ్స్‌లో 5లక్షలు, 10, 15, 25, 50 లక్షలు మరియు 1Cr చిట్స్ కలవు Deposits కూడా కలవు కా॥వారు T.S.Rao న సం॥గలరు. Ph: 7013808479, 8179948281 [HA-1337]

■ కపిల్ చిట్స్‌లో 1 లక్ష నుండి **1Cr** వరకు, చిట్స్ కలవు వేకెంట్ చిట్స్ ఇప్పించబడును. సంప్ర॥ మల్లికార్జున గుప్తా. **Ph: 8639618422/ 9848050445** [H-189359]

INSURANCE

■ కోటి రూ॥లు మొత్తం మెచ్యూరిటీ కొరకు, కోటి రూ॥ల తక్షణమే ఇన్సూరెన్స్ కొరకు ప్రతిరోజు 300/- రూ॥లు చొప్పున పొదుపు చేయండి. పెన్షన్స్, పిల్లల మనీబ్యాక్ LIC పాలసీల కొరకు, కరోనా రక్షక్ హెల్త్ పాలసీ కొరకు, శ్రీరామ్ చిట్స్ & డిపాజిట్ కొరకు సంప్ర: 9246351657. WWW.LICSAMRAT.COM [HA-11271]

INTERIORS

■ **Experience Modern, Comfortable,** Stylish Interiors For your Villa / Flat, with ontime Delivery and impeccable Finishing. Contact: 9392654401 [H-780928]

INVESTMENTS

■ **Buy Commercial Property @ 36L & Get Life Time Monthly 42K with 5% Increase in Every 5Yrs. Ph: 7799195959.** [H-189214]

SHARES

■ రోజూ 2/3 కాల్స్ లో ట్రేడ్స్ చేసి లాభాలను పొందండి. 90% సక్సెస్ రేట్. 3 రోజుల ఫ్రీ ట్రయల్ కోసం. **What's App/ Call. 7674060761** [H-780943]

SHOP FOR SALE

■ సికింద్రాబాద్ స్టేషన్ రేతిఫైల్ బస్‌స్టాప్ ఎదురుగా 2500 చ॥అడుగుల షాప్ అమ్మకం లేదా రెంట్‌కు కలదు. టిఫిన్ సెంటర్ / బైక్ షాప్ / బ్యాంక్/ రెస్టారెంట్ ఏదైనా పెట్టవచ్చు. కాల్: 9000856222, 9985444442 [HA-11296]

FOR SALE

■ మంచి రన్నింగ్‌లో ఉన్న టెంట్‌హౌస్ షాపు అమ్మబడును. సంప్రదించు ఫోన్ : 9014094488 [H-788501]

HOME NEEDS



WATER PROOFING

■ SSB వాటర్ ప్రూఫింగ్: స్లాబ్, బాత్రూమ్స్, సైడ్ వాల్స్, బాల్కనీ, ట్యాంక్, టెర్రస్ లీకేజీలు 20 సం॥ల అనుభవంతో కెమికల్స్ ద్వారా 10 సం॥ గ్యారెంటీతో చేయబడును. ఫోన్: 7337067834 [H-788926]

PERSONAL CARE



CHANGE OF NAME

■ **I, Naragolu Swamy S/o. Mallesh,** M.C.A., Private Employee, Shall henceforth be known as Narige Swamy S/o. Narige Mallesh for the purpose of correction of wrong entries occurred in school records due to parental mistake. [HA-3711]

■ **I, Kayiti Bhasker S/o. Narayan Reddy,** R/o.H.No.14-20-677/350/A, Vivekananda Nagar, Borabanda, Hyd. Changed my Name as Kaithi Bhasker Reddy. S/o. Kaithi Naran Reddy. [H-189364]

■ **I, Firdouse Begum D/o. Shaik Chunnu R/o. H.No. 6-5-316, New Bhoiguda, Near Gandhingar Police Station, Secunderabad - 03. T.S., Has Changed My Name As Shaik Firdause Fathima for all purposes.** [HA-94217]

■ **I, Metlababy D/o. Metlamamillu, Plot** No. 90, H.No. 4-34/13, Munaganoor (V), Hayath Nagar, R R Dist., Pin- 501511. Changed my Name As BHATTA DEVIKA [HA-189363]

■ **I, Durghasi Sujata W/o Durghasi Santa** Rao, R/o. Flat No. 1207, 2nd Floor, D-Block, Asian Sun City Apartments, Kothaguda, R R Dist. Changed my Name as Durghasi Sujata to Durgasi Sujatha [H-788723]

■ **I, Leonara R/o. H.No. 4-170/50, Madhavpuri, Sainikpuri, Secunderabad - 500094, T.S. have Changed my Name as Leonara Lawrence for all purposes.** [H-793489]

OLD AGE HOME

■ వృద్ధులకు, బెడ్‌పేషెంట్స్‌కు, దీర్ఘ వ్యాధులతో ఉన్నవారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24గం॥ వైద్య, భోజనం వసతి ఉప్పల్, ECIL, Hyd. సంప్ర: 9949520296, 7981467036. [H-781644]

■ సురక్షణ ఓల్డేజ్ హోమ్ అన్ని వసతులతో సౌకర్యవంతమైన హోం, భోజనం, వసతి కలదు, రూమ్స్ సెపరేట్ కలవు. కేర్‌టేకర్స్ కలరు. సంప్ర: 8121413440 [H-189227]

■ త్రివేణి హోంకేర్ వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకోవడానికి, వంట, ఇంటి పనికి వర్కర్స్‌ను మీ ఇంటికే పంపబడును. ఫోన్ : 9160900023, 9160900024 [H-189306]

■ శ్రీహర్ష ఓల్డేజ్‌హోమ్, YSR సర్కిల్, IRR, విజయవాడ, మీపెద్దలను ప్రేమాభిమానాలతో చూసుకొనుటకు మా హోమ్‌లో చేర్పించండి, మీరు నిశ్చింతగా ఉండండి. Ph: 7093911010/ 9573000987/ 8897730222 [H-780886]

■ ఈశ్వర్ హోమ్‌కేర్ సర్వీసెస్, 24గం॥ వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను, ఇంటి/వంట పనికి కేర్‌టేకర్స్ మీఇంటికి పంపబడును. ఫోన్ : 8374551099, 8977641099 [H-781238]

TOURS & TRAVELS



■ 29/7 రామేశ్వరం, శ్రీరంగం, 22 యా॥ 19/8 కర్ణాటక యాత్ర, 9/9న 4 జ్యోతిర్లింగాలు, షిర్డి 7రో॥, 9/10 కాశీలో 9ది, 15/11 అష్టజ్యోతిర్లింగాలు, పంచ ద్వార కలు, సంప్ర. భాస్కర రావు. ఫోన్:9848486847. [H-781645]

■ **August 2 Amarnath 10 Days 12 Places Aug** 27 Nepal Sept.3 Chardaam 15 Days 12 Places Sept.25 Rameshwaram 10 Days 12Places Food+ Accom. Maatours. 9493652100, 6300577431. [H-189259]



■ ప్రముఖ బట్టల షాపులో పనిచేయుటకు టైలర్స్, అనుభవంగల సూపర్‌వైజర్స్ Only లేడీస్ కావలెను. జీతం: 10-15వేలు, భాగ్యలక్ష్మి కాలనీ కమాన్, కుత్బుల్లాపూర్. ఫోన్: 9989861959 [H-189304]

■ కన్సల్టింగ్ ఆఫీస్‌లో పనిచేయుటకు అనుభవం ఉన్న కంప్యూటర్ Knowledge కలిగిన అబ్బాయిలు కావలెను. కూకట్‌పల్లి, కె.పి.హెచ్.బి. (వాళ్లు). ఫోన్ : 7416011639, 7396603499 [HA-788603]

■ BiPC ఇంటర్-ట్యూషన్ టీచర్స్, టెలికాలర్స్, యాంకర్స్, వీడియో ఎడిటింగ్, చర్చి పాస్టర్స్, క్రిస్టియన్లు, సూపర్‌వైజర్స్, డ్రైవర్లు, వంట మనిషి, హెల్పర్లు. Q: 10-డిగ్రీ. పి.జి., జీ: 10-20K. ఫోన్: 9505261777 [H-189229]

■ డ్రైవర్ కావలెను: జూబ్లీహిల్స్ ఇంటి నందు పనిచేయుటకు అనుభవం గల బ్యాచిలర్ డ్రైవర్ కావలెను. 18-20వేలు భోజనం, వసతి ఇవ్వబడును ఇతర సౌకర్యాలు చెందవచ్చు (షరతులు వర్తిస్తాయి). సంప్ర: 8985678833 [H-781541]

■ శ్రీ సాయి హోం కేర్ 24/7 మా వద్ద వుండి మంచంమీద ఉన్న వృద్ధులకు సేవ చేయటానికి, పిల్లలను చూడటానికి పని వారు కావలెను. ఫోన్ : 9533909627, 9494071023 [H-780941]

■ విజయ ఎలక్ట్రికల్, రాణిగంజ్‌లో పనిచేయుటకు జెంట్స్ హెల్పర్స్ కావలెను. Q: 10th- ఇంటర్, డిగ్రీ, రాణిగంజ్, సికింద్రాబాద్‌కు 5కి.మీ. దూరంలో ఉన్నవారికి ప్రాధాన్యత. సంప్ర: 9848268105 [HA-5572]

■ శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులను, పేషెంట్స్‌ని, చిన్నపిల్లలను చూసుకొనుటకు, వంట, ఇంటి పనికి కేర్‌టేకర్స్‌ని, ఆయాలను, నర్సులను, 12, 24 గం॥ మీ ఇంటి వద్దకు పంపబడును. 18-20K ఫోన్:6309807798, 9121089519 [H-788722]

■ **Opportunity Every one! Monikonda Puppala guda** ప్రముఖ రియల్ ఎస్టేట్ కం॥ లో మార్కెటింగ్ చేయుటకు, సేల్స్ ఆఫీసర్స్, మేనేజర్స్ M/F, కా॥ Part & Full Time, You work we support. ఫోన్: 9550367905 [H-788819]

■ ఆల్ ఇండియా మార్కెట్ గల మా ఫార్మా కంపెనీకి అనుభవం గల లేక ట్రైనీ టూరింగ్ చేయగల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం+TA, DAలతో మరియు కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. 9515906315 [H-780728]

■ ఒక్క ప్లాట్ అమ్మి లక్ష సంపాదించు పెట్టుబడి మాది, లాభం మీది, 5 లక్షల ప్లాట్ (605 గజాలు) అమ్మండి నెలకు లక్ష సంపాదించండి. సంప్ర: 7093490779, 9030626206 [H-189452]

■ అర్జెంటుగా క్రైటా వెహికల్ నడపడానికి డ్రైవర్ కావలెను, మంచి జీతం, ఉప్పల్ బోడుప్పల్ వారికి ప్రాధాన్యత. ఫోన్ : 7032422719 [H-788817]

■ ట్రైనర్స్ కావలెను (వాటర్ ప్యూరిఫైర్స్ కంపెనీ) సర్వీస్ టెక్నీషియన్స్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ మరియు లేడీ టెలికాలర్స్. మంచిజీతం + ఇన్సెంటివ్ సంప్ర॥ Waves సికింద్రాబాద్ Ph: 9989123012 [H-189360]

■ హైదరాబాద్‌లో ఎల్.బి.నగర్, కూకట్‌పల్లిలో SBS మాడ్యులర్ కిచెన్, కబోర్డ్స్ నందు వర్క్ చేయుటకు 2 వీలర్ కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 9949445899 [G-321]

■ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో పార్ట్ / ఫుల్ టైం వర్క్ చేస్తూ ప్రతినెల 25 వేల పైన సంపాదించవచ్చు. అర్హత : ఇంటర్ పైన, గృహిణులు, రిటైర్డ్ పర్సన్స్, స్టూడెంట్స్ మరిన్ని వివరాలకు : 85001 48297 [V- 797232]

■ ప్రముఖ హోమ్‌కేర్ సర్వీసెస్ హైదరాబాద్ లో వృద్ధులకు,పేషెంట్లకు సేవచేయుటకు, బేబీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీ/పు కా॥. జీ: 16,000-25000/-రూం+భో॥ఫ్రీ. ఫోన్: 9390343765 [H-189453]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు, సేల్స్ ఆఫీసర్స్, సేల్స్ మేనేజర్స్ M/F కావలెను. Part Time/Full Time/work from Home. Cont: 8309210029 [H-788816]

■ **Hyd**లో 24 గం॥ ఇంట్లోనే ఉంటూ వంట, ఇంటిపని, బేబీ కేర్, పేషెంట్ కేర్ చేయుటకు స్త్రీలు కావలెను. వ॥ 18 to 45. జీతం : 15000-25000, భోజన వసతి ఫ్రీ ✆ 73864 44217, 96661 28467 [B-786379]

■ **జీవితాంతం ఎక్కువ సంపాదన ఏ పెట్టుబడి** లేకుండా కావాలంటే LIC ఏజెంట్‌గా చేరండి. 10th పాస్ అయి ఆడ/మగ పార్ట్/ఫుల్ టైం పనిచేయుటకు సంప్ర: 9246351657 [HA-11272]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడివార్డెన్స్, ఆయాలు, భార్యభర్తలు, డ్రైవర్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-11279]

■ గుర్రంగూడలోని ఫార్మసీలో పని చేయుటకు Min. 2 Yrs Exp. గల Asst. ఫార్మాసిస్టు Qly: Any డిగ్రీ & హెల్పర్స్ Qly: 10th/ ఇంటర్ కావలెను. Ph: 9912013021 [HA-13624]

■ అమీర్‌పేట్ లేడీస్ హాస్టల్ లో పని చేయుటకు ఇంటర్ లేదా డిగ్రీ చదివిన లేడీ వార్డెన్ కావలెను. సంప్ర: 9985163370 [H-780845]

■ అమీర్‌పేట్‌లో సెక్యూరిటీ సూ॥వైజర్స్ కా॥ 12గం॥ డ్యూటీ. జీ: 15వేలు, బేగంపేట, అమీర్‌పేట్‌లో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12గం॥ డ్యూటీ, జీ: 13 వేలు. 7032086797, 9949830907 [H-780837]

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221457]

■ **Wanted Delivery Persons & Marketing Executives Near Malkajgiri. Contact: 7299288899, 9959599665** [H-796920]

■ **Urgently Office Staff 10 No's Computer Operator, Digital Marketing Executives Male/ Female Fresh/ Experienced 10K to 40K. Whats App CV. 9063244927 work @ Troop Bazar, Near Koti Abids.** [HA-11299]

■ **Urgent Required 4 No's House Maid Lady's. Age 18-26, Tarnaka Sec-bad. Ph : 8125726969, 7842615091.** [HA-94210]

■ **Wanted Sales Executive and** Accountant for a Wholesale Jewellery Shop at Paradise Secunderabad with 3-5 years Experienced in Sales and Accounts GST, Tally. Age Below 50 Years. Ph : 9100551194. [H-189555]

■ **Wanted Security Officers, Ex-Service** Men for Gachibowli, Isnapur, Miyapur, Bollaram and Bibinagar, Cont: P.S. Rao. Ph: 9866077600 [HA-11294]

■ **Wanted Site Supervisors (Technical)** Exp. in Civil or Interior Project Balanagar, Ph: 9959192349, Mail ID:vijayshamboinfrastructure@gmail.com [H-189307]

■ **Civil Engineering-Diploma/Degree** Trainees. Candidates from Reputed Colleges. Auto CAD Drafting Skills, Excel Spreadsheet use, Soft Skills, attitude to learn,to work in Hyderabad for Construction /Repairs of high end residential houses/ Commercial Properties, may drop your Resume for an interview call at: 8985678844. gayathri.interviews@gmail.com. Very Good Salary for the Deserving & For Immediate Joining only. (Experienced persons will also be considered) [H-781542]

■ **Wanted M/F Candidates 20yrs Experienced Real Estate Company Requires Full/Part Timers to Sell DTCP & RERA Approved Plots, Spot Regd. @ Alaer Near Yadagirigutta Target based Salary + Attractive incentives 60 Months, Inst. Plots Walk-in 11am to 6 pm. Ph: 9849017757.** [HA-48]

■ **Wanted Male Non Teaching Staff and Marketing Vice Principal in a Reputed Educational Organisation. Qualification Any Degree. Salary: 12000/- to 20000/-, Age: 25 to 45. Job Location: Ameerpet, Hyd. Contact: 92487 33323** [G-4465]

■ **Wanted Tellecallers and Marketing** executives Female (Two Wheeler Must) attractive Salary. Kshetra Academy. Contact: 7997516969. [HA-10943]

■ **Required Experienced Male Receptionist,** Graphic Designer, Supervisor, House Keeping Boy, DCM/CAR Driver, Loading Boys, Cont: 9100222333 / 23215566 [H-781526]

■ **Wanted Customer Service executives** (F) Relationship Manager (M/F) Business Development executive a reputed DSA Company with Good Skill and Communication Cont: 9052254355 [H-781536]

FACULTY TEACHERS

■ **Wanted Teachers Pre Primary Teachers,** Pre Primary Incharge, Computer, Higher English, Social for Reputed School in Tilaknagar, Ph : 8498088747, 9396615657 [H-780726]

■ **Lady Teachers Fluent English for (CBSE)** Nursery, PPI, I-V, EVS, Social Rs. 16000/- Admin Cum Typist with M.S. Office, Excel Rs. 18000/- Submit Originals, Aayas Rs.9000, Pillar 179, Attapur, Hyd. 7207888177. [HA-11300]

■ **Req. Staff Special School for Intellectually** Challenged Children Secunderabad. Principal with Qualification MSW, M.Ed., PGDBI, MBA, MCA, M.Sc Speech, MPT, MOT / Any Other Equivalent. Rs. 1417/- Per Day & Teachers with Qual.: Graduate with B.Ed/ BMR/ BRS DSE Other Equivalent. Rs. 1240/-per day Qual: Resume Send to S. Raju Contractor, R/o. H.No. 16-2-839/4/13, LIC Colony, Saidabad, Hyd-500059. 9347645544. [HA-13941]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గ్యాస్ లీకేజీ ఘటనలో మరొకరు మృతి

గాంధీఆస్పత్రి: దోమలగూడ ఠాణా పరిధిలో వంటగ్యాస్ లీకై జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడి గాంధీఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో శనివారం మరొకరు మృతి చెందారు. దీంతో ఈ ఘటనలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. ఈ నెల 12న శరణ్య, 14న పద్మ, ధనలక్ష్మీ, అభినవ్‌లు మరణించారు. గాంధీ టీఎంటీవార్డులో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న నాగమణి (48) శనివారం మృతి చెందింది. నాగమణి భర్త ఆనంద్ పరిస్థితి కూడా విషమంగా ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు తెలిపారు. గాయపడిన మరో చిన్నారి విహాన్ (03) ప్రైవేటు ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు.


మృతి చెందిన నాగమణి (ఫైల్)

విదేశాలకు వెళ్లే విద్యార్థుల కోసం 'స్టడీ బడ్డీ కార్డ్'

సాక్షి, సిటీబ్యూరో: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు అధునాతన ఓమ్ని చానల్ ఫారెక్స్ సేవలను అందించడం కోసం థామస్ కుక్ సంస్థ ఆధ్వర్యంలో మాస్టర్ కార్డ్, వీసా భాగస్వామ్యంతో ప్రత్యేకంగా 'స్టడీ బడ్డీ కార్డ్'ను ప్రారంభించారు. 2023 ఆర్థిక సంవత్సరంలో యూఎస్‌డీ 3.43 బీఎన్ ఖర్చుతో విదేశీ విద్య విభాగం ప్రాతినిధ్యం వహిస్తుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. ఇలాంటి తరుణంలో మొత్తం విదేశీ ఖర్చులో 13 శాతం భారతదేశం నుంచి మార్కెట్ వాటాను విస్తరించే వ్యూహంలో భాగంగా ఈ స్టడీ బడ్డీ కార్డ్‌ను ప్రారంభించామని థామస్‌కుక్ ప్రతినిధులు పేర్కొన్నారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు దీనితో బహుళ ప్రయోజనాలు సమకూరుతాయని వారు తెలిపారు.

క్లుప్తంగా...

ఆట, పాటలతో విద్యార్థుల సందడి



బోనాలతో సాయిరాం స్కూల్ విద్యార్థులు

బంజారాహిల్స్: శ్రీకృష్ణానగర్ సీ బ్లాక్‌లోని శ్రీ సాయిరాం స్కూల్‌లో బోనాల పండుగ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పండుగ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. విద్యార్థులు పోతరాజులుగా, శివసత్తులుగా వేషధారణ చేసి సందడిగా గడిపారు. వేడుకల సందర్భంగా పాఠశాలలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. విద్యాసంస్థల చైర్మన్ నల్లపాటి వెంకటేశ్వరరావు, అనిత, నజ్రీన్ తదితరులు పాల్గొన్నారు.

నీతి కథల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



బంజారాహిల్స్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం వివిధ పాఠశాలల్లో కథ చెబుతారా.. ఊ కొడతాం నీతి కథల పోటీలు నిర్వహించింది. 10–15 సంవత్సరాల సీనియర్స్ గ్రూప్‌లో ఎల్బీ నగర్ జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని ఎం.గీత ప్రథమ బహుమతి, యశస్విని రెండో బహుమతిని, టి. రామచంద్ర వర్ధన్ మూడో బహుమతిని గెలుచుకున్నారు. 5–10 సంవత్సరాలలోపు జూనియర్ విభాగంలో సుమన్విత ప్రథమ బహుమతి, కె.ప్రభావతి రెండో బహుమతి, జి. వెంకట్ మూడో బహుమతి గెలుచుకున్నారు. టీటీడీ ఏఈవో చతుర్వేదుల సత్యనారాయణ, ప్రోగ్రామ్ అసిస్టెంట్ గూడూరు హరినాథ్, వీఆర్ ఫౌండేషన్ చైర్మన్ విజయారెడ్డి సేవ్ ఎర్త్ ఫౌండర్ సురేంద్ర తదితరులు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

గుంతల పూడ్చివేత

బంజారాహిల్స్: బోనాల పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణాలతో పాటు పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు ఆదేశించిన నేపథ్యంలో సంబంధిత సిబ్బంది పరిశుభ్రతపై దృష్టి సారించారు. ఆలయాల ముందు పేరుకు పోయిన మట్టి, వ్యర్థాలను రెండు రోజులుగా జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగిస్తున్నారు. ఆలయ పరిసరాల్లో మురుగు లీకవకుండా జలమండలి సిబ్బంది డ్రెయినేజీ మ్యాన్‌హోళ్లను శుభ్రం చేశారు. పండుగ రోజున కూడా పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

మసాజ్ పార్లర్లపై పోలీసుల దాడులు

బంజారాహిల్స్: నిబంధనలకు విరుద్ధంగా మసాజ్ పార్లర్ల ముసుగులో వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్న స్పాలపై వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి పెద్ద ఎత్తున నిర్వాహకులను అరెస్ట్ చేసి ఆయా పోలీస్ స్టేషన్లకు అప్పగించారు. పంజగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ దాడులు జరిగాయి. క్రాస్ మసాజ్ చేస్తూ అక్రమంగా స్పాలు నడుపుతున్న నిర్వాహకులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. విటులకు నోటీసులు జారీ చేశారు. సెక్స్ వర్కర్లను పునరావస కేంద్రాలకు తరలించారు. మార్గదర్శకాలు పాటించని మసాజ్ పార్లర్లపై కేసులు నమోదు చేసి 34 మందిని అరెస్ట్ చేశారు.

చైన్ స్నాచింగ్

వెంగళరావునగర్: గుడికి వెళ్లి తిరిగి వస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... వెంగళరావునగర్‌కాలనీలో నివాసం ఉండే పొట్లపల్లి ఉమ శుక్రవారం సమీపంలోని దేవాలయానికి వెళ్లి వస్తుంది. ఇంటికి సమీపంలోకి రాగానే వెనుక నుంచి ఆంటీ అనే పిలుపుతో ఆమె వెనుదిరిగి చూసింది. అప్పటికే ఆమెను ద్విచక్ర వాహనంపై వెంబడిస్తున్న ఇరువురు యువకుల్లో ఒకడు ఆమె మెడలో ఉన్న చైన్‌ను పట్టుకుని లాగాడు. దాంతో ఆమె భయపడి గొలుసును గట్టిగా పట్టుకుంది. అగంతకుడు విడవకుండా మరింత గట్టిగా లాగడంతో సగం గొలుసు అతని చేతికి వచ్చింది. క్షణాల్లోనే తిరిగి వాహనంపై ఎక్కి ఇరువురు పారిపోయారు. రాత్రికి తన కుమారుడు ఇంటికి రాగానే ఉమ విషయాన్ని తెలియజేసింది. శనివారం కుమారుడితో పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. తన గొలుసు లాక్కెళ్లిన ఇరువురు యువకుల వయసు దాదాపు 25–30 ఏళ్ల వయసు ఉంటుందని, గొలుసు లాగిన యువకుడు నల్ల టీ షర్ట్, నలుపురంగు నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, వాహనాన్ని నడిపిన వ్యక్తికి బట్టతల ఉందని, అగంతకులు తీసుకెళ్లిన గొలుసు దాదాపు ఒకటిన్నర తులం ఉంటుందని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బోనాలకు వేళాయె..

నేత్రపర్వంగా అమ్మవారి ఆలయాల ముస్తాబు



ఖైరతాబాద్‌లోని మహంకాళి పోచమ్మ ఆలయం

బంజారాహిల్స్: బోనాల జాతర సంబురాలను అమ్మవారి ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆదివారం బోనాలను నిర్వహించనున్న నేపథ్యంలో ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలు, పూల మాలలతో సుందరంగా తీర్చిదిద్దారు. జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం ఆలయాల పరిసరాలను శుభ్రం చేసింది. ఆలయాల్లో భక్తుల కోసం ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచే మొక్కులు చెల్లించుకునేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో రానుండటంతో ఆ మేరకు ఆలయాల వద్ద సౌకర్యాలు కల్పించారు.

- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, చింతల్‌బస్తీ, సోమాజిగూడ, ఖైరతాబాద్ ప్రాంతాల్లో ఆలయాలు బోనాల శోభతో కళకళలాడుతున్నాయి. బోనాల పండగను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుండగా ఇప్పటికే ఖైరతాబాద్ నియోజక వర్గంలోని 106 అమ్మవారి ఆలయాలకు బోనాల వేడుకల నిర్వహణ కోసం రూ. 3.6 కోట్లను పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో ఆలయాలకు వచ్చే ప్రాంతాల్లో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఆలయం వద్ద పోలీసు నిఘా ఏర్పాటు చేస్తున్నారు.

- రంగురంగుల విద్యుత్ దీపాలతో కనువిందు చేస్తున్న ఆలయాలు
- ఏర్పాట్లను పూర్తిచేసిన నిర్వాహకులు
- ఆలయాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు

- పలు ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నిఘా నీడన బోనాల వేడుకలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. ఆలయాలకు దారితీసే ప్రాంతాల్లో పోలీసు పికెటింగ్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. మరో వైపు బోనాల పండుగ రోజున మద్యం షాపులుబంద్ చేయాలని ఇప్పటికే ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.



ఇందిరానగర్‌లోని నల్లపోచమ్మ ఆలయం

మహంకాళీ ఆలయంలో...

ఖైరతాబాద్: బోనాల జాతరకు ఖైరతాబాద్‌లోని శ్రీ మహంకాళీ పోచమ్మ అమ్మవారి దేవాలయాన్ని ఆలయ కమిటీ సభ్యులు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఆదివారం బోనాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 5 గంటల నుంచే అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. రాత్రి 10 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని కమిటీ చైర్మన్ భవానీకృష్ణ యాదవ్, అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి మధుకర్‌యాదవ్ తెలిపారు. దశాబ్దకాలంగా నిర్వహించే రంగం కార్యక్రమం సోమవారం సాయంత్రం 6.30 గంటలకు ఉంటుందన్నారు. లాల్‌బజార్ నుంచి రేణుకా అమ్మవారు భవిష్యవాణి వినిపిస్తారని తెలిపారు. ఆదివారం నిర్వహించే బోనాల ఉత్సవాలకు ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ విజయారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలపారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు బాలయ్య, ఆంజనేయులు, రాము, లక్ష్మణ్ యాదవ్, లియో, శ్రీకాంత్, రామేశ్వర్ రావు, పూజారి కృష్ణ పంతులు పర్యవేక్షించారు.

- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, ఖైరతాబాద్, సైఫాబాద్, మధురానగర్, బోరబండ పోలీస్ స్టేషన్ల పరిధిలో బోనాల వేడుకలు నిర్వహించే ఆలయాల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



బంజారాహిల్స్ రోడ్ నం.14లోని శీతలమాత..

సీసీ కెమెరాల దాతలకు కొత్వాల్ సత్కారం



దాతలను సత్కరిస్తున్న కమిషనర్ సీవీ ఆనంద్

బంజారాహిల్స్: బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగస్వాములైన వివిధ సంస్థల యజమానులను నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. శనివారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన దాతలను అభినందించడమే కాకుండా మిగతావారికి ఆదర్శంగా నిలుస్తారని కొనియాడారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లో ఎంతో మంది సంపన్నులు ఉన్నారని ఎన్నో ప్రఖ్యాత వ్యాపారసంస్థలు ఉన్నాయని వీరంతా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా కేబీఆర్ పార్కు జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన దొడ్ల డెయిరీ అధినేత సునీల్‌రెడ్డి రూ. 30 లక్షలు, రెయిన్‌బో ఆస్పత్రి రూ. 20 లక్షలు, ఒమేగా ఆస్పత్రి రూ. 10 లక్షలు, సిటీ న్యూరో ఆస్పత్రి రూ. 5 లక్షలు విరాళంగా ఇచ్చాయని వారిని ఘనంగా సత్కరించారు. అలాగే జూబ్లీహిల్స్ రోడ్ నెం.1, 10, 45, 36లలో కెమెరాలు ఏర్పాటు చేయడానికి శ్రీజ్యువెలర్స్ రూ. 10 లక్షలు, ఎల్లో ట్రిలియం రూ. 9 లక్షలు, ఎల్‌ఎం ఇన్వెస్ట్‌మెంట్స్ రూ. 5 లక్షలు, ఓయిలా రెస్టారెంట్ రూ. 5 లక్షలు, జోరా కిచెన్ అండ్ బార్ రూ. 5 లక్షలు, కృష్ణా జ్యువెలర్స్ రూ. 3 లక్షలు, సాగర్ సిమెంట్స్ రూ. 2 లక్షలు విరాళంగా ఇచ్చాయని వారిని ఘనంగా సత్కరించారు.

శిశువిహార్ కార్మిక సమస్యలు పరిష్కరించేదాకా పోరు: సీఐటీయూ



స్టేట్‌హోం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

వెంగళరావునగర్: మహిళా శిశుసంక్షేమ శాఖలోని శిశువిహార్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యడులు కె.ఈశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేష్‌లు తెలియజేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం మధురానగర్‌లోని మహిళాశిశు సంక్షేమ శాఖ (స్టేట్ హోం) ప్రధాన కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా హాజరైన నాయకులు మాట్లాడుతూ... ప్రతి నెల 7వ తేదీన జీతాలు చెల్లించాల్సి ఉండగా 20వ తేదీ వరకూ చెల్లించడం లేదన్నారు. కార్మికులకు చట్ట ప్రకారం ఇవ్వాల్సిన క్యాజువల్ లీవులు, పండగ, జాతీయ సెలవులు, ఆర్జిత సెలవులు అమలు చేయాలన్నారు. రెండేళ్లుగా యూనిఫాం కూడా ఇవ్వడం లేదని, వెంటనే పంపిణీ చేయాలన్నారు. 2021 ఏప్రిల్ నుంచి 2023 ఫిబ్రవరి వరకు పెరిగిన వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని, బస్ పాసులను ఇవ్వాలని, పీఎఫ్ సొమ్ము కార్మికుల ఖాతాలో జమ అయినట్టుగా తగిన మెసేజ్‌లు పంపించాలని, డబుల్ డ్యూటీ చేసిన కార్మికులకు డబుల్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే వీటిని అమలు చేయకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం శిశువిహార్ జాయింట్ కమిషనర్ సునందకు వినతిపత్రాన్ని సమర్పించారు. శిశువిహార్ యూనియన్ నేతలు అశోక్, సుజాత, స్వామి, సాయిశేషగిరిరావు, సుశీల, సునంద, రోజ, మంగ, శ్యామల, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

డాక్టర్ శివరంజని సంతోష్



సీపీఆర్ పట్ల అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శివరంజని

లక్డీకాపూల్: క్లిష్ట పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స అందించడంలో అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యమని, తద్వారా ప్రాణపాయస్థితి నుంచి బయటపడవచ్చని ప్రముఖ శిశు వైద్యురాలు డాక్టర్ శివరంజని సంతోష్ అన్నారు. శనివారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలో భాగంగా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయంలో మహిళా సాధికారత, శిశు సంరక్షణపై ఆమె మాట్లాడారు. ఈ క్రమలో సీపీఆర్, పిల్లల ఉక్కిరిబిక్కిరి గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. సోషల్ మీడియా వేదికగా ప్రివెంటివ్ పీడియాట్రిక్స్, హెల్త్ అవేర్‌నెస్, మిత్ బస్టింగ్ సమస్యలతో పాటు ప్రివెంటివ్ పీడియాట్రిక్స్, ప్రథమ చికిత్సలపై సామాన్య ప్రజలకు సైతం అవగాహన కల్పించడంలో విశేషమైన కృషిసల్పుతున్నారు. ఈ నేపథ్యంలో ఎఫ్‌సీఐ ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో డాక్టర్ శివరంజని ఎఫ్‌సీఐ సిబ్బందికి సీపీఆర్‌లోని మెళకువలు, పిల్లల్లో ఉక్కిరిబిక్కిరి చేయడాన్ని నివారించడం, మూర్ఛలకు ప్రథమ చికిత్స గురించి అవగాహన కల్పించారు. తెలంగాణ డిప్యూటీ జనరల్ మేనేజర్ (రీజియన్) సుధాకర్‌రావు పెంట ప్రారంభించిన కార్యక్రమంలో నగరంలోని ఎఫ్‌సీఐ, ఆర్‌ఓ డీజీఎంలు, ఎజీఎంలు, సిబ్బంది హాజరై వివిధ ప్రథమ చికిత్స పద్ధతులపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పీడియాట్రిక్స్ విభాగంలో డాక్టర్ శివరంజని చేసిన కృషికి ఆమెను సత్కరించారు.

బోనాలపై విద్యార్థులకు అవగాహన



పండుగలు, సంస్కృతి, సంప్రదాయాలపై చిన్నారులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఖైరతాబాద్ ఆనంద్‌నగర్ కాలనీలోని సెయింట్ జోసఫ్ కాన్వెంట్‌లో శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బోనాల జాతర విశిష్టతను వివరించేలా ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

లిబర్టీ: ఉచిత విద్యుత్ మాటున విద్యుత్ కొనుగోళ్లలో చోటుచేసుకున్న అవకతవకలపై సీబీఐచే విచారణ జరిపించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరాలో ఎనిమిది వేల కోట్ల రూపాయల అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఆయా అక్రమాలు వెలుగులోకి రావాలంటే సీబీఐచే విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న విద్యుత్ సరఫరాలో ఇన్ని వేల కోట్ల అవినీతి జరగడం వెనుక ఎవరి హస్తముందో విచారణ జరిపిస్తే వెల్లడవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత విద్యుత్ సరఫరా వెనుక ఎన్ని వేల కోట్ల అక్రమాలు జరిగితే సీబీఐ, ఈడీలాంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు ఏమిచేస్తున్నాయంటూ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ముంటే ఉచిత విద్యుకి ఎంత ఖర్చు చేశారో అనే సమగ్ర వివరాలతో వెల్లడించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలకు అవినీతికి దోపిడీకి పాల్పడుతోందని ధ్వజమెత్తారు. బీజేపీ అండదండలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విచ్చలవిడి అక్రమలకు అవినీతికి పాల్పడుతున్నదని విమర్శించారు.

బడ్జెట్‌లో విద్యకు అదనంగా 4.5 శాతం నిధులు కేటాయించాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

జాతీయ మహిళా కమిషన్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ శాంతాసిన్హా

పంజగుట్ట: రాష్ట్ర బడ్జెట్‌లో ప్రస్తుతం విద్యకు కేటాయిస్తున్న 6.4 శాతానికి అదనంగా మరో 4.15 అదనంగా కేటాయిస్తే ఐదు సంవత్సరాల్లో అభివృద్ధి చెందిన దేశాల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య తెలంగాణలో అందివ్వచ్చనని సోషల్ డెమొక్రటిక్ ఫోరం పేర్కొంది. ఫోరం కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి 'తెలంగాణలో విద్య ఎలా ఉండాలి' విద్యాభివృద్ధికి రూపొందించిన ప్రతిపాదనల పుస్తకాన్ని శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఫోరం కో కన్వీనర్ డాక్టర్ సంగారెడ్డి పృథ్వీరాజ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ మహిళా కమిషన్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ శాంతాసిన్హా మాట్లాడుతూ... రాష్ట్రంలో 12 నుంచి 16 సంవత్సరాల మగపిల్లలు గంజాయి, మద్యం, స్మార్ట్‌ఫోన్‌లకు అలవాటు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలకు ఇప్పటికీ బాల్య వివాహాలు అవుతున్నాయన్నారు. ఇది ఇలానే కొనసాగితే 10 సంవత్సరాల తర్వాత తెలంగాణ ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. తెలంగాణలో విద్యావ్యవస్థ ఎలా ఉండాలో సోషల్ డెమొక్రటిక్ ఫోరం తీసుకువచ్చిన రిపోర్టును ప్రభుత్వం తప్పక అమలు చేయాల్సిందే అన్నారు. ఆకునూరి మురళి మాట్లాడుతూ... పశ్చిమదేశాలు తీసుకున్నట్లుగా తెలంగాణలోనూ పిల్లల బాధ్యత పూర్తిగా ప్రభుత్వం తీసుకోవాలన్నారు. పేద ధనిక తేడా లేకుండా అందరు పిల్లలకు సమానంగా నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత ప్రతి జిల్లాకు కనీసం ఒక పూర్తి స్థాయి ఇంజినీరింగ్ కాలేజీ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఫోరం సలహాదారులు ప్రొఫెసర్ మురళీమనోహర్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, కో కన్వీనర్లు డాక్టర్ రమ, డాక్టర్ జగదీశ్వర్, సాదిక్‌అలీ, ఆంజనేయులు, రంజిత్‌కుమార్, డాక్టర్ ప్రీతి, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సింప్లి నాంధారీలో బిర్యానీ ఫెస్టివల్



విద్యార్థులకు బిర్యానీ ప్యాకెట్లు అందజేస్తున్న సంస్థ ఉద్యోగులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని సింప్లీ నాంధారీ స్టోర్‌లో బిగ్ బిర్యానీ ఫెస్టివల్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. పూర్తి శాకాహార వస్తువులు విక్రయించే తమ సంస్థ ద్వారా 400 మంది విద్యార్థుల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన వెజ్ బిర్యానీని సిటీలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంస్థ మార్కెటింగ్ హెడ్ హేమ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. స్టోర్‌కు విచ్చేసిన వినియోగదారులకు సైతం బిర్యానీ ప్యాకెట్లను అందజేశారు. స్టోర్ ప్రాంగణంలో బిగ్ బిర్యానీ ఫెస్టివల్ సందర్భంగా ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

'ఏటీఎం రాబరీ' కేసును ఛేదించిన పోలీసులు

- నలుగురు కేరళీయుల అరెస్టు
- సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు, రమణారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి

హిమాయత్‌నగర్: స్కెచ్ వేసి.. కళ్లల్లో పెప్పర్‌స్ప్రే కొట్టి రాబరీకి పాల్పడ్డ కేసును ఎట్టకేలకు పోలీసులు ఛేదించారు. దోమలగూడ, సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్, ముషీరాబాద్, సెక్రటరియేట్(లేక్) పోలీస్ స్టేషన్‌లకు సంబంధించిన ఏడు టీంల పోలీసులు సంయుక్తంగా ఈ కేసును ఛేదించారు. నలుగురు కేరళ రాష్ట్రానికి చెందిన నలుగురుని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 3 లక్షల 25 వేల నగదు, ఎర్ర రంగు స్విఫ్ట్ కారు, ఒక పల్సర్ బైక్, నాలుగు సెల్‌ఫోన్‌లు, ఒక పెప్పర్‌స్ప్రేను సీజ్ చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు, టీమ్స్ ఇంచార్జిగా వ్యవహరించిన డీసీపీ రమణరెడ్డి తెలిపారు. శనివారం బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ సీపీ కార్యాలయంలో చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, దోమలగూడ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్‌రెడ్డిలతో కలసి విలేకరులకు వివరాలను వెల్లడించారు.

పక్కా స్కెచ్‌తో వెంబడిస్తూ...

కేరళ రాష్ట్రానికి చెందిన అబ్దుల్ ముజీబ్ అనే యువకుడు హిమాయత్‌నగర్‌లోని ఉర్దూ హాల్ లైన్‌లో ఉంటూ ఏటీఎం మిషన్లలో డబ్బు డిపాజిట్ చేసే పని చేస్తున్నాడు. ఈ నెల 3న దుబాయి నుంచి ఓ వ్యక్తి పంపిన రూ. 10 లక్షల క్యాష్‌ను వివిధ బ్యాంకులకు చెందిన సీడీఎం మిషన్ల ద్వారా డిపాజిట్ చేసే పనిలో నిమగ్నమయ్యాడు. ఇదే రాష్ట్రానికి చెందిన తన్సిఫ్ అలీ అలియాస్ తన్సీ, మహ్మద్ సహద్ టీవీ అలియాస్ సహద్, తన్సీ బరిక్కల్, అబ్దుల్ ముహీస్ టీఎంలు ఆ డబ్బును రాబరీ చేసేందుకు పన్నాగం పన్నారు. 3వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో హిమాయత్‌నగర్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంకు ఏటీఎం సెంటర్‌లోని సీడీఎంలో డబ్బు డిపాజిట్ చేసేందుకు వచ్చిన ముజీబ్‌పై తన్సిఫ్ అలీ, ముహమూద్‌సహద్ ఎటాక్ చేశారు. వీరిలో ఒకరు ముజీబ్‌పై పెప్పర్ స్ప్రే కొట్టగా మరొకరు బ్యాగులోని దాదాపు రూ. 7 లక్షలతో బయటకు పరుగులు తీశారు. అప్పటికే ఎర్ర రంగు స్విఫ్ట్ కారులో తన్సీ బరిక్కల్, అబ్దుల్ ముహీస్ టీఎంలు బయట రెడీగా ఉన్నారు. రూ. 10 లక్షల క్యాష్‌లో వివిధ బ్యాంకులకు చెందిన ఏడు సీడీఎం మిషన్‌లలో రూ. 3 లక్షలు డిపాజిట్ చేశాడు. ఎక్కడెక్కడ చేస్తున్నాడు, ఎంత సమయం పడుతుంది, ఎలా వెళుతున్నాడు అనేది అంతా చూసుకున్నాకే ముజీబ్‌ని వెంబడిస్తూ హిమాయత్‌నగర్‌లో ఎటాక్ చేశారు.

నెక్లెస్ రోడ్డులో ఆటో పల్టీ

డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



ఖైరతాబాద్: వేగంగా వచ్చిన గూడ్స్ ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టిన సంఘటన లేక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... శనివారం సాయంత్రం పీపుల్స్ ప్లాజా వైపు నుంచి రాణీగంజ్ వైపు వెళ్తున్న గూడ్స్ ఆటో నెక్లెస్ రోడ్డులో లేక్ పోలీస్ స్టేషన్ వద్దకు రాగానే డ్రైవర్ బ్రేక్‌తో వాహనాన్ని అదుపు చేయబోయి ఎక్స్‌లేటర్‌ను తొక్కడంతో ఒక్కసారిగా ఆటో గూడ్స్ డివైడర్‌ను ఢీ కొని ఈట్ స్ట్రీట్ ముందు రోడ్డులోకి పల్టీ కొట్టింది. ఆ సమయంలో అటువైపుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. పోలీసులు పల్టీ కొట్టిన వాహనాన్ని క్రేన్ సాయంతో తొలగించారు.

టికెట్ తీసుకోమన్నందుకు బస్సు అద్దాలు ధ్వంసం

హిమాయత్‌నగర్: బస్సు టికెట్ తీసుకోమన్నందుకు కోపంతో రగిలిపోయిన ఓ మందు బాబు ఏకంగా బస్సు అద్దాలు ధ్వంసం చేసిన సంఘటన నారాయణగూడలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. చేతిలో ఉన్న సుత్తితో బస్సు అద్దాలు పగలకొట్టడమే కాక తోటి ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేశాడు. బస్సు డ్రైవర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన నారాయణగూడ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాచిగూడ డిపోకు చెందిన ఏపీ23జెడ్0062 అనే ఆర్టీసీ బస్సు అఫ్జల్‌గంజ్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళుతుంది. నారాయణగూడ ఐపీఎం వద్దకు రాగానే బస్సును ఆపిన ఓ కూలీ ఆ బస్సు లోపలికి ఎక్కాడు. అప్పటికే పీకల్లోతు మద్యం సేవించిన ఉన్న ఆ కూలీ వద్దకు కండక్టర్ వచ్చి టికెట్ అడిగాడు. ఆ సమయంలో టికెట్ తీసుకునేందుకు అతని వద్ద డబ్బు లేకపోవడంతో తోటి ప్రయాణికుల సాయం కోరాడు. ఈ క్రమంలో డ్రైవర్ యాదయ్య జోక్యం చేసుకుని నీకోసం బస్సు ఎంతసేపు ఆపాలి టికెట్ తీసుకుంటావా దింపేయాల అంటూ అరిచాడు. అయినపటికీ టికెట్ తీసుకోకపోవడంతో అతగాడిని బస్సు నుంచి దింపేశారు. దీంతో మద్యం మత్తులో ఉన్న అతగాడు తీవ్ర ఆగ్రహానికి లోనై తన చేతిలో ఉన్న సుత్తితో బస్సు ముందు భాగంలోని రెండు అద్దాలను ధ్వంసం చేశాడు. టికెట్‌కు డబ్బులు ఇవ్వని కారణంగా తోటి ప్రయాణికులను సైతం దుర్భాషలాడాడు. దీనిపై డ్రైవర్ యాదయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ శిరీష కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఫేస్‌బుక్‌లో యువతి పరిచయం: రూ. 10 లక్షల మోసం

తిరిగి ఇమ్మన్నందుకు బెదిరింపులు

వెంగళరావునగర్: ఫేస్‌బుక్‌లో పరిచయమైన యువతి ఓ వ్యక్తి నుంచి రూ. 10 లక్షలు తీసుకుని మోసం చేసిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఎల్లారెడ్డిగూడ ప్రాంతానికి చెందిన కిశోర్‌కు ఫేస్‌బుక్‌లో అశ్రుతారెడ్డి అనే యువతి ఫేస్‌బుక్‌లో పరిచయం అయింది. ఆమె తన ఫొటోకు బదులు గుర్తుతెలియని అందమైన యువతి ఫొటో పెట్టి తాను చార్టెట్ అకౌంటెంట్ అంటూ అతనికి తెలియజేసింది. వారిద్దరు గత కొన్ని నెలలుగా ఛాటింగ్ చేసుకునే వారు. వారి పరిచయం స్నేహంగా మారింది. అతని వద్ద నుంచి నగదు కాజేయాలని ప్లాన్ వేసింది. ఇదే అదనుగా చేసుకుని ఆమె ఇటీవల తన తల్లికి ఆరోగ్యం బాగోలేదని చెప్పింది. ఇందుకు ఫేక్ ఆస్పత్రి బిల్లులు తయారు చేసి అతనికి పంపింది. అర్జంటుగా నగదు కావాలని కోరింది. తన సోదరుడు జిక్కి క్రాంతిని పంపుతానని అతనికి డబ్బులు ఇవ్వాలన ప్రాధేయపడింది. దాంతో కిశోర్ కొంత నగదును అతనికి ఇచ్చి పంపాడు. మరోసారి ఇంకో కారణం చూపుతూ అకౌంట్‌లో నగదు వేయాలని కోరింది. ఈ విధంగా దాదాపు రూ. 10 లక్షల వరకు కాజేసింది. ఇటీవల ఆమెను తన డబ్బులు తిరిగి ఇచ్చేయాలని కిశోర్ అడగటంతో అసలు విషయం బయటపడింది. డబ్బుల కోసం తరచూ అడుగుతుండటంతో అశ్రుతారెడ్డి తన వద్ద లేవని చెప్పింది. ఇరువురు చాట్ చేసుకున్న మెసేజ్‌లను తల్లిదండ్రులకు చూపుతానని, మరోసారి డబ్బులు అడిగితే ఆత్మహత్య చేసుకుని నిన్ను ఇరికిస్తానని బెదిరిస్తూ వచ్చింది. గుండాలతో చెప్పి కొట్టిస్తానని కిశోర్‌ను హెచ్చరించింది. ఆందోళన చెందిన బాధితుడు శనివారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్లుప్తంగా...

మరో 23మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు

సాక్షి, హైదరాబాద్‌: కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ఆదేశాల నేపథ్యంలో వరుసగా రెండో రోజూ పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేశారు. 23 మందిని బదిలీ చేసి అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలుగా పోస్టింగులివ్వగా, మరో 9 మందిని ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌ మిత్తల్‌ శనివారం ఆదేశాలు జారీ చేశారు.

43 మంది డీఎస్పీలకు స్థానచలనం

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రవ్యాప్తంగా 43 మంది డీఎస్పీల(సివిల్‌)ను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం డీజీపీ అంజనీకుమార్‌ ఉత్తర్వులు జారీ చేశారు.

22 మంది మునిసిపల్ కమిషనర్ల బదిలీ

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలోని వివిధ పురపాలక సంస్థల్లో పనిచేస్తున్న 22 మంది మునిసిపల్‌ కమిషనర్లను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ కార్యదర్శి సి.సుదర్శన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచి పాత పింఛన్ సాధన రథయాత్ర: స్థితప్రజ్ఞ

సాక్షి, హైదరాబాద్‌: కంట్రిబ్యూటరీ పింఛన్‌ విధానాన్ని రద్దు చేసి రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పింఛన్‌ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో ఆదివారం నుంచి పాత పింఛన్‌ సాధన సంకల్ప రథ యాత్ర నిర్వహించనున్నట్టు తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీం ఎంప్లాయీస్‌ యూనియన్‌ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఈ యాత్ర సాగుతుందని, ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌ క్షేత్రం నుంచి ప్రారంభమై ఈనెల 31న యాదాద్రి నరసింహుని సన్నిధిలో ముగుస్తుందని శనివారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. సీపీఎస్‌ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సామాజిక భద్రతను కల్పించే పాత పింఛన్‌ ఆవశ్యకతను తెలియజెప్పడంతో పాటు పాత పింఛన్‌ అమలు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ యాత్ర చేపడుతున్నామని తెలిపారు. తమ డిమాండ్‌కు ఇప్పటికే టీజీవో, టీఎన్జీవో సహా పలు సంఘాలు మద్దతిచ్చాయని, పాత పింఛన్‌ పొందుతున్న ఉద్యోగులు కూడా ఈ యాత్రకు మద్దతివ్వాలని కోరారు. కంట్రిబ్యూటరీ పింఛన్‌ విధానం రద్దుతో రాష్ట్రంలోని 1.72 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలకు సామాజిక భద్రత చేకూరుతుందన్నారు.

బాత్రూమ్‌లో బీ కేర్‌ఫుల్

ఇళ్లలో రెండో అత్యంత ప్రమాదకర ప్రదేశం

- అనేక మంది ప్రముఖులు బాత్రూమ్ ప్రమాదాల్లోనే మృతి
- ప్రమాదాల బారిన పడుతున్న వారిలో 60 ఏళ్లు దాటిన వారే ఎక్కువ



సాక్షి, అమరావతి: ప్రపంచవ్యాప్తంగా ఏటా 15 ఏళ్లు పైబడిన వారిలో 2.35 లక్షల మంది బాత్రూమ్‌లో గాయపడుతున్నారని సెంటర్స్‌ ఫర్‌ డిసీజ్‌ కంట్రోల్‌ అండ్‌ ప్రివెన్షన్‌ నివేదిక చెబుతోంది. ఇంట్లో అతి చిన్న గదే అయినప్పటికీ.. వంటగది తరువాత బాత్రూమ్‌ అత్యంత ప్రమాదకరమైన ప్రదేశం. బాత్రూమ్‌లో సంభవించే ప్రమాదాల కారణంగా ఒక్క యునైటెడ్‌ స్టేట్స్‌ ఆఫ్‌ అమెరికాలోనే నిత్యం 347 మంది మరణిస్తున్నారు. మన దేశంలో ఎముకల చికిత్స కోసం వెళుతున్న వారిలో దాదాపు 35నుంచి 45 శాతం మంది బాత్రూమ్‌లో జారిపడి గాయాల పాలైనవారే. ప్రముఖ సినీ నటి శ్రీదేవి దగ్గర్నుంచి తాజాగా చైతన్య విద్యాసంస్థల అధినేత బీఎస్‌ రావు వరకూ అనేక మంది ప్రముఖుల మరణాలు బాత్రూమ్‌లోనే సంభవించాయి.

ఈ జాగ్రత్తలు పాటించాలి

వదులుగా ఉన్న టాయిలెట్‌ బౌల్‌ రిమ్‌పై కూర్చోవడం వల్ల అది అటూ ఇటూ కదిలి శరీరానికి గాయం చేయవచ్చు. ప్లాస్టిక్‌ సీట్లు పగిలిపోవడం, వ్యక్తి బరువు వల్ల కూలిపోవడం కూడా గాయాలు కలిగించవచ్చు. టాయిలెట్లలో సిగరెట్లు వంటివి పడేయడం వల్ల అవి పేలిపోయే ప్రమాదం కూడా ఉంది. కోసుకుపోవటం, ఎముకలు విరగటం, వెన్నెముకకి గాయాలు, ఫ్రాక్చర్లు, వంటివి మామూలే. సాధారణంగా బాత్రూమ్‌ ప్రమాదాలు మనం టబ్‌లోంచి బయటకు వస్తున్నప్పుడో, టాయిలెట్‌ సీటుపై కూర్చున్నప్పుడో, తువ్వాలు తీసుకుంటున్నప్పుడో లేదా జారుడు నేలపై నడిచినప్పుడో జరుగుతాయి. ఇలాంటివి ఆపాలంటే బాత్రూమ్‌ వాడుతున్నప్పుడు లైట్లు, డోర్‌ మ్యాట్లు వేయాలి. బాత్రూమ్‌ నేలను పొడిగా ఉండేలా చూసుకోవడంతో పాటు, పట్టుకోడానికి హ్యాండిల్స్‌ పెట్టించాలి. పాశ్చాత్య టాయిలెట్‌లో కూర్చుని లేచే సమయంలో హేండిల్‌ పట్టుకుని లేవాలి. బాత్రూమ్‌కి వెళ్లినప్పుడు లోపల గట్టిగా గడియపెట్టుకోవకపోవడం వృద్ధులకు మంచిది. షవర్‌ కింద స్నానం చేసే సమయంలో స్టూల్‌ వాడాలి. చల్లని నీటితో స్నానం చేసినప్పుడు ముందుగా తలపై కాకుండా పాదాలపై నీటిని పోసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

చరిత్రలో కొన్ని దుర్ఘటనలు

- చైనాలోని జిన్‌ రాష్ట్ర పాలకుడు క్రీస్తు పూర్వం 581లో టాయిలెట్‌ పిట్‌లో పడి మరణించాడు.
- చరిత్రలో మర్చిపోలేని దుర్ఘటన ఒకటి 1184న జూలై 26న సంభవించింది. 'ఎర్ఫర్ట్‌ లెట్రిన్‌ విపత్తు'గా పిలిచే ఈ ప్రమాదం రోమన్‌ చక్రవర్తి హెన్రీ అనధికార సమావేశం నిర్వహిస్తుండగా.. దానికి హాజరైన వారి బరువు కారణంగా చెక్క భవనం రెండవ అంతస్తు నేల కూలిపోయింది. కొంతమంది గ్రౌండ్‌ ఫ్లోర్‌ కింద ఉన్న సెప్టిక్‌ ట్యాంక్‌లో పడి మునిగిపోవడంతో 60 మంది మరణించారు.
- 1760లో గ్రేట్‌ బ్రిటన్‌కు చెందిన కింగ్‌ జార్జ్‌ అక్టోబర్‌ 25న టాయిలెట్‌లో మరణించాడు.
- 1945లో జర్మన్‌ జలాంతర్గామి ఒక టాయిలెట్‌ ప్రమాదంలో మునిగిపోయింది.
- 1983 జూన్‌ 2న ఎయిర్‌ కెనడా విమానం -797 వెనుక లావెటరీలో మంటలు చెలరేగి విమానం మొత్తం కాలిపోయింది. ప్రమాదంలో 23 మంది మరణించారు.
- బ్రిటిష్‌ వ్యాపారవేత్త, కన్జర్వేటివ్‌ పార్టీ నాయకుడు క్రిస్టోఫర్‌ షేల్‌ జూన్‌ 26, 2011న గ్లాస్టన్‌బరీ ఫెస్టివల్‌లో పోర్టబుల్‌ టాయిలెట్‌లో గుండెపోటుతో చనిపోయాడు.
- టాయ్‌లెట్ల ఫిట్టింగ్‌లు సరిగ్గా లేకపోవడం వల్ల ఏటా దాదాపు 10 వేల ఓడలు ప్రపంచవ్యాప్తంగా మునిగిపోతున్నాయి.

అప్రమత్తంగా ఉండండి



'బాత్రూమ్‌' మరణాల్లో ఎక్కువ శాతం హార్ట్‌ అటాక్‌ వల్లే సంభవిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం చల్లని నీటితో తలస్నానం చేసినప్పుడు.. ఆ నీటిని తలపై పోసుకుంటే శరీరంలో ఆ భాగం చల్లగా మారుతుంది. దీంతో రక్తనాళాలు వెంటనే అలర్ట్‌ అయ్యి రక్తాన్ని ఒక్కసారిగా పైకి పంపిస్తాయి. దీనివల్ల తల భాగం వైపు రక్త సరఫరాలో ఆటంకం ఏర్పడుతుంది. ఫలితంగా ఒక్కసారిగా బ్లడ్‌ ప్రెషర్‌ పెరిగి హార్ట్‌ అటాక్‌ వస్తుంది. కొన్నిసార్లు పక్షవాతం కూడా రావచ్చు. జారి పడిపోయినప్పుడు తల నరాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. వెన్నుపూస కూడా విరగవచ్చు. కాబట్టి అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్‌ సుధాకర్‌ కనపర్తి, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు, విజయవాడ

వృద్ధుల ప్రాణాలు తీస్తున్నాయ్



ఇంట్లో 65 ఏళ్లు పైబడిన పెద్దవారు ఉంటే.. బాత్రూమ్‌ ప్రమాదాల గురించి కచ్చితంగా తెలుసుకోవాలి. ప్రతి నలుగురిలో ముగ్గురు వృద్ధులు ఏడాదికి ఒకసారైనా బాత్రూమ్‌లో జారిపడే అవకాశం ఉంది. ఈ ప్రమాదాల్లో 65 శాతం చిన్న గాయాలతో సరిపెట్టినా.. మిగతా 35 శాతం మాత్రం ప్రాణాలు తీస్తున్నాయి. మన దేశంలో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం.. దేశంలో 42 శాతం మంది టాయిలెట్లలో 7 నుంచి 10 సార్లు ప్రమాదాలకు గురవుతున్నారు. 58 శాతం మంది 11 నుంచి 15 సార్లు పడిపోతున్నారు. సరైన తలుపులు లేకపోవడం ప్రమాదానికి వంద శాతం కారణమవుతుండగా, జారే ఫ్లోర్‌ 91.9 శాతం, బాత్రూమ్‌ పరిమాణం 80.3 శాతం, ఎత్తైన తలుపు థ్రెషోల్డ్‌ 53.5 శాతం, నాన్‌-స్కిడ్‌ మ్యాట్‌ లేకపోవడం 99.5 శాతం, గ్రాబ్‌ బార్‌లు లేకపోవడం 97 శాతం, ఎగ్జాస్ట్‌ ఫ్యాన్‌ లేకపోవడం 96.6 శాతం, బాత్రూమ్‌లో వెలుతురు సరిపోకపోవడం వల్ల 94.4 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయి. వేడి నీటి వినియోగం 89.9 శాతం, సీట్‌ ఉపరితలం 55.6 శాతం, ప్రవేశ ద్వారం వద్ద లైట్‌ స్విచ్‌ లేకపోవడం 53 శాతం, చిందరవందరగా ఉన్న మార్గం వంటివి 39.4 శాతంకారణమవుతున్నాయి. ఎన్‌సీబీఐ మార్కెటింగ్‌ ఏజెన్సీ నివేదిక ప్రకారం.. 11 శాతం హార్ట్‌ అటాక్‌లు బాత్రూమ్‌లోనే వస్తున్నాయి. మలవిసర్జనకు వెళ్లినప్పుడు లేదా స్నానం చేస్తున్న సమయంలో ఇవి సంభవిస్తున్నాయి.

ఆస్ట్రేలియాకు మేడిన్ ఏపీ ఈ–స్కూటర్లు

- కాన్‌బెర్రాకు ఎగుమతి చేయనున్న అవెరా సంస్థ
- పైలట్ ప్రాజెక్టు కింద తొలుత 100 ఈ–స్కూటర్ల ఎగుమతి



సాక్షి, అమరావతి: ఆస్ట్రేలియా రోడ్లపై మేడిన్‌ ఆంధ్రప్రదేశ్‌ ఎలక్ట్రిక్‌ స్కూటర్లు దూసుకుపోనున్నాయి. ఎన్టీఆర్‌ జిల్లా నున్న సమీపంలోని విద్యుత్‌ వాహనాల తయారీ సంస్థ 'అవేరా'తమ వ్యాపార విస్తరణలో భాగంగా ఆస్ట్రేలియాలో అడుగుపెడుతోంది. కాన్‌బెర్రా రాష్ట్రానికి పైలట్‌ ప్రాజెక్టు కింద 100 ఎలక్ట్రిక్‌ స్కూటర్లను అవేరా సంస్థ ఎగుమతి చేయబోతోంది. ఈ విషయాన్ని అవేరా వ్యవస్థాపక సీఈవో డాక్టర్‌ వెంకటరమణ 'సాక్షి'కి తెలిపారు. ఇటీవల ప్రధాని మోదీ ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా.. ఎలక్ట్రిక్‌ వాహనాల వినియోగంపై చర్చలు జరిగాయని చెప్పారు. ఆస్ట్రేలియాకు ఎగుమతి చేసే ఎలక్ట్రిక్‌ స్కూటర్లపై సుంకాలు, పన్నులు విధించకుండా భారత్‌ ప్రభుత్వం త్వరలో ఒప్పందం కుదుర్చుకుంటుందన్నారు. ఆస్ట్రేలియాలో ఈ-స్కూటర్లను ప్రోత్సహించడానికి కాన్‌బెర్రా సీఎం ఆండ్రూ ముందుకు వచ్చారని తెలిపారు. తొలుత విశ్వవిద్యాలయ విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగుల కోసం అవేరాకు చెందిన 100 విన్సిరో ఈ-స్కూటర్లను సరఫరా చేయాలని ఆయన కోరినట్లు వివరించారు. కాన్‌బెర్రా సీఎం ఆండ్రూ భారత్‌ పర్యటనలో భాగంగా వచ్చే ఏడాది ఏపీకి వస్తారని, ఆ సమయంలో దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకుంటామని చెప్పారు.

బోరుబావి నుంచి అగ్నికీలలు

మధ్యాహ్నానికి ఆగిపోయిన గ్యాస్.. మంటలు

రాజోలు: ఆక్వా చెరువుకు నీటి కోసం ఏర్పాటు చేసుకున్న 280 అడుగుల లోతు బోరుబావి నుంచి గ్యాస్‌ భూ ఉపరితలం పైకి వచ్చి అగ్నికీలలు ఎగసిపడ్డాయి. డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోటి గ్రామంలోని మట్టపర్రు రోడ్డులో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. మట్టపర్రు రోడ్డులో ఆక్వా చెరువులకు నీటి కోసం రైతులు నాలుగేళ్ల కిందట బోరుబావి తవ్వారు. శ్రీనివాస్‌ అనే రైతు ఈ బోరుబావి నుంచి తన చెరువులోకి నీటిని తోడుతున్నాడు. బోరుబావి నుంచి శనివారం తెల్లవారుజామున ఒక్కసారిగా గ్యాస్‌ పైకి రావడంతోపాటు మంటలు ఉధృతంగా ఎగసిపడ్డాయి. ఆక్వా రైతులు ఓఎన్‌జీసీ, రెవెన్యూ అధికారులకు తెలిపారు. ఓఎన్‌జీసీ, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని బోరు బావి నుంచి గ్యాస్‌ వస్తుందని, బావి అడుగున ఉన్న విద్యుత్‌ మోటారులో సాంకేతిక లోపంతో నిప్పురవ్వలు చెలరేగి మంటలు ఎగసిపడుతున్నాయని నిర్ధారించారు.



బోరుబావి నుంచి ఎగసిపడుతున్న అగ్నికీలలు

మధ్యాహ్నానికి గ్యాస్‌ పైకి రావడం ఆగిపోయింది. దీంతో మంటలు కూడా ఆగిపోయాయి. అనంతరం వెంటనే ఓఎన్‌జీసీ, రాజోలు అగ్నిమాపక సిబ్బంది కలసి ఇసుక, నీటితో బోరుబావిని పూర్తిగా పూడ్చివేశారు. ఓఎన్‌జీసీ, గెయిల్‌ సంస్థలకు చెందిన పైప్‌లైన్లు ఆ ప్రాంతంలో లేవని, అయినప్పటికీ ఈ బోరుబావి నుంచి గ్యాస్‌ ఎలా వచ్చిందనే విషయాన్ని పరిశీలిస్తామని ఓఎన్‌జీసీ అధికారులు తెలిపారు.

'చైతన్య' బీఎస్ రావుకు కన్నీటి వీడ్కోలు

పెనమలూరు: శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్‌ డాక్టర్‌ బీఎస్‌ రావుకు శనివారం కన్నీటి వీడ్కోలు పలికారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం తాడిగడప శ్రీచైతన్య క్యాంపస్‌ నుంచి ప్రత్యేక వాహనంలో ఆయన భౌతికకాయాన్ని బందరు రోడ్డు మీదుగా గోసాల క్యాంపస్‌ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అంతిమ మజిలీలో కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు, శ్రీచైతన్య విద్యాసంస్థల సిబ్బంది, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బీఎస్‌ రావుకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. గోసాల వ్యవసాయ క్షేత్రంలో బీఎస్‌రావు భౌతిక కాయానికి అంత్యక్రియలు పూర్తి చేశారు.



బీఎస్ రావు అంతిమయాత్ర దృశ్యం

నగర వార్తలు

'బండ్లమైలారం బద్రీనాథ్' ఆలయానికి సిటీ బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్‌ సమీపంలోని బండ్ల మైలారం గ్రామంలో కొత్తగా నిర్మించిన బద్రీనాథ్‌ పుణ్యక్షేత్రానికి సిటీబస్సులను ప్రవేశపెట్టారు. శనివారం సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌ నుంచి మొట్టమొదటిసారి ఈ బస్సులు బయలుదేరినట్లు రాణిగంజ్‌ డిపోమేనేజర్‌ లక్ష్మీధర్మ తెలిపారు. ఈ బస్సులు ప్రతి శని, ఆదివారాలు సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌ (గురుద్వారా ఎదురుగా) నుంచి బద్రీనాథ్‌ టెంపుల్‌కు బయలుదేరుతాయి. ఉదయం 06:30 గంటలకు, 07:30 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు, 4గంటలకు, ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి. అలాగే బద్రీనాథ్‌ టెంపుల్‌ నుంచి సికింద్రాబాద్‌కు ఉదయం 08:15, 09:15, మధ్యాహ్నం 4.45, సాయంత్రం 5.45 గంటలకు బస్సులు అందుబాటులో ఉంటాయి. టిక్కెట్‌ చార్జీ రూ.40 ఉంటుంది. ఉత్తర భారత దేశంలోని బద్రీనాథ్‌ పుణ్యక్షేత్రంను పోలినవిధంగా ఈ ఆలయాన్ని బండ్ల మైలారంలో నిర్మించారు. కనీసం 45 మంది ప్రయాణికులు కలిసి వెళ్లాలనుకొంటే బస్సును నేరుగా ప్రయాణికుల వద్దకు పంపుతామని డీఎం తెలిపారు. పూర్తి వివరాల కోసం ఫోన్‌: 9866820135 నెంబర్‌లో సంప్రదించవచ్చు.

హజ్ యాత్రికులకు ఘనస్వాగతం

సాక్షి, సిటీబ్యూరో: ఈ ఏడాది హజ్‌ ఆరాధనలు పూర్తి చేసుకొని నగరానికి చెరుకున్న మొదటి బ్యాచ్‌ యాత్రికులను హోంమంత్రి మహమూద్‌ అలీ శనివారం ఉదయం శంషాబాద్‌ ఎయిర్‌పోర్టులో స్వాగతం ఘనస్వాగతం పలికారు. జూన్‌ 7వ తేదీ వెళ్లిన 150 మంది యాత్రికుల బృందం నగరానికి చేరుందని రాష్ట్ర హజ్‌ కమిటీ చైర్మన్‌ మహ్మద్‌ సలీం తెలిపారు. విలేకరులకు విరాలు తెలియజేస్తూ...తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌, కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వెళ్లిన దాదాపు 8 వేల మంది యాత్రికులు రాష్ట్ర హజ్‌ కమిటీ ఆధ్వర్యంలో హజ్‌ ఆరాధనలకు జూన్‌ 7వ తేదీ నుంచి 22 తేదీ వరకు 45 విమనాల్లో సౌదీ ఆరేబియాలోని జిద్దా నగరానికి వెళ్లినట్లు తెలిపారు. మొదటి రోజు శనివారం సౌదీ అరేబియా మదీనా నగరనం నుంచి దాదాపు 150 మంది వచ్చారని తెలిపారు.

ఈ నెల 23 వరకు పలు రైళ్లు రద్దు

సాక్షి, సిటీబ్యూరో: ట్రాక్‌ నిర్వహణ పనుల దష్ట్యా ఈ నెల 17 నుంచి 23వ తేదీ వరకు వివిధ మార్గాల్లో నడిచే 24 రైళ్లను, మరో 22 ఎంఎంటీఎస్‌ సర్వీసులను రద్దు చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ సీహెచ్‌ రాకేశ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్‌, కాచిగూడ, నాంపల్లి స్టేషన్ల నుంచి రాకపోకలు సాగించే సికింద్రాబాద్‌-వికారాబాద్‌, కాచిగూడ-నిజామాబాద్‌, హైదరాబాద్‌-వరంగల్‌ రైళ్లతో పాటు మరికొన్ని రైళ్లు రద్దు కానున్నాయి. అలాగే లింగంపల్లి-ఉందానగర్‌, నాంపల్లి-లింగంపల్లి, ఫలక్‌నుమా-లింగంపల్లి తదితర మార్గాల్లో నడిచే రైళ్లు రద్దు కానున్నాయి.

స్కిల్ లేకుంటే ప్రయోజనం నిల్

- చదువుతోపాటు నైపుణ్యం ఎంతో ముఖ్యం
- నేను ఏ బిజినెస్ చేసినా స్కిల్‌తోనే చేశా: మంత్రి మల్లారెడ్డి
- నైపుణ్యం ఉంటేనే గౌరవప్రదమైన జీవితం: మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో వరల్డ్ యూత్ స్కిల్ డే



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు

గచ్చిబౌలి: ఎంటెక్‌, పీహెచ్‌డీ లాంటి ఎంత పెద్ద డిగ్రీ ఉన్నా స్కిల్‌ లేకుంటే ప్రయోజనం నిల్‌ అని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. గచ్చిబౌలిలోని ఇండోర్‌ స్టేడియంలో టాస్క్‌ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన 'వరల్డ్‌ యూత్‌ స్కిల్‌ డే'లో ఆయన ముఖ్యతిథిగా పాల్గొని మాట్లాడారు. 90 శాతం మార్కులు ముఖ్యం కాదని.. స్కిల్‌ ఉంటే సరిపోతుందన్నారు. 'మా జమాన అంతా కష్టపడే జమానా, మీ జమానా అంతా టెక్నాలజీ జమానా' అని ఆయన అన్నారు. తాను పాలు, పూల మ్మినా, స్కూల్స్‌ పెట్టినా తెలివితోనే చేశానన్నారు. 1987లో గేదెలమ్మే వారు స్కూల్‌ పెట్టారని తమను విమర్శించారని, అడ్మిషన్లు కూడా రాలేదన్నారు. ఆ తర్వాత స్కిల్‌ ఉన్న ప్రిన్సిపాల్‌ను నియమించి విద్యా రంగంలో తాను సక్సెస్‌ అయ్యానన్నారు. వేలాది మంది ఇంజినీర్లు, డాక్టర్లు, మేధావులను తయారు చేసినా...ఇప్పటికీ తనకు బీటెక్‌, ఎంబీబీఎస్‌ అంటే ఫుల్‌ఫాం తెలియదన్నారు. ఎక్సైజ్‌, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌ గౌడ్‌ మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు డిగ్రీలు, పీజీలు చదివి దుబాయ్‌, ముంబై, పూణెలకు వలస వెళ్లే వారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. తెలంగాణలో టాస్క్‌ (తెలంగాణ అకాడమీ ఫర్‌ స్కిల్‌ అండ్‌ నాలెడ్జ్‌) ఏర్పాటు తర్వాత సాధారణ వ్యక్తులు కూడా స్కిల్‌డెవలప్‌మెంట్‌ చేసుకుని బీటెక్‌, ఎంటెక్‌ చేసిన వారితో సమానంగా గౌరవంగా బతుకుతున్నారని తెలిపారు. భారత్‌ క్రికెట్‌ జట్టు మాజీ కెప్టెన్‌, మోటివేషనల్‌ స్పీకర్‌ కృష్ణమాచారి శ్రీకాంత్‌ మాట్లాడుతూ వ్యక్తిగతంగా ప్రతిభ కనబరుస్తూనే టీమ్‌వర్క్‌ చేస్తే సక్సెస్‌ను సాధించవచ్చాన్నారు. యశస్వీ జైస్వాల్‌ ఒకే ఓవర్‌లో 26 పరుగులు చేశారని, ధోనీ టీమ్‌ వర్క్‌తో యువతకు స్ఫూర్తిగా నిలుస్తాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రిటీష్‌ డిప్యూటీ హై కమిషనర్‌ గారెత్‌ విన్‌ ఓవెన్స్‌, ఎంపీ రంజిత్‌ రెడ్డి, కార్మిక, ఉపాధి శిక్షణస్పెషల్‌ చీఫ్‌ సెక్రటరీ రాణి కుముదిని, పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ ప్రిన్సిపల్‌ సెక్రెటరీ జయేష్‌ రంజన్‌, విద్యాశాఖ కార్యదర్శి కరుణ, టాస్క్‌ సీఈఓ శ్రీకాంత్‌, న్యాక్‌ డైరెక్టర్‌ భిక్షపతి, నిథమ్‌ డైరెక్టర్‌ చిన్నం రెడ్డి, సీఐఐ ఐజీబీసీ హైదరాబాద్‌ చాప్టర్‌ ప్రెసిడెంట్‌ శేఖర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశంలోని సీసీ కెమెరాల్లో 62 శాతం హైదరాబాద్‌లోనే..

నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్



కేబీఆర్ పార్కు వద్ద సీసీ కెమెరాల వ్యవస్థను ప్రారంభించి పరిశీలిస్తున్న సీపీ సీవీ ఆనంద్

బంజారాహిల్స్‌: దేశంలోని సీసీ కెమెరాల్లో 62 శాతం కెమెరాలు హైదరాబాద్‌ నగరంలో ఏర్పాటయ్యాయని నగర పోలీస్‌ కమిషనర్‌ సీవీ ఆనంద్‌ వెల్లడించారు. శనివారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్‌ పార్కు చుట్టూ జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో రూ.80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 152 సీసీ కెమెరాలను, జూబ్లీహిల్స్‌ రోడ్‌ నెం.1, 10, 45, 36లలో రూ.60 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 112 సీసీ కెమెరాల వ్యవస్థను ఆయన వెస్ట్‌జోన్‌ డీసీపీ జోయల్‌ డేవిస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్‌ మాట్లాడుతూ..ఇటీవల తాను నేరస్తులను పట్టుకున్న సందర్భాల్లో సీసీ కెమెరాలు బాగా దోహదపడ్డాయని, నిమిషాల వ్యవధిలోనే నేరస్తులను పట్టుకోవడం జరిగిందన్నారు. 2014-15లో పెద్ద ఎత్తున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా అందులో 50 శాతం కెమెరాలు పాడైపోయాయని, వాటి మరమ్మతులు జరగలేదని, వీటి నిర్వహణ కోసమే కెమెరా మెయింటెనెన్స్‌ ఆర్గనైజేషన్‌ (క్యామో)ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. పబ్లిక్‌ సేఫ్టీ యాక్ట్‌ ద్వారా ప్రతి ఒక్కరు తమ షాపుల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తాము ఇచ్చిన పిలుపుమేరకు చాలా మంది స్పందించారన్నారు. కేబీఆర్‌ పార్కులో ఏ సంఘటన జరిగినా అది జాతీయ స్థాయి న్యూస్‌గా మారుతున్నదని ఈ నేపథ్యంలోనే పాడైపోయిన కెమెరాలన్నింటిని తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశామని వీటి నిర్వహణ బాధ్యతలను కూడా ప్రణాళికా బద్ధంగా నిర్వహించబోతున్నామన్నారు. బంజారాహిల్స్‌లో నిర్మించిన ఇంటిగ్రేటెడ్‌ కమాండ్‌ కంట్రోల్‌ సెంటర్‌ ప్రపంచంలో మరే ఇతర నగరంలో కూడా లేదని హైదరాబాద్‌లోనే మొదటిసారిగా నిర్మించడం జరిగిందన్నారు. బ్రిటిష్‌, అమెరికా హైదరాబాద్‌ హై కమిషనర్లు ఈ వ్యవస్థను అభినందించారని గుర్తుచేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన దాతలను ఆయన అభినందించడమే కాకుండా ఇటీవల పలు దొంగతనం కేసుల్లో నిందితులను గుర్తించడానికి అవి ఏ విధంగా దోహదపడ్డాయో వివరించారు. కార్యక్రమంలో బంజారాహిల్స్‌ ఏసీపీలు శ్రీధర్‌, రాజశేఖర్‌రెడ్డి, బంజారాహిల్స్‌ ఇన్‌స్పెక్టర్‌ నరేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

టీహబ్ తెలంగాణ కిరీటంలో ఒక ఆభరణం

ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్

హఫీజ్‌పేట్‌ : నాల్గవ నిజాం పాలనలో హైదరాబాద్‌కు వలస వచ్చిన మొదటి స్థానికేతర సమాజం జైనులని రాష్ట్ర ఐటీ ముఖ్య కార్యదర్శి జయేష్‌ రంజన్‌ పేర్కొన్నారు. జేఐటీఓ ఇంక్యుబేషన్‌ ఇన్నోవేషన్‌ ఫౌండేషన్‌ (జేఐఐఎఫ్‌), జైన్‌ ఇంటర్నేషనల్‌ ట్రేడ్‌ ఆర్గనైజేషన్‌ల ఆధ్వర్యంలో ప్రపంచ నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా శనివారం హైదరాబాద్‌ నాలెడ్జ్‌ సిటీలోని టీహబ్‌లో 'జేఐఐఎఫ్‌ ఇన్వెస్టర్‌ 6వ కాన్‌క్లేవ్‌' నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన జయేష్‌రంజన్‌ మాట్లాడుతూ నిజాంల కాలం నుంచి జైనులు ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడ్డారన్నారు. టీ హబ్‌ తెలంగాణ కిరీటంలో ఒక ఆభరణమని, దీనిలో జైనులు భాగస్వాములై అభివృద్ధికి పాటుపడాలన్నారు. టీ హబ్‌ సీఈఓ మహంకాళి శ్రీనివాస్‌ రావు మాట్లాడుతూ టీ హబ్‌లో ప్రస్తుతం 300 స్టార్టప్‌లున్నాయని చెప్పారు. అనంతరం టీ హబ్‌, జేఐఐఎఫ్‌ మధ్య సహకారం కోసం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జేఐఐఎఫ్‌ చైర్మన్‌ రజత్‌ మెహతా, రాజేష్‌ జైన్‌, అభయ శ్రీశ్రీమల్‌, సుశీల్‌ సంచేటి, ఎం.శ్రీనివాస్‌ రావు, తదితరులు పాల్గొన్నారు.



జేఐఐఎఫ్ కాన్‌క్లేవ్‌ను ప్రారంభిస్తున్న జయేష్‌రంజన్

ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ సేవలు నిలిచిపోతాయంటూ...

హిమాయత్‌నగర్‌: 'హలో యూజర్‌.. మీ ఫేస్‌బుక్‌/ఇన్‌స్టాగ్రామ్‌ ఖాతా రద్దు చేయబడుతుంది. ప్రస్తుతం మీరు వాడుతున్న ఖాతా మీది కాదంటూ.. సదరు ఖాతాదారుడి ద్వారా మాకు ఫిర్యాదు అందింది. అందుకు సంబంధించిన కాపీ రైట్స్‌ను సైతం పరిశీలించాం. కాబట్టి వచ్చే 48 గంటల్లో మీ ఖాతా అధికారికంగా మేం రద్దు చేయబోతున్నాం. ఒకవేళ మీరు దీనిని ఎర్రర్‌గా భావిస్తే కింద ఇచ్చిన లింకును క్లిక్‌ చేయండి' అంటూ సైబర్‌నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఇన్‌స్టాగామ్‌, ఫేస్‌బుక్‌ అకౌంట్స్‌కి వస్తున్న ఇలాంటి మెసేజ్‌లు ఫేక్‌ అని సైబర్‌ క్రైం పోలీసులు నిర్ధారిస్తున్నారు. ఆ మెసేజ్‌లో ఇచ్చిన లింకును ఓపెన్‌ చేస్తే మీ అకౌంట్‌ను నిజంగా హ్యాక్‌ చేసే అవకాశం ఉందని, కాబట్టి ఇలాంటి మెసేజ్‌లపై నెటిజన్లు చాలా అప్రమత్తంగా ఉండాలంటూ సైబర్‌ క్రైం డీసీపీ స్నేహా మెహ్రా పేర్కొన్నారు. ఈమేరకు ఆమె తన వాట్సాప్‌ స్టేటస్‌ ద్వారా దీనిపై అవగాహన కల్పిస్తున్నారు.



నెటిజన్లకు వస్తున్న మెసేజ్ ఇదే...

క్రిస్టల్ క్రాప్ నుంచి రెండు ఉత్పాదనలు



సాక్షి, సిటీబ్యూరో: శామీర్‌పేట మండలం బొమ్మరాసిపేటలోని లియోనియా రిసార్ట్స్‌లో శనివారం వ్యవసాయ ఉత్పత్తుల్లో ప్రఖ్యాతిగాంచిన క్రిస్టల్‌ క్రాప్‌ ప్రొటెక్షన్‌ లిమిటెడ్‌ ఆధ్వర్యంలో రూపొందించిన రెండు రకాల నూతన ఉత్పాదనలు 'సికోసా, కొల్లార్‌'లను మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా క్రిస్టల్‌ క్రాప్‌ ప్రొటెక్షన్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ అంకుర్‌ అగర్వాల్‌, సీనియర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ సి.ఎస్‌.శుక్లా, అసోసియేట్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ సీనప్పు, జోనల్‌ బిజినెస్‌ హెడ్‌ వి.మురళీకృష్ణ, జోనల్‌ మార్కెటింగ్‌ మేనేజర్‌ కె.ప్రశాంత్‌ పాల్గొన్నారు. పంటల రక్షణ, విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ ఉత్పత్తుల అభివృద్ధికి క్రిస్టల్‌ సంస్థ విశేష కృషి చేస్తోందని, అందులో భాగంగానే కొత్త ఉత్పత్తులు రూపొందించినట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, రైతులు, క్రిస్టల్‌ క్రాప్‌ ప్రొటెక్షన్‌ సిబ్బంది పాల్గొన్నారు.

భార్యను నరికి చంపిన భర్త

- బోయిన్‌పల్లిలో ఘటన
- భార్యాభర్తల మధ్య గొడవలే కారణం..



ఝాన్సీరాణి (ఫైల్)



నిందితుడు సత్యనారాయణ

రసూల్‌పురా: కొబ్బరికాయలు కొట్టే కత్తితో భర్త..భార్యను నరికి పాశవికంగా హత్య చేసిన ఘటన బోయిన్‌పల్లి పీఎస్‌ పరిధిలోని నూతన్‌ కాలనీలో శనివారం చోటు చేసుకుంది. ఏసీపీ రవికుమార్‌ తెలిపిన వివరాల మేరకు ఏపీలోని అమలాపురానికి చెందిన సత్యనారాయణ (52), ఝాన్సీరాణి (32) భార్యాభర్తలు. వీరు పదేళ్ల క్రితం నగరానికి వచ్చి నివాసం ఉంటున్నారు. గత కొంతకాలంగా భార్యభర్తల మధ్య విభేదాలు రావడంతో ఝాన్సీరాణి వేరే ప్రాంతానికి వెళ్లిపోయింది. ఇటీవలే ఆమె తల్లి చనిపోవడంతో తిరిగి వచ్చింది. సత్యనారాయణకు ఉద్యోగం లేకపోవడంతో తెలిసిన వారి సహాయంతో పటాన్‌చెరులో వాచ్‌మెన్‌ ఉద్యోగంలో చేర్పించింది. ఈ క్రమంలో ఝాన్సీరాణి బోయిన్‌పల్లి నూతన్‌కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న ఆమె తమ్ముడు కిరణ్‌ ఇంటికి నాలుగు రోజుల క్రితం వచ్చింది. దీంతో శుక్రవారం సత్యనారాయణ కూడ బోయిన్‌పల్లికి వచ్చాడు. సాయంత్రం డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో కిరణ్‌ ఇంటికి వచ్చాడు. అక్కడే మరోసారి భార్యతో గొడవ పడ్డాడు. ఆవేశంగా తన బ్యాగులో దాచిఉంచిన కొబ్బరికాయలు కొట్టే కత్తి తీసి భార్యపై దాడి చేసి విచక్షణారహితంగా నరికాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఈక్రమంలో అడ్డు వచ్చిన బావమరిది భార్య షీలాపై కూడా దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని షీలాను ఆసుపత్రికి, ఝాన్సీరాణి మృతదేహాన్ని గాంధీకి తరలించారు. పోలీసుసు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సత్యనారాయణ పరారీలో ఉన్నాడు.

'మందు కాదు సార్.. పాలు తాగిన'

మేడ్చల్‌రూరల్‌: మేడ్చల్‌ ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని కండ్లకోయలో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ట్రాఫిక్‌ పోలీసులు డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ విచిత్ర సంఘటన చోటుచేసుకుంది. కారులో వచ్చిన ఓ వ్యక్తికి పోలీసులు బ్రీత్‌ అనలైజర్‌ పరీక్షలు నిర్వహించగా 94 రీడింగ్‌ పాయింట్లు నమోదయ్యాయి. దీంతో ఏం తాగావు అని పోలీసులు అడగగా తప్పించుకునేందుకు యత్నించిన ఆ వ్యక్తి 'పాలు తాగిన సార్‌.. అంతే' అంటూ సమాధానం ఇచ్చాడు. దీంతో అక్కడే ఉన్న ట్రాఫిక్‌ డీసీపీ, సిబ్బంది నవ్వు ఆపుకోలేక పగలబడి నవ్వారు. పట్టుబడ్డ వ్యక్తి అల్వాల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి కరుణాకర్‌గా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.



బార్బీ రేఖ

అమెరికా బొమ్మల కంపెనీ 'మ్యాటల్' 1959లో ఫ్యాషన్ డాల్ 'బార్బీ'ని లాంచ్ చేసింది. జర్మన్ అందాల బొమ్మ 'బిల్డ్'ను స్ఫూర్తిగా తీసుకొని సృష్టించిన 'బార్బీ' తరాలకు అతీతంగా చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరినీ ఆకట్టుకుంటూనే ఉంది. ఈ నెల 21న హాలీవుడ్ లైవ్-యాక్షన్ మూవీ 'బార్బీ' విడుదల కానుంది. దీనికి సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఈ ప్రచారంతో సంబంధం లేకపోయినా 'మింత్ర' సృష్టించిన చిత్రాలు అంతర్జాలంలో వైరల్ అయ్యాయి.

68 సంవత్సరాల రేఖను ఏఐ పవర్‌తో అందాల బార్బీ బొమ్మగా మార్చి నెటిజనులను అబ్బుర పరిచింది ఇండియన్ ఫ్యాషన్ ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ మింత్ర.





D కంపెనీలో ఒక రోజు

వీధి రౌడీ నుంచి మాఫియా డాన్ వరకు దావూద్ ఇబ్రహీం నేర పరిణామ క్రమాన్ని దగ్గరి నుంచి చూసింది జర్నలిస్ట్ షీలాభట్. ఆమె దావూద్‌ను ఎన్నోసార్లు ఇంటర్వ్యూ చేసింది.

1970లో...'చిత్రలేఖ' మ్యాగజైన్‌లో మాఫియా డాన్ కరీమ్‌లాలాతో షీలాభట్ ఉన్న ఫోటోను చూసి ఆమెకు కాల్ చేశాడు దావూద్.

అప్పుడు దావూద్ 'జస్ట్ ఏ క్రిమినల్' మాత్రమే.

'మీరు నాకు ఒక సహాయం చేయాలి. ముంబైలోని గవర్నమెంట్ రిమాండ్ హోమ్‌లో ఉన్న అమ్మాయిలను కరీమ్‌లాలా మనుషులు వేధిస్తున్నారు. మీరు వాళ్ల దుర్మార్గాల గురించి పత్రికల్లో రాయాలి' అని షీలాను అడిగాడు దావూద్.

'దావూద్ అంటే భయం కంటే ప్రయాణ ఖర్చుల గురించి బాధే నాలో ఎక్కువగా ఉండేది' అని దుబాయ్ ప్రయాణాన్ని గుర్తు చేసుకొని నవ్వుతూ చెప్పింది షీలా.

ఒకసారి దావూద్‌ను ఇంటర్వ్యూ చేయడం కోసం దుబాయ్‌కు వెళ్లింది. 'లెట్స్ ఈట్' అంటున్నాడే తప్ప ఇంటర్వ్యూకు మాత్రం 'నో' అంటున్నాడు దావూద్. మూడురోజుల తరువాత మాత్రం ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఒక మర్డర్ గురించి మాట్లాడుతూ 'వాడిని నేను చంపి ఉండకపోతే, వాడు నన్ను కచ్చితంగా చంపేవాడు. షీలాజీ... మీరే చెప్పండీ. నేను చేసింది ఏమైనా తప్పంటారా?' అని అమాయకంగా ముఖం పెట్టాడు దావూద్!

తాజాగా ఒక వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇలాంటి విషయాలెన్నో చెప్పింది షీలాభట్.

ఖలునికి నిలువెల్లా విషము గదరా సుమతీ!

మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ భార్య అమృత సోషల్ మీడియాలో పాపులర్. ఆమెకు ఎంతో మంది ఫాలోవర్స్ ఉన్నారు. జంతుప్రేమికురాలైన అమృత పాము, ఒకరకం బల్లితో దిగిన ఫొటోలు ట్విట్టర్‌లో వైరల్ అయ్యాయి. ఈ ఫొటోలకు...

'అత్యంత ప్రమాదకరమైన, విషతుల్యమైన జంతువు మనిషి మాత్రమే' అనే కాప్షన్ ఇచ్చింది అమృత.

'ఫోటోల కంటే మీ కాప్షన్ అద్భుతంగా ఉంది'

'సాటిజీవుల పట్ల మనకు ఉండాల్సిన ప్రేమను అందంగా అద్దం పట్టిన ఫొటోలు ఇవి'... అంటూ నెటిజనులు స్పందించారు.

తన ట్విట్టర్ ప్రొఫైల్ బయోలో బ్యాంకర్, ప్లేబ్యాక్ సింగర్, సోషల్ వర్కర్ అని రాసుకుంది అమృత.



వైరల్

ఏడ్చిన పిల్లాడు ఎంచక్కా నవ్వాడు



ఇంట్లో చూసుకునేవారు ఎవరూ లేకపోవడంతో ఒక మహిళ తన ఆరునెలల పిల్లాడిని ఎత్తుకొని అహ్మదాబాద్(గుజరాత్)లోని పరీక్షాకేంద్రానికి వచ్చింది. ఇంకొద్దిసేపట్లో పరీక్ష ప్రారంభం అవుతుందనగా పిల్లాడు ఏడుపు లంకించుకున్నాడు.

ఎంతకీ ఏడుపు ఆపడం లేదు.

'వెనక్కి తిరిగి పోవాలా? పరీక్ష రాయాలా?' అనే డైలామాలో ఉన్నప్పుడు 'నేనున్నాను' అంటూ సీన్‌లోకి వచ్చింది కానిస్టేబుల్ దయాబెన్.

'అక్కా, నేను పిల్లాడిని చూసుకుంటాను. నువ్వెళ్లి హాయిగా పరీక్ష రాయ్' అని చెప్పింది.

ఆ పిల్లాడి తల్లి దయాబెన్‌కు థ్యాంక్స్ చెప్పి ఎగ్జామ్‌హాల్‌లోకి వెళ్లింది.

దయాబెన్ తన హావభావాలతో పిల్లాడిని ఏడుపు నుంచి నవ్వుల్లోకి జంప్ చేయించింది.

'నన్ను నవ్వించినందుకు థ్యాంక్స్' అని పిల్లాడు దయాబెన్ కళ్లలోకి చూస్తూ చెబుతున్నట్లుగా ఉన్న ఫొటోలు ట్విట్టర్‌లో వైరల్ అయ్యాయి. కానిస్టేబుల్ దయాబెన్ దయాగుణాన్ని నెటిజనులు వేనోళ్ల పొగిడారు.

క్లాసిక్+వెస్ట్రన్ =ఫైర్



మన కథాకళికి పాప్ పాట జత చేస్తే ఎలా ఉంటుంది?

రెండు కళ్లు చాలనంత అద్భుతంగా ఉంటుందని చెప్పడానికి ఈ వైరల్ వీడియోనే సాక్ష్యం.

అమెరికన్ సింగర్, సాంగ్ రైటర్ గోమెజ్, నైజీరియన్ సింగర్, ర్యాపర్ రెమోల 'బేబీ కామ్‌డౌన్' పాట సెన్సేషనల్ గ్లోబల్ హిట్ అయింది. ప్రపంచవ్యాప్తంగా ఈ పాటకు తమదైన క్రియేటివ్ ట్విస్ట్ ఇస్తున్నారు కళాకారులు

మనదేశం విషయానికి వస్తే...

ముగ్గురు మహిళా డ్యాన్సర్లు 'బేబి కామ్‌డౌన్' పాటకు వేసిన కథాకళీ స్టెప్పులు 'వారెవా' అనిపించాయి.

ముఖ్యంగా వారి ఎక్స్‌ప్రెషన్స్ 'అదరహో' అన్నట్లుగా ఉన్నాయి. డ్యాన్సర్ శెయాలి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో 10 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. క్లాసిక్+వెస్ట్రన్ =ఫైర్ అని నెటిజనులు స్పందించారు.

పూల బొమ్మ పులకించిన వేళ

సంచలనాలు, అద్భుతాలు మాత్రమే 'వైరల్'కి అర్థం కాదని నిరూపించిన వీడియో ఇది...

పుణెలో ఒక బామ్మ తన పూలదుకాణంలో కూర్చొని పూలు అల్లుతుంది. నిజానికి ఇదొక సాధారణ దృశ్యం. అయితే ఈ దృశ్యంలో ఆర్టిస్ట్ చైతన్యకు శ్రమజీవన సౌందర్యం కనిపించింది. తన స్కెచ్‌బుక్ తీసి బామ్మను స్కెచ్ వేయడం ప్రారంభించాడు. స్కెచ్ పూర్తయిన తరువాత బామ్మకు చూపిస్తే...

ఆమె కళ్లలో ఎంత సంతోషమో!

బామ్మకు ఆ స్కెచ్ ఎంతగానో నచ్చేసింది. 'ఆ దృశ్యం ఎంత అద్భుతంగా ఉందంటే... చుట్టుపక్కల ఎన్ని శబ్దాలు వినిపిస్తున్నా బామ్మ దృష్టి పూలమీద మాత్రమే ఉంది. పూల అల్లికలో అపారమైన ఆనందాన్ని పొందుతుంది' అని రాశాడు చైతన్య.

ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ వీడియో 2.4 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

'ఇష్టమైన పనిలోనే అంతులేని సంతోషం దొరుకుతుంది అని చెప్పే వీడియో ఇది' అని కామెంట్ సెక్షన్‌లో స్పందించిన వారు ఎందరో.



ఈ సీజన్‌లో...

టైఫాయిడ్ ముప్పు తప్పించుకోండి!



ఇది చినుకుల కాలం. వర్షాకాలంలో డ్రైనేజీలు పొంగుతూ... మానవ విసర్జకాలు మంచినీళ్లతో కలవడం మామూలే. ఆ నీళ్లు తాగడం, అలా కలుషితమైన నీళ్లతో వండిన ఆహారాలతో టైఫాయిడ్ రావడం సాధారణం. మురికివాడలూ, పారిశుద్ధ్యవసతి అంతగా లేని ప్రాంతాల్లో ఇది ఇంకా ఎక్కువ. సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియమ్ టైఫాయిడ్ జ్వరానికి కారణం. ఇదే జాతికి చెందిన సాల్మొనెల్లా పారాటైఫీ అనే మరో రకం బ్యాక్టీరియా కూడా ఉంది. కాకపోతే దీంతో తీవ్రత కాస్తంత తక్కువ. ఈ సీజన్‌లో టైఫాయిడ్ వచ్చేందుకు అవకాశాలు ఉండటంతో ఈ జ్వరంపై అవగాహన కోసం ఈ కథనం.

టైఫాయిడ్ బ్యాక్టీరియా మనుగడ సాగించేది కేవలం మానవ శరీరంలోనే. కొంతమందిలో దీని లక్షణాలేమీ బయటకు కనిపించవు. కానీ వారి నుంచి ఇతరులకు బ్యాక్టీరియా వ్యాపించినప్పుడు ఇతరుల్లో టైఫాయిడ్ బయటపడవచ్చు. ఇలా లక్షణాలు లేకుండా వ్యాప్తి చేసేవారిని క్యారియర్స్ అంటారు. మురికిగా ఉండే మెస్‌లూ, క్యాంటీన్లు, అపరిశుభ్రమైన హోటళ్లలో పనిచేసేవారిలో ఇది నిద్రాణంగా ఏళ్లతరబడి ఉండే అవకాశం ఉంది. వీళ్ల విసర్జకాలతో ఆహారం కలుషితమై... ఇతరులకు వ్యాధిని వ్యాప్తి చేసే అవకాశాలు ఎక్కువ. వీళ్లను క్రానిక్ క్యారియర్స్‌గా చెబుతారు. దేహంలోకి బ్యాక్టీరియా ప్రవేశించిన వారం లేదా రెండు వారాలలో లక్షణాలు బయటపడతాయి. టైఫాయిడ్ జ్వరమొచ్చాక అది దాదాపు 3 – 4 వారాల పాటు బాధిస్తుంది.

లక్షణాలు: ● తీవ్రమైన జ్వరం (ఒక్కోసారి 104 డిగ్రీల ఫారెన్‌హీట్‌కు మించి) ● ఆకలి మందగించడం ● తలనొప్పి ● గుండె స్పందనలు తగ్గడం (బ్రాడీకార్డియా) ● రక్తంలో తెల్లరక్తకణాల సంఖ్య తగ్గడం (ల్యూకోపీనియా) ● కొందరిలో నీళ్ల విరేచనాలు, పొట్టనొప్పి ● ఒంటి నొప్పులు ● తీవ్రమైన అలసట, నిస్సత్తువ, నీరసం ● కొందరిలో ఛాతీ పట్టేసినట్లుగా ఉండటం ● చాలా అరుదుగా కొందరిలో ర్యాష్‌తో పాటు మెడ, పొట్ట మీద గులాబీ రంగు మచ్చలు కనిపించవచ్చు. జ్వరం కారణంగా దుష్ప్రభావాలు కనిపించకపోతే మూడు నుంచి నాలుగు వారాల్లో జ్వరం దానంతట అదే తగ్గుతుంది.

నిర్ధారణ : ➡ మొదటివారంలో రక్తపరీక్షతో (బ్లడ్ కల్చర్) కచ్చితంగా కనుగొనవచ్చు. అందుకే మొదటివారంలో చేసే రక్తపరీక్షను గోల్డ్‌స్టాండర్డ్ పరీక్షగా పేర్కొనవచ్చు. ➡ రెండోవారంలో వైడాల్ టెస్ట్ అనే రక్తపరీక్షతో నిర్ధారణ చేస్తారు. ➡ మూడో వారంలో ఎముక మజ్జ (బోన్‌మ్యారో) కల్చర్ పరీక్షతో నిర్ధారణ చేస్తారు.

ఈ పరీక్షలతో పాటు బయటకు కనిపించే టైఫాయిడ్ సాధారణ లక్షణాలను బట్టి దీన్ని నిర్ధారణ చేయవచ్చు గానీ... ఇలాంటి లక్షణాలే చాలా జ్వరాల్లో కనిపిస్తాయి కాబట్టి కేవలం లక్షణాలను బట్టే నిర్ధారణ అంత తేలిక కాదు. వైద్యపరీక్షలతో దీన్ని కచ్చితంగా నిర్ధారణ చేయవచ్చు.

డ్రగ్ రెసిస్టెంట్ టైఫాయిడ్...

ఇటీవల మందులకు లొంగని టైఫాయిడ్ ఎక్కువగా కనిపిస్తోంది. చిన్న చిన్న సమస్యలకూ విచక్షణరహితంగా యాంటీబయాటిక్స్ వాడటం, అది కూడా సరైన మోతాదులో కాకుండా ఇష్టం వచ్చిన మోతాదుల్లో వాడుతూ తుండటంతో డ్రగ్ రెసిస్టెంట్ టైఫాయిడ్ ఎక్కువగా కనిపిస్తోంది. పైగా దీని లక్షణాలు కూడా టైఫాయిడ్‌లా కనిపించవు. ఇలాంటి కేసుల్లో రోగికి చాలా జాగ్రత్తగా, శ్రద్ధగా వైద్యం అందించాలి. గతంలో చాలా సాధారణ మందులతోనే అంటే క్లోరో క్వినలోన్స్ వంటి చాలా ప్రాథమికమైన మందులతోనే టైఫాయిడ్ త్వరగా తగ్గిపోయేది. కానీ డ్రగ్ రెసిస్టెంట్ టైఫాయిడ్ వచ్చిందంటే అది ఒక పట్టాన తగ్గక చాలా రకాల ఇబ్బందులను తెచ్చిపెడుతోంది. మందులు కూడా పనిచేయకపోవడంతో వైద్యులు మరింత శక్తిమంతమైన మందులు వాడాల్సిన పరిస్థితి. అందుకే ఆన్ కౌంటర్ మందులు వద్దని డాక్టర్లు సూచిస్తుంటారు.

నివారణ : ➡ ఈగలతో దీని వ్యాప్తి చాలా ఎక్కువ. మలం మీద వాలి, అవే మళ్లీ ఆహారపదార్థాల మీద వాలే అవకాశం ఉన్నందున ఈగలను ముసరనివ్వకూడదు. ➡ ఈ సీజన్‌లో కుండల్లో చాలాకాలం నిల్వ ఉన్న నీటిని ఏమాత్రం తాగకూడదు. ఎప్పటికప్పుడు ఫ్రెష్‌గా పట్టిన నీళ్లే తాగాలి. వీలైనంతవరకు నీటిని కాచి, వడపోసి చల్లార్చి తాగడం మంచిది. ➡ చేతులు కడుక్కునే అలవాటు లేనివారిలో ఇది ఎక్కువగా రావడం కనిపిస్తుంది. అందుకే తినేముందు లేదా తాగే ముందర చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. ఇక మల విసర్జన తర్వాత తప్పనిసరిగా చేతులు సబ్బుతో కడుక్కోవాలి. ➡ అన్నం, కూరలు వేడివేడిగా ఉండగానే తినెయ్యాలి. ➡ వేడి చేయకుండా... నేరుగా నీళ్లను ఉపయోగించే చేసే తినుబండారాలతో టైఫాయిడ్ వ్యాప్తికి అవకాశాలు చాలా ఎక్కువ. అందుకే ఈ సీజన్‌లో వేడిచేయకుండా నేరుగా నీళ్లను వాడే పానీపూరీ వంటి ఆహారాలకు దూరంగా ఉండాలి. వీలైనంతవరకు ఈ సీజన్ అంతా బయటి ఆహారాలకు దూరంగా ఉండటమే మంచిది. ఒకవేళ బయటి పదార్థాలు తినాల్సి వస్తే చల్లారిపోయాక అస్సలు తినకూడదు. ➡ కలుషిత జలాలతో తయారు చేసే ఐస్‌తో కూడా ఇది వ్యాపించే అవకాశం ఉన్నందున, అలాంటి ఐస్ వాడే చెరుకు రసం వంటి పానీయాలకు దూరంగా ఉండటం చాలా అవసరం.

టీకా అందుబాటులో...

టైఫాయిడ్ నివారణకు టీకా అందుబాటులో ఉన్నందున... వచ్చాక మందుల వాడకం కంటే ముందుగా టీకాతోనే నివారించుకునే అవకాశం ఇప్పుడు ఉంది. ఈ సీజన్‌లో దూర ప్రయాణాలు చేసేవారికి ఇదెంతో మంచిది.

నివారణ చర్యలతో, టీకాతో నివారణ తేలికే కాబట్టి దీన్ని నివారించుకోవడమే మేలు.

చికిత్స : ➡ టైఫాయిడ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే... దీని కారణంగా ఇది సోకిన ప్రతి ఐదుగురిలో ఒకరు మరణించే అవకాశముంటుంది. అలా చూసినప్పుడు ఇది కొంచెం ప్రమాదకరమైన వ్యాధి. అందుకే చికిత్స తప్పనిసరి. పైగా 104 డిగ్రీలకు పైగా జ్వరం కారణంగా మరికొన్ని దుష్ప్రభావాలు కనిపించవచ్చు. చికిత్స అందకపోయినా లేదా తీవ్రత ఎక్కువగా ఉన్నా మెదడును దెబ్బతీసేలా మెనింజైటిస్, గుండెకు నష్టం చేకూరేలా మయోకార్డైటిస్, ప్యాంక్రియాస్‌ను దెబ్బతీస్తూ ప్యాంక్రియాటైటిస్, కొందరిలో పేగుల్లో రంధ్రం పడటం (పెర్‌ఫొరేషన్), పేగుల్లో రక్తస్రావం కావడం, కిడ్నీలు దెబ్బతినడం వంటి అనర్థాలు రావచ్చు. కొన్నిసార్లు చాలా అవయవాలు విఫలం కావడం (మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్) జరగవచ్చు. అందుకే టైఫాయిడ్ రోగులు సరైన చికిత్స తీసుకోవడం చాలా అవసరం. ➡ ఫ్లూరోక్వినలోన్స్ / సెఫాలోస్పోరిన్స్ వంటి యాంటీబయాటిక్స్‌తో సాల్మొనెల్లా బ్యాక్టీరియా పూర్తిగా చనిపోతుంది. అయితే ఈ యాంటీబయాటిక్స్ పూర్తికోర్స్ వాడటం చాలా అవసరం. లేదంటే జబ్బు తిరగబెట్టవచ్చు. అది మరింత తీవ్రరూపం దాల్చవచ్చు.



డాక్టర్ లింగయ్య మిర్యాల
సీనియర్ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్

పిల్లల్లో మెడనొప్పి!

పిల్లల్లో మెడనొప్పి అంతగా కనిపించకపోయినా అరుదేమీ కాదు. వాళ్ల రోజువారీ అలవాట్లవల్ల కొద్దిమందిలో అప్పుడప్పుడూ కనిపిస్తూనే ఉంటుంది. ఉదాహరణకు వీపు వెనక పుస్తకాల బ్యాగ్ తాలూకు బరువు మోస్తూ... మెడను ముందుకు చాపి నడుస్తూ ఉండటం, స్కూళ్లలో బెంచీల మీద కూర్చుని... చాలాసేపు మెడ నిటారుగా ఉంచడం, కంప్యూటర్ మీద ఆటలాడుతూ చాలాసేపు మెడను కదిలించకుండా ఉంచడం వంటి అనేక అంశాలతో మెడనొప్పి రావచ్చు. ఇలాంటి పిల్లల చేత తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు పాటించేలా చేయడం వల్ల మెడనొప్పిని నివారించవచ్చు.

● స్కూల్లో తమ బెంచీ నుంచి డెస్క్‌కూ / ఇంట్లో తమ రీడింగ్ టేబుల్ నుంచి తమ కుర్చీకీ తగినంత దూరంలో ఉందా, పిల్లల ఎత్తుకు తగినట్లుగా ఉందా అన్నది చూసుకోవాలి. లేదంటే తల్లిదండ్రులు ఆ రీడింగ్ టేబుల్ ఎత్తును అడ్జెస్ట్ చేయాలి. వాటికి తగినట్లుగా తమ కూర్చునే భంగిమ (పోష్చర్) సరిగా ఉందా అన్నది కూడా తల్లిదండ్రులు పరిశీలించాలి. ● స్కూల్లో లేదా ఇంట్లో... చదివే సమయాల్లో వెన్నును కంఫర్టబుల్‌గా ఉంచుకోవాలి. వెన్ను ఏదో ఒక వైపునకు ఒంగిపోయేలా కూర్చోకూడదు. అదే పనిగా చదవకుండా మధ్య మధ్య గ్యాప్ ఇస్తుండాలి. ● పిల్లలు వీడియో గేమ్స్ ఆడుతూ... మెడను చాలాసేపు నిటారుగా ఉంచడం సరికాదు. మధ్యమధ్యన మెడకు విశ్రాంతినిస్తూ ఉండాలి. ● పిల్లలు వీడియోగేమ్స్ మాత్రమే కాదు... గ్రౌండ్‌లోనూ ఆటలాడేలా పేరెంట్స్ ప్రోత్సహించాలి. ● ఊబకాయం ఉన్న పిల్లల్లో మెడనొప్పి వచ్చే అవకాశాలెక్కువ. అందుకే వారు తినే తినుబండారాలు ఆరోగ్యకరంగా ఉండాలి. వీలైనంతవరకు జంక్‌ఫుడ్ /బేకరీ ఐటమ్స్‌కు దూరంగా ఉంచాలి.


ఈ జాగ్రత్తలు మెడనొప్పిని నివారిస్తాయి. అప్పటికే మెడనొప్పి ఉంటే తగ్గిస్తాయి. ఇవి పాటించాక కూడా తగ్గకపోతే ఒకసారి డాక్టర్‌ను సంప్రదించాలి.



హెల్త్

అండాశయాల్లో నీటితిత్తులు కనిపించే పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ (పీసీఓఎస్) ఉన్న కొందరు మహిళల్లో రాత్రివేళల్లో నిద్ర సంబంధిత సమస్యలు కనిపించే అవకాశాలుంటాయి. అంటే... కొందరిలో రాత్రి నిద్రపట్టకపోవడం (ఇన్‌సామ్నియా), గురకవస్తూ... దాంతో మెదడుకు ఆక్సిజన్ సరిగా అందకపోవడం (స్లీప్ ఆప్నియా)తో నిద్రాభంగం అవుతుండటం, కాళ్లు విపరీతంగా కదిలించే 'రెస్ట్‌లెస్ లెగ్ సిండ్రోమ్'తో నిద్రనుంచి లేచి, ఆపై ఎంతకూ నిద్రపట్టకపోవడం వంటి సమస్యలు వస్తుంటాయి. పీసీఓఎస్ ఉండి, ఇలాంటి నిద్ర సంబంధిత సమస్యలు కనిపించే మహిళలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపే కథనమిది.

పీసీఓఎస్‌తో నిద్రాభంగం అవుతోందా?



పీసీఓఎస్‌తో నిద్రాభంగాలు ఎందుకంటే...

అండాశయాల్లో నీటితిత్తులకు హార్మోన్ల అసమతౌల్యతే ప్రధాన కారణం. అంటే కొన్ని హార్మోన్ల స్రావాల్లో హెచ్చుతగ్గులు, ప్రధానంగా పురుషుల్లో ఎక్కువగా ఉండే యాండ్రోజెన్ వంటి హార్మోన్ల మోతాదులు పెరగడం వంటి అంశాలు అసమతౌల్యతకు దారితీస్తాయి. ఈ అసమతౌల్యతే నిద్రా సమస్యలకూ కారణమవుతుంది.

ఆహార అలవాట్లతో అధిగమించడం ఇలా...

కొన్ని రకాల ఆహారాలను దూరంగా ఉంచడం వల్ల స్లీప్ సమస్యలను దూరంగా ఉంచవచ్చు. అవి... ▸ ఎక్కువగా చక్కెరలను వెలువరించే ఆహారాలను చాలా పరిమితంగా తీసుకుంటూ... అదే సమయంలో అతి తక్కువగా చక్కెరను వెలువరించే (లో-గ్లైసీమిక్ ఇండెక్స్) ఆహారాలను తీసుకోవడం. (అంటే ఉదాహరణకు వరిలాంటి ఎక్కువ చక్కెరలను వెలువరించే ఆహారాలు కాకుండా కొర్రలు, రాగుల వంటి చిరుధాన్యాలను తీసుకోవడం, అతిగా పాలిష్ చేయనివీ, పొట్టుతో ఉండే ధాన్యాలనే తీసుకోవడం. ▸ పీచు ఎక్కువగా ఉండే ఆకుకూరలు, కూరగాయలతో పాటు కొవ్వులు తక్కువగా ఉండి, ప్రోటీన్ మోతాదులు ఎక్కువగా ఉండే చిక్కుళ్ల వంటి ఆహారాలను తీసుకోవడం. ▸ అతిగా ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర ఎక్కువగా ఉండే పానియాలకు దూరంగా ఉండటం. ▸ కొవ్వు పదార్థాలు తక్కువగా ఉండే బాదం వంటి నట్స్, ఎండుఫలాలను ఎక్కువగా తీసుకోవడం. ▸ వేట మాంసాన్ని చాలా పరిమితంగా తీసుకుంటూ, వైట్ మీట్ (చేపలను) ఎక్కువగా తీసుకోవడంతో పీసీఓఎస్‌ను చాలావరకు నివారించవచ్చు.

ఆరోగ్యకరమైన జీవనశైలితో...

క్రమం తప్పని వ్యాయామం, ఒత్తిడిని తగ్గించే (ధ్యానం, యోగా వంటి)టెక్నిక్స్‌తో, బరువును నియంత్రిస్తూ స్థూలకాయం రాకుండా చూసుకోవడం, రోజుకు కనీసం 8 గంటల పాటు కంటినిండా నిద్రపోవడం వంటి చర్యలతో పీసీఓఎస్‌ను చాలావరకు నివారించవచ్చు. దాంతో నిద్రసమస్యలతో పాటు, ఇతరత్రా అనేక సమస్యలూ నివారితమై, మహిళల ఆరోగ్యం అన్ని విధాలా మెరుగుపడుతుంది.



డాక్టర్ ఎమ్. రజని
సీనియర్ గైనకాలజిస్ట్

జొకోవిచ్ X అల్‌కరాజ్

నేడు వింబుల్డన్ పురుషుల సింగిల్స్ ఫైనల్
సాయంత్రం గం. 6:30 నుంచి
స్టార్ స్పోర్ట్స్-2లో ప్రత్యక్ష ప్రసారం

శ్రీవల్లి జోడికి టైటిల్



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మరో టోర్నీలో తెలంగాణ ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక విజేతగా నిలిచింది. థాయిలాండ్‌లో జరిగిన డబ్ల్యూ15 టోర్నీ డబుల్స్‌లో రష్మిక జోడి విజయం సాధించింది. ఫైనల్లో టాప్ సీడ్ రష్మిక – మోనిక్ బ్యారీ (న్యూజిలాండ్) ద్వయం 6-2, 7-6 (7/3)తో థాయిలాండ్‌కు చెందిన పునిక్ కొవాపిటుక్టెడ్ – సుపాపిచ్ క్యూరమ్ జంటను ఓడించింది. ఈ ఏడాది రష్మికకు ఇది మూడో ఐటీఎఫ్ టైటిల్ కావడం విశేషం.

వండర్ వొండ్రుసోవా



అన్‌సీడెడ్...మణికట్టుకు రెండు శస్త్రచికిత్సలు...మెగా టోర్నీకి ముందు తప్పుకున్న స్పాన్సర్...వింబుల్డన్‌లో అడుగు పెట్టే సమయానికి మర్కెటా వొండ్రుసోవా పరిస్థితి ఇది. గ్రాస్ కోర్టు గ్రాండ్‌స్లామ్ ఈవెంట్‌లో గతంలో నాలుగు ప్రయత్నాల్లో రెండో రౌండ్ కూడా దాటలేకపోయింది... గత ఏడాది గాయంతో దూరమైన ఆమె ఈ సారీ మొదటి రౌండ్ దాటితే చాలనే ఆలోచనతోనే ఆమె బరిలోకి దిగింది.. అయితే ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో ఆమె అద్భుతం చేసింది. ఏకపక్షంగా సాగిన తుది పోరులో సంచలన విజయంతో చాంపియన్‌గా నిలిచింది. మహిళల విభాగం ఓపెన్ ఎరాలో వింబుల్డన్ గెలుచుకున్న తొలి అన్‌సీడెడ్‌గా వొండ్రుసోవా నిలిచింది. మరో వైపు వింబుల్డన్‌లో వరుసగా రెండో ఏడాది రన్నరప్‌గానే పరిమితమై అన్స్ జబర్ కన్నీళ్లపర్యంతమైంది.

వింబుల్డన్ విజేతగా చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి
- తొలి గ్రాండ్‌స్లామ్ సాధించిన మర్కెటా వొండ్రుసోవా
- ఫైనల్లో 6–4, 6–4తో అన్స్ జబర్‌పై గెలుపు
- వరుసగా రెండో ఏడాది రన్నరప్‌గా జబర్

లండన్: వింబుల్డన్ మహిళల సింగిల్స్‌లో కొత్త విజేత అవతరించింది. చెక్ రిపబ్లిక్‌కు చెందిన 24 ఏళ్ల మర్కెటా వొండ్రుసోవా చాంపియన్‌గా 'వీనస్ రోజ్‌వాటర్ డిష్'ను సగర్వంగా అందుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో వొండ్రుసోవా 6–4, 6–4 స్కోరుతో ఆరో సీడ్ అన్స్ జబర్ (ట్యునీషియా)పై విజయం సాధించింది. 80 నిమిషాల్లో ముగిసిన ఈ పోరులో ప్రపంచ 42వ ర్యాంకర్ వొండ్రుసోవా జోరు ముందు 6వ ర్యాంకర్ జబర్ నిలవలేకపోయింది. 2019 ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ఓడి రన్నరప్‌గా నిలిచిన వొండ్రుసోవాకు ఇది మొదటి గ్రాండ్‌స్లామ్ టైటిల్ కాగా... గత ఏడాది వింబుల్డన్, యూఎస్ ఓపెన్ ఫైనల్‌లలో ఓడిన జబర్ మూడో ప్రయత్నంలోనూ గ్రాండ్‌స్లామ్ విజేతగా నిలవలేకపోయింది. టైటిల్ సాధించిన వొండ్రుసోవాకు 23 లక్షల 50 వేల పౌండ్లు (రూ. 25 కోట్ల 29 లక్షలు), రన్నరప్ జబర్‌కు 11 లక్షల 75 వేల పౌండ్లు (రూ. 12 కోట్ల 64 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. నలుగురు గ్రాండ్‌స్లామ్ విజేతలు, వారిలో ముగ్గురు ప్రస్తుత టాప్–10 ప్లేయర్లను ఓడించి ఫైనల్ చేరిన జబర్‌పైనే అందరి అంచనాలు ఉన్నాయి. దానికి తగినట్లుగా శుభారంభం చేస్తూ తొలి సెట్‌లో ఆమె 2–0తో ముందంజ వేసింది. అయితే కోలుకున్న వొండ్రుసోవా 2–2తో స్కోరు సమం చేసింది. చక్కటి ఫోర్‌హ్యాండ్‌లలో మళ్లీ చెలరేగిన జబర్ ముందంజ వేస్తూ 4–2తో మళ్లీ ఆధిక్యం కనబర్చింది. అయితే ఇక్కడే ఆట మలుపు తిరిగింది. వరుస తప్పులతో జబర్ ఒత్తిడిలో పడిపోగా, దూకుడుగా ఆడిన చెక్ రిపబ్లిక్ ప్లేయర్ వరుసగా నాలుగు గేమ్‌లు గెలిచి 6–4తో తొలి సెట్‌ను తన ఖాతాలో వేసుకుంది. రెండో సెట్‌లో దాదాపు ఇదే ప్రదర్శన పునరావృతమైంది. అభిమానులు తనకు మద్దతు పలుకుతుండగా జబర్ 3–1తో దూసుకుపోయింది. అయితే బేస్‌లైన్ గేమ్‌తో ప్రశాంతంగా ఆడిన వొండ్రుసోవా 3–3కు, ఆపై 4–4కు స్కోరును చేర్చింది. తొమ్మిదో గేమ్‌లో పదే పదే నెట్‌పై ఆడి పాయింట్లు కోల్పోయిన జబర్ 4–5తో వెనుకబడింది. చివరి గేమ్‌లో తన సర్వీస్‌ను నిలబెట్టుకోవడంలో వొండ్రుసోవా సఫలమై ఆనందంలో కోర్టుపై కుప్పకూలిపోయింది. ఏకంగా 31 అనవసర తప్పిదాలు చేసిన జబర్ చేజేతులా తన ఓటమిని ఆహ్వానించింది.



జబర్



రోహిత్ అశ్విన్

అశ్విన్ అదరగొట్టగా...

- తొలి టెస్టులో భారత్ ఘన విజయం
- ఇన్నింగ్స్, 141 పరుగులతో వెస్టిండీస్ చిత్తు
- 7 వికెట్లు పడగొట్టిన భారత స్పిన్నర్

8 ఒక టెస్టులో అశ్విన్ పది వికెట్ల ఘనత నమోదు చేయడం ఇది ఎనిమిదో సారి. భారత బౌలర్లలో అనిల్ కుంబ్లే (8)ను అతను సమం చేశాడు.

8 తొలి టెస్టులోనే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన ఎనిమిదో భారత క్రికెటర్ యశస్వి. అతనికంటే ముందు ప్రవీణ్ ఆమ్రే, ఆర్పీ సింగ్, అశ్విన్, ధావన్, రోహిత్, పృథ్వీ షా, శ్రేయస్ ఈ ఫీట్ సాధించారు.

రోసియు (డొమినికా): భారత సీనియర్ స్పిన్నర్ అశ్విన్ (7/71) స్పిన్ వలలో విండీస్ బ్యాటర్లు విలవిలలాడారు. దీంతో తొలి టెస్టులో టీమిండియా ఇన్నింగ్స్, 141 పరుగుల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ టెస్టు మొదలైనప్పటి నుంచి ప్రతి రోజు, ప్రతి సెషన్‌లో కూడా భారత్ హవానే కొనసాగింది. దీంతో మూడే రోజుల్లో రోహిత్ సేన మ్యాచ్‌ను ముగించి కొత్త ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)కు ఘనంగా శ్రీకారం చుట్టింది. శుక్రవారం 27/2 స్కోరు వద్ద టీ విరామానికి వెళ్లిన వెస్టిండీస్ ఆఖరి సెషన్‌లో మిగతా 8 వికెట్లను కోల్పోయింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆతిథ్య జట్టు 50.3 ఓవర్లలో 130 పరుగులకే కుప్పకూలింది. కరీబియన్ గడ్డపై శుభారంభం చేసిన భారత్ రెండు టెస్టుల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో టెస్టు ఈ నెల 20 నుంచి పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో జరుగుతుంది.

ఆఖరి సెషన్ కాదు...అశ్విన్ సెషన్!

వన్నె తగ్గని వెటరన్ స్పిన్నర్ మాయాజాలానికి ఆఖరి సెషన్ కాస్తా అశ్విన్ సెషన్‌గా మారింది. టీ బ్రేక్ తర్వాత అతని స్పిన్ ఉచ్చులో విండీస్ చిక్కుకుంది. ఈ సెషన్లో పడిన 8 వికెట్లలో 6 వికెట్లు అశ్విన్‌వే కావడం విశేషం. అలిక్ అతనజ్ (28; 5 ఫోర్లు), హోల్డర్ (20 నాటౌట్; 1 సిక్స్) కొద్ది సేపు నిలవగలిగారు. లోయర్ ఆర్డర్‌లో అల్జారి జోసెఫ్ (13) నుంచి... కార్న్‌వాల్ (4), కీమర్ రోచ్ (0), ఆఖరి వికెట్ వారికన్ (18) వరకు వరుస నాలుగు వికెట్లు అశ్విన్ బౌలింగ్‌లోనే పడ్డాయి. తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీసిన అశ్విన్ ఈ టెస్టులో మొత్తం 12 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు.

పారిస్ ఒలింపిక్స్‌కు శ్రీశంకర్ అర్హత

- లాంగ్‌జంప్‌లో రజతం నెగ్గిన అథ్లెట్
- 4×400 మీ. మిక్స్‌డ్ రిలేలో స్వర్ణం



బ్యాంకాక్: భారత స్టార్ లాంగ్‌జంపర్ మురళీ శ్రీశంకర్ వచ్చే ఏడాది పారిస్‌లో జరిగే ప్రతిష్టాత్మక ఒలింపిక్స్ (2024)కు అర్హత సాధించాడు. తద్వారా ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో ఈ ఘనత సాధించిన తొలి భారత ఆటగాడిగా అతను ఘనత వహించాడు. ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో శనివారం జరిగిన పురుషుల లాంగ్‌జంప్ ఈవెంట్‌లో అతను రజత పతకం సాధించాడు. 24 ఏళ్ల భారత అథ్లెట్ 8.37 మీటర్ల దూరం దుమికి రెండో స్థానంలో నిలిచాడు. ఈ ప్రదర్శన అతని కెరీర్‌లోనే రెండో ఉత్తమ ప్రదర్శన కాగా... పారిస్ ఈవెంట్ క్వాలిఫికేషన్ మార్క్ (8.27 మీటర్లు)ను అధిగమించాడు. శ్రీశంకర్‌కు ఇది రెండో ఒలింపిక్స్ కాగా... గత టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన అతను క్వాలిఫికేషన్ రౌండ్లోనే వెనుదిరిగాడు. ఈ లాంగ్‌జంప్‌లో యు తంగ్ లిన్ (8.40 మీ.; చైనీస్ తైపీ) స్వర్ణం గెలుపొందాడు. 4×400 మీటర్ల మిక్స్‌డ్ రిలే ఈవెంట్‌లో రాజేశ్ రమేశ్, అమోజ్ జాకబ్, ఐశ్వర్య మిశ్రా, శుభ వెంకటేశన్‌లతో కూడిన భారత బృందం పసిడి పతకంతో మెరిసింది. ఈ రిలే జట్టు పోటీని 3 నిమిషాల 14.70 సెకన్లలో పూర్తిచేసి కొత్త జాతీయ రికార్డును నెలకొల్పింది. గతంలో 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నమోదు చేసిన 3ని.15.77 సె. రికార్డును తిరగరాసింది. పురుషుల 400 మీటర్ల హర్డిల్స్‌లో మూడో స్థానంలో నిలిచిన సంతోష్ కుమార్ (49.09 సె.) కాంస్యంతో తృప్తిపడ్డాడు. పురుషుల హైజంప్‌లో సర్వేశ్ కుశారే 2.26 మీ. ఎత్తు వరకు జంప్ చేసి రజతం గెలిచాడు. మహిళల హెప్టాథ్లాన్‌లో స్వప్న బర్మన్ 5840 పాయింట్లతో రజతం గెలుచుకుంది. ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యెర్రాజీ 200 మీటర్ల స్ప్రింట్‌లో ఫైనల్లోకి దూసుకెళ్లింది. సెమీఫైనల్లో ఆమె 23.29 సె. టైమింగ్‌తో ఫైనల్స్‌కు అర్హత పొందింది. శనివారం నాటి పోటీల్లో భారత్ ఒక పసిడి, మూడు రజతాలు, ఒక కాంస్యం గెలుచుకుంది. ఓవరాల్‌గా ఈ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో 14 (6 స్వర్ణాలు, 4 రజతాలు, 4 కాంస్యాలు) పతకాలున్నాయి.



116 పరుగులు... 5 వికెట్లు

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఆదివారం ఆఖరి రోజు సౌత్‌జోన్ గెలుపునకు 5 వికెట్ల దూరంలో ఉంటే... వెస్ట్‌జోన్ విజయానికి మరో 116 పరుగులు కావాలి. 298 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్ట్ ఆట నిలిచే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. కెప్టెన్ ప్రియాంక్ పాంచల్ (92 బ్యాటింగ్; 11 ఫోర్లు) పోరాడుతున్నాడు. అంతకుముందు సౌత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 230 పరుగులకు ఆలౌటైంది.

సింధు పరాజయం

కౌన్సిల్ బ్లఫ్స్ (అమెరికా): యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ సింధు 20–22, 13–21తో గావో ఫాంగ్ జి (చైనా) చేతిలో కంగుతింది. అనుభవజ్ఞురాలైన ప్రపంచ 12వ ర్యాంకర్‌ను వరుస సెట్లలో 24 ఏళ్ల చైనా ప్రత్యర్థి సులువుగా ఓడించింది. పురుషుల క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 21–10, 21–17తో శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్‌పై విజయం సాధించి సెమీస్ చేరాడు.

సినిమా

ట్రిపుల్ ట్రీట్



ధనుష్
కెప్టెన్ మిల్లర్

వెండితెరపై తమ అభిమాన హీరో ఒక్క పాత్రలో కనిపిస్తేనే కేకలు, విజిల్స్ వేస్తూ ఎంజాయ్ చేస్తారు అభిమానులు. అదే హీరో ద్విపాత్రాభినయం చేస్తే ఫ్యాన్స్ ఆనందం డబుల్ అవుతుంది. ట్రిపుల్ గెటప్స్‌లో కనిపిస్తే.. ఫ్యాన్స్ ఆనందం మూడింతలు అవుతుంది. తాజాగా దక్షిణాదిలో ధనుష్, సుధీర్ బాబు, శ్రీవిష్ణు, టొవినో థామస్ వంటి హీరోలు తొలిసారి ట్రిపుల్ ట్రీట్ ఇవ్వనున్నారు. ఆ సినిమాలపై ఓ లుక్కేద్దాం.

వైవిధ్యమైన చిత్రాలతో దూసుకెళుతున్నారు హీరో ధనుష్. ప్రస్తుతం అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో ఆయన పాన్ ఇండియా సినిమా 'కెప్టెన్ మిల్లర్' చేస్తున్నారు. 1930–1940 నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో ధనుష్ మూడు గెటప్స్‌లో కనిపిస్తారు. ఇప్పటికి రెండు గెటప్స్ రిలీజ్ అయ్యాయి. ఫస్ట్ లుక్‌లో పొడవాటి జుట్టు, గుబురు గడ్డం, పెద్ద సైజు గన్ను పట్టుకుని చుట్టూ మరణించిన సైనికుల మధ్య యుద్ధ భూమిలో నిల్చుని ఉన్న ధనుష్ లుక్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. ఇక ధనుష్ చేస్తున్న పాత్రల్లో కెప్టెన్ మిల్లన్ పాత్ర ఒకటి. మిగతా రెండు పాత్రల వివరాలు తెలియాల్సి ఉంది.



సుధీర్‌బాబు

మామా మశ్చీంద్ర

కెరీర్ ప్రారంభం నుంచి వినూత్నమైన, కథా బలమున్న సినిమాలు చేస్తూ తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ని సొంతం చేసుకున్నారు హీరో సుధీర్ బాబు. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మామా మశ్చీంద్ర'. నటుడు, డైరెక్టర్ హర్షవర్ధన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మృణాలినీ రవి, ఈషా రెబ్బా హీరోయిన్లు. ఈ సినిమాలో తొలిసారి మూడు పాత్రల్లో (డీజే, డాన్, దుర్గ) సందడి చేయనున్నారు సుధీర్ బాబు. ఈ మూడు లుక్స్‌కి సంబంధించిన పోస్టర్లు విడుదలయ్యాయి. తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ సినిమా టీజర్‌ని ఇటీవల విడుదల చేయగా మంచి స్పందన వచ్చింది. కామెడీ, రొమాన్స్, యాక్షన్ నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతోంది.



శ్రీ విష్ణు

ప్రీక్వెల్‌లో మూడు పాత్రలు..

డిఫరెంట్ సినిమాలు చేస్తూ ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు హీరో శ్రీ విష్ణు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'సామజ వరగమన' జూన్ 29న విడుదలై సూపర్ హిట్‌గా దూసుకెళుతోంది. శ్రీ విష్ణు కెరీర్‌లో అత్యధిక వసూళ్లు (ఇప్పటికే 40 కోట్లు దాటాయి) సాధించిన చిత్రంగా 'సామజ వరగమన' నిలిచింది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొన్న శ్రీ విష్ణు తాను ఓ చిత్రంలో త్రిపాత్రాభినయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 'రాజ రాజ చోర' (2021)తో హిట్ కాంబో అనిపించుకున్న శ్రీ విష్ణు– డైరెక్టర్ హసిత్ గోలి కాంబినేషన్‌లో మరో సినిమా రాబోతోంది. ఈ మూవీలోనే శ్రీ విష్ణు త్రిపాత్రాభినయం చేస్తున్నారు. 'రాజ రాజ చోర'కి ప్రీక్వెల్‌గా ఈ చిత్రం రూపొందుతోందని సమాచారం.



టొవినో థామస్

అజయంటే రండం మోషణం

'2018' సినిమాతో వంద కోట్ల క్లబ్‌లో చేరారు మలయాళ హీరో టొవినో థామస్. ఈ ఏడాది మే 5న విడుదలైన ఈ మూవీ మలయాళంలో బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రం ఇటీవల తెలుగులో విడుదలై, ఘనవిజయం సాధించింది. ఇక తన కెరీర్‌లో తొలిసారి టొవినో థామస్ త్రిపాత్రాభినయం చేస్తున్న పాన్ ఇండియా చిత్రం 'అజయంటే రండం మోషణం'. ఈ చిత్రంతో జితిన్ లాల్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. కృతీ శెట్టి, ఐశ్వర్యా రాజేష్, సురభి లక్ష్మి కథానాయికలుగా నటిస్తున్నారు. హీరోయిన్‌గా తెలుగులో దూసుకెళుతున్న కృతీ శెట్టికి మలయాళంలో ఇది తొలి చిత్రం. మూడు యుగాల కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంలో టొవినో మూడు పాత్రల్లో (మణియన్, అజయన్, కుంజికే) కనిపించనున్నారు. కేరళ కలరి మార్షల్ ఆర్ట్‌కు ఈ మూవీలో ప్రాధాన్యత ఉండటంతో టొవినో ఈ విద్యలో శిక్షణ తీసుకున్నారు.

సంక్రాంతి బరిలో...



విజయ్

హిట్ ఫిల్మ్ 'గీత గోవిందం' (2018) తర్వాత హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు పరశురామ్ కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. 'దిల్' రాజు, శిరీష్‌లు నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ మొదలైందని వెల్లడించి, ఈ చిత్రాన్ని 2024 సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నట్లుగా శనివారం చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్, కెమెరా: కేయూ మోహనన్.

యాక్షన్ స్టార్ట్

కీర్తీ సురేష్ లీడ్ రోల్‌లో తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం పూజా కార్యక్రమాలు చెన్నైలో జరిగాయి. నూతన దర్శకుడు గణేష్‌రాజ్ దర్శకత్వంలో డ్రీమ్ వారియర్ పిక్చర్స్‌పై ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ఆర్ ప్రభు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ''ఈ ఫీమేల్ ఓరియంటెడ్ మూవీలో కీర్తీ సురేష్ సరికొత్త పాత్రలో కనిపిస్తారు. కథ, స్క్రీన్‌ప్లే, కథలో ఉన్న మలుపులన్నీ ఆసక్తికరంగా ఉంటాయి. ప్రేక్షకులను థ్రిల్‌కి గురి చేసేలా ఈ యాక్షన్ మూవీ ఉంటుంది'' అని ఎస్ఆర్ ప్రభు అన్నారు.



కీర్తీ సురేష్

కొత్త ఊపిరి వచ్చినట్లుంది

– నిర్మాత 'దిల్' రాజు



ప్రియదర్శి, కావ్య, హన్షిత, 'దిల్' రాజు, హర్షిత్, వేణు, శిరీష్

''వంద కోట్ల రూపాయల పోస్టర్స్, వంద రోజుల ఫంక్షన్స్ చూశాను. కానీ తొలిసారి వంద అవార్డుల ఫంక్షన్‌ను 'బలగం'తో చూస్తున్నాం'' అన్నారు 'దిల్' రాజు. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్ రామ్, సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బలగం'. 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌పై వేణు ఎల్దండి దర్శకత్వంలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ చిత్రం మార్చి 3న విడులైంది. 'బలగం'కు ప్రపంచవ్యాప్తంగా వంద అంతర్జాతీయ అవార్డులు వచ్చినట్లు చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా విశ్వ విజయ శతకం ఈవెంట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''మా పిల్లలు హన్షిత, హర్షిత్ నిర్మించిన తొలి సినిమానే వంద అంతర్జాతీయ అవార్డులు సాధించడం గొప్ప విషయం. పెద్ద బడ్జెట్‌తో రాజమౌళి తీసిన 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్'లకు ప్రపంచ వ్యాప్తంగా పేరొచ్చింది. కానీ 'బలగం' చిన్న ఊర్లో నేటివిటీతో తీశాం. అంతర్జాతీయంగా వంద అవార్డులు వచ్చాయి. ఇటీవల హిట్టయిన 'సామజ వరగమన', 'బేబీ' వంటి చిత్రాలతో చిన్న, ఫ్యామిలీ చిత్రాలు ఆడతాయనే నమ్మకం మళ్లీ వచ్చింది. కొత్త ఊపిరి వచ్చినట్లయింది'' అన్నారు. ''బలగం' తెలంగాణ సినిమాగా ప్రచారమైంది. కానీ తెలుగు సినిమా'' అన్నారు వేణు. ''నేను, అన్న నిర్మించిన తొలి చిత్రానికి వంద అంతర్జాతీయ అవార్డులు రావడం హ్యాపీ'' అన్నారు హన్షిత.

భావి తరాలకు చరిత్ర తెలియాలి

– మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు



విశ్వేశ్వర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, విద్యాసాగర్‌రావు, బండి సంజయ్

బాబీ సింహా, వేదిక, అనిష్క త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, ప్రధాన పాత్రల్లో యాటా సత్యానారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణ రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'రజాకర్'. ఈ సినిమా పోస్టర్ లాంచ్ ఈవెంట్‌లో మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు మాట్లాడుతూ– ''హైదరాబాద్‌లో 8, మహారాష్ట్రలో 5, కర్ణాటకలో 3 జిల్లాలు హైదరాబాద్ సంస్థానంగా ఉండేవి. ఇవన్నీ ఓ దేశంగా ఉండాలంటూ బ్రిటిష్ ప్రభుత్వం చట్టాన్ని విడుదల చేసిన కారణంగా నిజాం ప్రభువు స్వతంత్ర్య రాజ్యంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. అతనికి బలంగా దాదాపు 2 లక్షల మంది రజాకార్స్ సైన్యంగా ఏర్పడి, ఆకృత్యాలు చేశారు. ఈ చరిత్ర భావి తరాలకు తెలియాలి. ఇలాంటి చరిత్రతో రూపొందిన 'రజాకర్' చిత్రాన్ని ప్రోత్సహించాలి'' అన్నారు. ''ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వస్తే, హైదరాబాద్‌కు వచ్చింది సెప్టెంబరు 17న. ఈ చరిత్ర తెలియజేసే ప్రయత్నమే ఈ సినిమా'' అన్నారు కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్. ''రజాకార్' సినిమా చూడకపోతే మన బతుక్కే అర్థం లేదు'' అన్నారు యాటా సత్యనారాయణ. ''తెలంగాణవాదిగా నా హక్కుగా, భారతీయుడిగా భావించి ఈ సినిమా చేశాను'' అన్నారు నారాయణ రెడ్డి.

కలియుగం పట్టణంలో...



'కలియుగం పట్టణంలో..' పోస్టర్ లాంచ్‌లో ఓ దృశ్యం

విశ్వ కార్తికేయ, ఆయుషి పటేల్ జంటగా రమాకాంత్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'కలియుగం పట్టణంలో..'. డా. కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, గడ్డం మహేశ్వర రెడ్డి, కాటం రమేష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం పోస్టర్‌ను ఏపీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

హిట్ కాంబో రిపీట్



విశాల్, హరి

'తామిర భరణి (భరణి), పూజై' (పూజ) వంటి హిట్ చిత్రాల తర్వాత హీరో విశాల్– దర్శకుడు హరి కాంబినేషన్‌లో మరో సినిమా షూటింగ్ ఆరంభమైంది. స్టోన్ బెంచ్ ఫిల్మ్స్ – జీ స్టూడియోస్ సౌత్ సంస్థలు నిర్మిస్తున్న ఈ చిత్రానికి అలంకార్ పాండియన్ సహనిర్మాత. ''రేసీ స్క్రీన్‌ప్లేతో సినిమాలు తీయడంలో హరి, యాక్షన్ ప్యాక్డ్ పాత్రలు చేయడంలో విశాల్ పేరు పొందారు. ఈ హిట్ కాంబోలో సినిమా చేయడం ఎగ్జయిటింగ్‌గా ఉంది'' అన్నారు నిర్మాత కార్తికేయన్ సంతానం.

ఈ సినిమాతో స్టార్‌డమ్ ఖాయం

– నందితా శ్వేత



''స్టార్‌డమ్ అనేది నా చేతుల్లో లేదు. నాకు వచ్చిన పాత్రలకు న్యాయం చేయడంపైనే దృష్టి పెట్టాను. వైవిధ్యమైన పాత్రలు చేశాను. 'హిడింబ'తో నాకు స్టార్‌డమ్ ఖాయం అనే నమ్మకం ఉంది'' అన్నారు నందితా శ్వేత. అశ్విన్‌బాబు హీరోగా అనిల్ కన్నెగంటి దర్శకత్వంలో అనిల్ సుంకర సమర్పణలో గంగపట్నం శ్రీధర్ నిర్మించిన చిత్రం 'హిడింబ'. ఈ సినిమా ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ నందితా శ్వేత మాట్లాడుతూ– ''హిడింబ'లో ఆద్యా అనే పోలీసాఫీసర్ పాత్రలో కనిపిస్తాను. నా పాత్ర హీరో పాత్రకు సమానంగా ఉంటుంది. ఇక దాదాపు నాలుగేళ్లుగా కండరాలకు సంబంధించిన ఫైబ్రోమాల్జియాతో ఇబ్బందిపడుతున్నాను. దీని వల్ల భారీగా కసరత్తులు, డైట్ చేయకూడదు. నిద్రలేమి ఉండకూడదు. కానీ 'హిడింబ' కోసం ఇవన్నీ జరిగాయి. ఆ విధంగా కొంత స్ట్రగుల్ అయ్యాను. నేను చేసిన 'మంగళవారం', ఓ మంచి ఘోస్ట్' చిత్రాలు రిలీజ్‌కు రెడీ అవుతున్నాయి. తెలుగులో ఒకటి, తమిళంలో మూడు సినిమాలు చేస్తున్నాను'' అని అన్నారు.

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

రోడ్డుపై రూ.30 లక్షల విలువైన టమాటా

- టమాటా లారీ బోల్తా
- రోడ్డుపై పడిపోయిన 18 టన్నుల పంట
- ఎత్తుకెళ్లేందుకు వచ్చిన స్థానికులు..
- టమాటాకు రక్షణగా పోలీసులు

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ జిల్లా మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మావల శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం టమాటా లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడింది. ద్విచక్రవాహనాన్ని తప్పించబోతూ వాహనం అదుపు తప్పి బోల్తాపడినట్లు లారీ డ్రైవర్ తెలిపాడు. దీంతో అందులోని రూ.30 లక్షల విలువైన 18 టన్నుల టమాటాలన్నీ రోడ్డుపై పడిపోయాయి. ప్రస్తుతం టమాటా ధర ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో వాటిని ఎత్తుకెళ్లడానికి స్థానికులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో డ్రైవర్ అప్రమత్తమై పోలీసులకు చెప్పాడు. పోలీసులు వచ్చి, స్థానికులను వెళ్లగొట్టి అక్కడ రక్షణగా నిలిచారు. ఈ లారీ కర్ణాటకలోని కొలార్ నుంచి ఢిల్లీకి వెళ్తుండగా మార్గమధ్యలోని మావల్ వద్ద బోల్తాపడింది. సంఘటన స్థలంలో రాత్రి 11.30 గంటల వరకు ఏఎస్సై సురేందర్ ఆధ్వర్యంలో ఎనిమిది మంది పోలీసులతో భద్రత కొనసాగింది. అప్పటి వరకు టమాటాను మరో వాహనంలోకి లోడ్ చేసే పనులు కొనసాగాయి. మరోపక్క ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పడం గమనార్హం.

ట..'మాట వినదు'

- కేజీ ధర రూ.200
- పచ్చిమిర్చి రూ.160



ధారూరు మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ధారూరు: టమాటా.. పచ్చిమిర్చి ధరలు శనివారం భగ్గుమన్నాయి. వికారాబాద్ జిల్లా ధారూరు మార్కెట్‌లో కిలో టమాటా రూ.200కు విక్రయించారు. పచ్చిమిర్చి కిలో రూ.160 పలికింది. వీటి ధరలు చూసి వినియోగదారులు తారెత్తిపోయారు.

'పోడు' పట్టాదారుల్లో అనర్హులెందరు?

- అటవీ భూములే ఆధారం కాకుండా ఇతర వ్యాపకాల్లో ఉన్నదెవరు?
- ఫిర్యాదుల నేపథ్యంలో విచారణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ
- రాష్ట్రవ్యాప్తంగా 96.71 శాతం పట్టాల పంపిణీ పూర్తి



సాక్షి, హైదరాబాద్: పోడుభూముల్లో సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టా పుస్తకాల పంపిణీ ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా 1,51,146 మంది పోడు రైతులను ఖరారు చేసిన రాష్ట్ర ప్రభుత్వం... గత నెల 27 నుంచి పట్టా పుస్తకాల పంపిణీని ప్రారంభించింది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రానికి 1,46,183 మంది పోడు రైతులకు పట్టా పుస్తకాలు పంపిణీ చేశారు. అంటే 96.71 శాతం విజయవంతంగా పూర్తి చేశారు. మరో 4,963 మందికి ఒకట్రెండు రోజుల్లో పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. అయితే ఇప్పటివరకు పట్టాపుస్తకాలు పొందిన వారిలో పలువురు అనర్హులు ఉన్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అటవీభూమిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికే పోడు పట్టాకు అర్హతగా ప్రభుత్వం ప్రాథమిక నిబంధనను పెట్టింది. అయితే పట్టాలు పొందిన వారిలో పలువురు అటవీ భూమి సాగుపైనే కాకుండా ఇతరత్రా వ్యాపకాలున్నాయంటూ క్షేత్రస్థాయిలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై విచారణ చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ నిర్ణయించింది.

పునఃపరిశీలన

రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో పోడు భూముల సాగుకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. వీటి పరిశీలనకు గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో నాలుగు అంచెల్లో దరఖాస్తులను పరిశీలించి అర్హతలను ఖరారు చేశారు. ఎనిమిది నెలలపాటు ఈ ప్రక్రియ కొనసాగింది. దరఖాస్తు పరిశీలన సమయంలో అర్జీదారుడు గిరిజనుడా? కాదా? అనే అంశాన్ని పరిశీలించిన అధికారులు... సదరు అర్జీదారుడు ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్నాడా? ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడా? లేక అటవీభూమిని మాత్రమే సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నాడా? అనే కోణంలో పరిశీలన చేయలేదు. దీంతో పోడు అర్హుల్లో పలువురు ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, వ్యాపారులు ఉన్నట్లు వెలుగు చూస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పంపిణీ చేసిన దరఖాస్తులను, పట్టా పుస్తకాలు పొందిన వారి వివరాలను పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఈమేరకు సంబంధిత 26 జిల్లాల కలెక్టర్లను పునఃపరిశీలించాలని ఆదేశించింది. మరో వైపు నిర్మల్, మహబూబాబాద్ జిల్లాల్లో ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న వారికి పట్టాలు దక్కినట్లు వార్తలు రావడంతో గిరిజన సంక్షేమ శాఖ ఆ రెండు జిల్లాల కలెక్టర్లకు ప్రత్యేకంగా విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని గిరిజన శాఖ పేర్కొంది.

9 జిల్లాల్లో పూర్తి

భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్, ములుగు, రాజన్న సిరిసిల్ల, వనపర్తి, హనుమకొండ, జగిత్యాల, పెద్దపల్లి, నారాయణపేట్ జిల్లాల్లో వందశాతం లక్ష్యం పూర్తయింది. మిగతా జిల్లాల్లో లక్ష్యసాధన దాదాపు పూర్తయింది. సూర్యాపేట జిల్లాలో మొత్తం 84 మంది అర్హులు, మహబూబ్‌నగర్ జిల్లాలో 19 మంది అర్హులు ఉండగా... ఒక్కరికీ పట్టా ఇవ్వకపోవడం గమనార్హం.

భూదాన్ భూముల్లో ఉద్రిక్తత



గుడిసెలు తొలగించేందుకు వస్తున్న జేసీబీకి అడ్డంగా పడుకున్న మహిళలు

- ఖమ్మంలోని వెలుగుమట్లలో వెలసిన వందల గుడిసెలు
- తొలగించేందుకు వెళ్లిన అధికారుల అడ్డగింత
- పోలీసుల పహారాలో ఆక్రమణలు తొలగింపు

ఖమ్మం అర్బన్: భూదాన్ భూముల్లో పేదలు ఇళ్ల స్థలాల కోసం రాత్రికి రాత్రే గుడిసెలు, రేకుల షెడ్లు వేయడం, ఉదయమే పోలీసులు వీటిని తొలగించడం.. వరస ఘటనలు ఉద్రిక్తతకు దారి తీశాయి. ఖమ్మం నగరం వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 147, 148, 149లోని భూదాన్ భూముల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల నుంచి వచ్చిన వేలాది మంది ఆక్రమించి శుక్రవారం రాత్రి వందల సంఖ్యలో గుడిసెలు వేశారు. శనివారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన రెవెన్యూ, పోలీసులు తొలగించేందుకు చేరుకోగా వేలాది మంది ఆందోళనకారులు అడ్డుకున్నారు. భూదాన్ భూముల కింద ప్రభుత్వం తమకు కేటాయించినందున ఇక్కడి నుంచి కదిలేది లేదన్నారు.

కర్రలతో అధికారులను అడ్డుకుని..

గుడిసెల తొలగింపునకు యత్నించిన యంత్రాంగాన్ని కర్రలతో అడ్డుకున్నారు. దీంతో అదనపు కలెక్టర్ మధుసూదన్ ఆందోళనకారుల ప్రతినిధులతో రెండు గంటలకుపైగా చర్చించారు. పత్రాలు ఉంటే చూపించి నివాసాలు ఏర్పరుచుకోవాలని, లేకపోతే శాంతియుతంగా ఇక్కడ నుంచి వెళ్లాలని సూచించారు. సాయంత్రంలోగా ఖాళీ చేయకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినా వారు కదలకపోవడంతో సీపీ విష్ణు ఎస్. వారియర్ సహా పోలీసు బలగాలు భారీగా చేరుకుని జేసీబీలతో గుడిసెలను తొలగించారు.

గూడు ఆశ చూపారంటూ.. విలపించిన బాధితులు

భూదాన్ భూముల్లో ఇళ్ల నిర్మాణానికి స్థలం ఇప్పిస్తామని నమ్మించిన కొందరు డబ్బులు వసూలు చేశారని ఆందోళనకారులు కొందరు విలపించారు. గుడిసెలు వేసుకునేందుకు నాలుగేళ్ల క్రితం రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేసినట్లు ప్రచారం జరిగింది. అధికారులు వారి వివరాలను సేకరించే పనిలో పడ్డారు.

ఆక్రమిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

భూదాన్ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని, ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ హెచ్చరించారు. ఆక్రమణదారులపై, వారిని ప్రోత్సహించిన వారిపై భూఆక్రమణ, క్రిమినల్ కేసులతో పాటు పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు.

చట్టాలపై ప్రతి మహిళకు అవగాహన ఉండాలి

- ఆస్తి హక్కుతో మహిళల్లో ఆత్మ స్థైర్యం
- దుర్గాబాయి దేశ్‌ముఖ్ జీవితం స్ఫూర్తిదాయకం
- తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి



నల్లకుంట: మహిళల కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయని, ఆ చట్టాలపై ప్రతి మహిళకు అవగాహన అవసరమని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ జి.రాధారాణి అన్నారు. ప్రముఖ సంఘ సేవకురాలు దుర్గాబాయి దేశ్ ముఖ్ జీవితం మహిళలందరికీ స్ఫూర్తిదాయకం, ఆదర్శనీయమని చెప్పారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతిని పురస్కరించుకుని శనివారం నల్లకుంటలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ 36వ స్మారకోపన్యాసంలో ఆమె మాట్లాడారు. ''మహిళల చట్టపరమైన సామర్థ్యాలు-సామాజిక అడ్డంకులు'అనే అంశంపై మాట్లాడుతూ.. చదువు పట్ల ఆడ పిల్లలకు నిర్లక్ష్యం వద్దని, మహిళలు విద్యావంతులైనప్పుడే ఉద్యోగావకాశాలు, సాధికారత వస్తాయని, తద్వారా జీవితాలు మెరుగుపడతాయని చెప్పారు. దేశంలో ఇప్పటికీ చాలా చోట్ల మహిళలంటే చులకన భావంతో తల్లి గర్భంలో ఉండగానే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంకా చాలా చోట్ల మహిళలపై దాడులు, గృహ హింసలకు అడ్డుకట్ట వేయలేకపోవడం బాధాకరమన్నారు. నేటికీ చాలా ప్రాంతాలలో బాల్య వివాహాలు జరుగుతూనే ఉండడం శోచనీయమన్నారు.

నేటికీ ఆస్తిహక్కు ఎండమావిగానే

సమాజం ఎంతో అభివృద్ధి చెందుతున్నప్పటికీ నేటికీ మహిళలకు ఆస్తి హక్కు అనేది ఎండమావిలాగే కనిపిస్తోందని జస్టిస్ డాక్టర్ జి.రాధారాణి వ్యాఖ్యానించారు. ఆస్తి హక్కు కారణంగా మహిళల్లో ఆత్మ స్థైర్యం పెరిగి తమ బిడ్డలకు మంచి భవిష్యత్ ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆర్థికంగా ఒకరిపై ఆధారపడే స్త్రీలకు సమాజంలో సరైన గౌరవం లభించదన్నారు. ఎప్పుడూ మహిళలు ఇతరుల సహాయం కోరడం, ఒకరిపై ఆధారపడటం కూడదన్నారు. సావిత్రీబాయి పూలే స్త్రీ విద్య కోసం బీజాలు వేస్తే దుర్గాబాయి దేశ్‌ముఖ్ వృక్షాలుగా మార్చారని ఆమె పేర్కొన్నారు. నాడు ఆ మహోన్నత మహిళలు వేసిన బీజాల కారణంగానే తాను ఆ రోజు ఈ స్థాయికి రాగలిగానన్నారు. కార్యక్రమంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ(ఏఎంఎస్) అధ్యక్షురాలు ఎస్.ఉషా రెడ్డి, మహిళా లా కళాశాల కార్యదర్శి జి. సేతు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

దళితుడినైనందునే హైకోర్టు జడ్జి కానివ్వలేదు

- ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్
- రాష్ట్రపతి, గవర్నర్, సీజేఐలను ప్రతివాదులుగా తొలగించి నంబర్ చేయాలని రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తాను దళితుడినైనందునే హైకోర్టు న్యాయమూర్తి కాకుండా అడ్డుకున్నారని జగిత్యాల జిల్లా మాజీ అడిషనల్ జడ్జి రజన్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌లో.. ప్రతివాదులను మార్పు చేసి నంబర్ చేయాలని రిజిస్ట్రీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ప్రతివాదులైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సీబీఐకి నోటీసులు జారీ చేస్తామని స్పష్టం చేసింది. తనపై వచ్చిన ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు కోరుతూ రజన్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ తాత్కాలిక సీజే జస్టిస్ నవీన్‌రావు, జస్టిస్ భీమపాక నగేశ్ ధర్మాసనం ముందుకు వచ్చింది. న్యాయమూర్తుల నియామకాల్లో ఎస్సీలకు రిజర్వేషన్ ఇవ్వాలని తాను హైకోర్టులో పిటిషన్ వేశానని, ఇది సహించలేని కొందరు తనపై తప్పుడు ఆరోపణలు చేసి పదవీ విరమణ పొందేలా చేశారని, సీబీఐ దర్యాప్తు చేస్తే వాస్తవాలు బయటికి వస్తాయన్నారు. దీనిపై హైకోర్టు త్వరలో విచారణ జరపనుంది.

ఉపా కేసులను ఎత్తివేయాలి: ప్రొ.హరగోపాల్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విమలక్క, మోహన్ బైరాగి, పీవోడబ్ల్యూ సంధ్య, ప్రొఫెసర్ కాశీం తదితర ప్రజా కళాకారులు, మేధావులు, రచయితలపై పెట్టిన ఉపా కేసులను బేషరతుగా ఎత్తివేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య(ఏసీఎఫ్) ఆధ్వర్యంలో ప్రజా కళాల-గళాల గర్జన పేరిట సదస్సును నిర్వహించారు. అంతకు ముందు పార్కు నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు, అక్కడినుంచి వీఎస్‌టీ మీదుగా మళ్లీ సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు ఆటాపాటలు, డప్పు వాయిద్యాలతో ర్యాలీ నిర్వహించారు. సదస్సులో మొదట ఆడియో, వీడియో పాటల సీడీలను ఆవిష్కరించారు. అనంతరం ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ మలి దశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రజా కళాకారులపై రాజద్రోహం కేసులను పెట్టడం బాధాకరమన్నారు. రాష్ట్ర సాధనలో ముందున్న విమలక్క లాంటి కళాకారులను జైలులో పెట్టాలని చూడటం, ఉద్యమ పార్టీ అని చెప్పుకొనే బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చినా ఉద్యమకారులపైన కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్యని మండిపడ్డారు. ప్రజా కళాకారులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, హక్కుల నేతలతో పాటు మొత్తం 152 మందిపై పెట్టిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. సినీ దర్శకుడు బాబ్జీ మాట్లాడుతూ కళాకారులపై రాజద్రోహం కేసులు పెట్టడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో మోహన్ బైరాగి, పీవోడబ్ల్యూ సంధ్య, భూపాల్, శ్రీనివాస్, ప్రొ. జయధీర్ తిరుమలరావు, ప్రొ.కట్టా భగవంత్‌రెడ్డి, కవి, గాయకుడు జయరాజు, అంబటి నాగన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా...

వైద్యశాఖలో కాంట్రాక్టు పోస్టుల కొనసాగింపు

- 4,157 మంది సిబ్బంది సర్వీసు వచ్చే ఏడాది మార్చి 31 వరకు పొడిగింపు
- 8,853 మంది ఔట్‌సోర్సింగ్, 2,793 మంది గౌరవవేతన సిబ్బందికి కూడా...

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, గౌరవ వేతన కేటగిరీలో పనిచేసే 15,803 మంది సిబ్బంది సేవలను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్నవారి సర్వీసులను వచ్చేఏడాది మార్చి 31 వరకు పొడగిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వుల మేరకు 4,157 మంది కాంట్రాక్టు సిబ్బంది, 8,853 మంది ఔట్‌సోర్సింగ్, 2,793 మంది గౌరవవేతనం ప్రాతిపదికన పనిచేసే ఉద్యోగుల పోస్టులు మరో ఏడాదిపాటు కొనసాగనున్నాయి. ఇందులో డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, సైంటిస్టులు, మైక్రో బయాలజిస్టులు, ల్యాబ్ రీసెర్చ్ సిబ్బంది ఉన్నారు. వీటితో 532 మంది సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల సర్వీసులను కూడా ఈ ఏడాది మార్చి 31 వరకు కొనసాగిస్తూ గతంలో తీసుకున్న నిర్ణయానికి ఆమోదం తెలుపుతున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందులో సంగారెడ్డి, మహబూబాబాద్, మంచిర్యాల, వనపర్తి, కొత్తగూడెం, జగిత్యాల, నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాలల్లో 76 మంది చొప్పున రెసిడెంట్ డాక్టర్లున్నారు.

విపత్తు సహాయక చర్యలకు ఎస్‌డీఆర్‌ఎఫ్

- 50 మంది సిబ్బందితో స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్
- ప్రభుత్వానికి అగ్నిమాపక శాఖ ప్రతిపాదనలు

సాక్షి, హైదరాబాద్: ప్రకృతి వైపరీత్యాల సమయంలో హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టి.. బాధితులను కాపాడటంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలు కీలకంగా ఉన్నాయి. అలాంటి ప్రత్యేక దళం రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవలశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. రాష్ట్ర స్థాయిలో మొత్తం 50 మంది సిబ్బందితో ఎస్‌డీఆర్‌ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్టు అధికారులు తెలిపారు. ఎలాంటి అదనపు పోస్టులు, ఆర్థిక భారం లేకుండా ప్రస్తుత అగ్నిమాపకశాఖ సిబ్బందితోనే ఎస్‌డీఆర్‌ఎఫ్‌ను ఏర్పాటు చేయాలని సూచించినట్టు తెలిసింది. నేషనల్ డిజాస్టర్ మేనేజిమెంట్ యాక్ట్, 2005 కింద ఎస్‌డీఆర్‌ఎఫ్‌ను ఏర్పాటు చేయవచ్చని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సహా 24 రాష్ట్రాల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు విధుల్లో ఉన్నాయి.

ప్రభుత్వ ఉపాధ్యాయుల సెలవులు కంప్యూటరీకరణ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉపాధ్యాయుల సెలవులను కంప్యూటరీకరించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతి ఉపాధ్యాయుడు ఈ ఏడాది జనవరి నుంచి జూన్ నెలాఖరు వరకు ఎన్నిరకాల సెలవులు వినియోగించుకున్నారో వివరాలను సేకరించి వాటిని పాఠశాల విద్యాశాఖకు సమర్పించాలని కాంప్లెక్స్ హెడ్మాస్టర్లను ఆదేశించింది. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని అన్ని ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఈ ఏడాది జనవరి నుంచి జూన్ నెలాఖరు వరకు వినియోగించుకున్న సెలవుల వివరాలను తక్షణమే సమర్పించాలని తెలిపింది.అదేవిధంగా ఉపాధ్యాయుల లీవ్స్ రిజిస్టర్‌ను స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మాత్రమే నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

రెగ్యులర్ ఉద్యోగులను బదిలీ చేయండి


సీఎం కేసీఆర్‌కు లేఖ రాసిన టీఐజీఎల్‌ఏ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులను (టీచింగ్–నాన్ టీచింగ్) బదిలీ చేయాలని తెలంగాణ ఇంటర్మీడియట్ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్(టీఐజీఎల్‌ఏ) కోరింది. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు టీఐజీఎల్‌ఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జంగయ్య, రామకృష్ణగౌడ్ లేఖ రాశారు. గత ఐదేళ్ల నుంచి బదిలీలు చేయకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వానికి అనేక సార్లు విన్నవించామన్నారు. సాధారణ బదిలీలకు అవకాశం లేకపోతే ఉద్యోగులు నష్టపోతారని ఆ లేఖలో పేర్కొన్నారు.

గెస్ట్ అధ్యాపకులను రెన్యువల్ చేయాలి

సాక్షి, హైదరాబాద్: జూనియర్ కాలేజీల గెస్ట్ అధ్యాకులను రెన్యువల్ చేయాలని సీఎం కేసీఆర్‌ను తెలంగాణ ఆత్మ గౌరవ వేదిక అధ్యక్షురాలు ఇందిరాశోభన్ డిమాండ్ చేశారు. వారంతా సకాలంలో జీతాలు లేక, భయం భయంగా బతుకుతున్నారని శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రెన్యువల్ చేస్తారో లేదో అనే అయోమయ స్థితిలో కాలేజీలకు వెళ్తూ అప్పులు చేసుకొని దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని పేర్కొన్నారు.

చరిత్ర పునరావృతమైనది




యమునా నదిలో నీటిమట్టం ఎన్నడూ లేనంతగా పెరిగి.. ఢిల్లీని వరద ముంచెత్తింది. అలాగే చారిత్రక ఎర్రకోట కూడా ముంపు బారిన పడింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో హిస్టరీ రిపీట్ అయిందంటూ పలువురు అప్పటి తైల వర్ణచిత్రాలను, ప్రస్తుత పరిస్థితితో పోల్చి చూపిస్తూ.. ఫొటోలను షేర్ చేశారు. నిజానికి ఒకప్పుడు ఎర్రకోట చుట్టూ ఉండే భారీ కందకంలో యమునా నది ప్రవహించేది. ఈ నది అప్పట్లో కోటకు సహజ రక్షణ కవచంగా ఉండేది. తర్వాత ఆక్రమణలు, భవనాల నిర్మాణంతో నది పరిధి తగ్గిపోవడమే కాకుండా.. దాని సహజ ప్రవాహ మార్గాన్ని కూడా కోల్పోయింది. మళ్లీ ఇన్నాళ్లకు యమున తన సహజ ప్రవాహమార్గంలో ప్రవహించిందంటూ పలువురు కామెంట్లు పెట్టారు.

'దశాబ్దాలు, శతాబ్దాలు గడిచిపోయినా.. నది ఏదీ మరిచిపోదు.. తన సామ్రాజ్యాన్ని తిరిగి సొంతం చేసుకోవడానికి అది తిరిగి వస్తుంది' అని ఒక నెటిజన్ వ్యాఖ్యానించారు.

కొత్త పీఆర్‌సీ ఏర్పాటు చేయాలి



ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

- 18,19 తేదీల్లో బైక్ ర్యాలీలు.
- ఆగస్టు 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు.
- సెప్టెంబర్ 1న చలో హైదరాబాద్

సాక్షి, హైదరాబాద్: పాలకులు తక్షణమే కొత్త వేతన సవరణ సంఘాన్ని నియమించాలని, జూలై ఒకటో తేదీతో వర్తించేలా కరువు భత్యం ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూయూఎస్పీసీ) డిమాండ్ చేసింది. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల కోసం పోరుబాట పట్టాలని నిర్ణయించింది. దశల వారీగా పోరాట కార్యాచరణను స్టీరింగ్ కమిటీ ప్రకటించింది. ఈనెల 18, 19 తేదీల్లో మండలాల్లో బైక్ ర్యాలీలు. ఆగస్టు 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు చేపడతామని, సెప్టెంబర్ 1 న చలో హైదరాబాద్ పేరిట రాష్ట్ర స్థాయి ఆందోళన నిర్వహిస్తామని వెల్లడించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొంది. శనివారం టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో యూయూఎస్పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి నెల మొదటి తేదీనే వేతనాలు ఇవ్వాలని, ట్రెజరీల్లో ఆమోదం పొంది ప్రభుత్వం వద్ద నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న సప్లిమెంటరీ బిల్లులు, సెలవు జీతాలు, జీపీఎస్, జీఎస్ జీఎల్ఐ క్లైములు, పెన్షనరీ బెనిఫిట్స్, బీఆర్సీ బకాయిలు తదితర బిల్లులు వెంటనే విడుదల చేయాలని, ఇహెచ్ఎస్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని యూయూఎస్పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు.

తక్షణమే ఉద్యోగాలు.. పదోన్నతులివ్వాలి


రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వేలాది ఉపాధ్యాయ పోస్టులను బదిలీలు, పదోన్నతులు, నియామకాల ద్వారా వెంటనే భర్తీ చేయాలని, తాత్కాలిక ప్రయోజనాల కోసం హడావుడిగా అప్ గ్రేడ్ చేసిన పండిట్, పీఈటీ పోస్టులపై నెలకొన్న వివాదాన్ని త్వరగా పరిష్కరించి వారికి న్యాయం చేయాలని కోరారు. పర్యవేక్షణాధికారుల పోస్టులను అవసరం మేరకు మంజూరు చేసి రెగ్యులర్ నియామకాలు చేపట్టాలని, పాఠశాలల్లో సర్వీస్ పర్సన్స్ ను నియమించాలని, మౌలిక వసతులు కల్పించాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు శ్రమకు తగిన వేతనాలు ఇవ్వాలని కోరారు. జీఓ 317 అమలు కారణంగా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులను వారి స్వంత జిల్లాలకు బదిలీ చేయాలని స్టీరింగ్ కమిటీ సభ్యులు కె జంగయ్య, చావ రవి (టీఎస్ యూటీఎఫ్), వై అశోక్ కుమార్, పి నాగిరెడ్డి(టీపీటీఎఫ్), ఎం సోమయ్య, టి లింగారెడ్డి(డీటీఎఫ్), యు పోచయ్య, డి సైదులు (ఎస్టీఎఫ్ టీఎస్), సయ్యద్ షౌకత్ అలీ (టీఎస్ పిటిఏ), కొమ్ము రమేష్, ఎన్ యాదగిరి (బీటీఎఫ్), బి కొండయ్య (టీఎస్ ఎంఎస్టీఎఫ్), ఎస్ హరికృష్ణ, వి శ్రీను నాయక్ (టీటీఏ), జాదవ్ వెంకట్రావు (ఎస్సీ ఎస్టీ టీఏ), వై విజయకుమార్ (ఎస్సీ ఎస్టీ యూఎస్ టీఎస్) డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోనూ సిపిఎస్ రద్దు చేయాలని, 2004 సెప్టెంబర్ 1కి ముందు నియామక ప్రక్రియ ప్రారంభమై ఆ తర్వాత నియామకాలు జరిగిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని స్టీరింగ్ కమిటీ సభ్యులు కోరారు.

విశ్వం ముందుకు | మన ధూళికట్ట, ఫణిగిరి శిల్పాలు

- న్యూయార్క్ మెట్రోపాలిటన్ మ్యూజియంలో రేపటి నుంచి ప్రదర్శన
- ఆహ్వాన బ్రోచర్ కవర్ పేజీపై ధూళికట్టలో దొరికిన నాగముచలింద చిత్రం



ఫణిగిరిలో లభించిన బౌద్ధ స్తూప ద్వార తోరణం



ఆహ్వాన బ్రోచర్‌పై నాగముచలింద శిల్ప చిత్రం

సాక్షి, హైదరాబాద్: ఇది అమెరికాలోని ప్రధాన నగరం న్యూయార్కు మెట్రోపాలిటన్ మ్యూజియం ముద్రించిన ఆహ్వాన బ్రోచర్ కవర్ పేజీ.. బౌద్ధంలో ఎంతో ప్రాధాన్యం ఉన్న నాగముచలిందను అందంగా చెక్కిన శిల్పం ఫొటో ఒక్కసారి పరిశీలనగా చూడండి. ప్రస్తుత పెద్దపల్లి జిల్లా ధూళికట్టలో పురావస్తు శాఖ జరిపిన తవ్వకాల్లో వెలుగుచూసిన సున్నపురాయి శిల్పం అది.

➡ న్యూయార్క్ మెట్రోపాలిటన్ మ్యూజియం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏకంగా నాలుగు నెలల పాటు నిర్వహిస్తున్న అంతర్జాతీయ ప్రదర్శనకు సంబంధించిన ఆహ్వాన పత్రిక ముందు పేజీలో.. 2 వేల ఏళ్ల కింద చెక్కిన ఈ మూడడుగుల ఎత్తు ఉన్న శిల్పం ఫొటోను ప్రధాన ఆకర్షణగా ముద్రించింది. రెండో పేజీలో తెలంగాణకే చెందిన మరో శిల్పానికి సంబంధించిన చిత్రాన్ని ముద్రించింది. సూర్యాపేట జిల్లా ఫణిగిరి బౌద్ధస్తూపం వద్ద లభించిన ద్వార తోరణంలోని బుద్ధుడి జీవితాన్ని ప్రతిబింబించేలా చెక్కిన భాగానికి సంబంధించిన చిత్రాన్ని ముద్రించింది. ఆహ్వాన బ్రోచర్లను ప్రపంచవ్యాప్తంగా ప్రముఖులకు పంపారు.

రేపే ప్రారంభం.. నాలుగు నెలలపాటు ప్రదర్శన

న్యూయార్క్ మెట్రోపాలిటన్ మ్యూజియంలో నిర్వహించే ప్రదర్శనలు, సింపోజియంలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. ఈ క్రమంలో 'ది ట్రీ అండ్ సర్పెంట్.. ఎర్లీ బుద్దిస్ట్ ఆర్ట్' పేరుతో బుద్ధుడి జీవిత గాథలను ప్రతిబింబించే శిల్పాలతో భారీ అంతర్జాతీయ ప్రదర్శనను ఏర్పాటు చేసింది. ఈనెల 17న ప్రారంభమయ్యే ఈ ప్రదర్శన నవంబరు 13వరకు కొనసాగుతుంది. ఈ ప్రదర్శనలకు ప్రపంచ వ్యాప్తంగా 140 బౌద్ధ శిల్పాలను ఆ మ్యూజియం ఎంపిక చేసుకుంది. అందులో 93 శిల్పాలు మన దేశం నుంచి వెళ్లాయి. తెలంగాణ నుంచి 8, ఆంధ్రప్రదేశ్ నుంచి 6 శిల్పాలున్నాయి.

కవర్ పేజీపై చిత్రం..కానీ..

ధూళికట్ట తవ్వకాల్లో వెలుగుచూసి ప్రస్తుతం కరీంనగర్ మ్యూజియంలో ఉన్న నాగముచలింద శిల్పం చిత్రాన్ని న్యూయార్క్ మ్యూజియం ప్రదర్శన ఆహ్వాన పత్రిక కవర్ పేజీపై ఒదిగిపోయినప్పటికీ, శిల్పం మాత్రం న్యూయార్క్‌కు వెళ్లలేదు. ఆ ప్రదర్శనకు తెలంగాణనుంచి తొలుత ఎంపిక చేసిన 9 శిల్పాల్లో ఇది కూడా ఉంది. దాన్ని న్యూయార్క్‌కు తరలించేందుకు ప్యాకింగ్ చేసే తరుణంలో నిశితంగా పరిశీలించగా, శిల్పంపై పగుళ్లు కనిపించాయి. దీంతో దాన్ని తరలిస్తే ముక్కలయ్యే ప్రమాదం ఉందని భయపడి చివరి నిమిషంలో ఆపేశారు. ఫలితంగా 8 శిల్పాలనే న్యూయార్క్‌కు తరలించారు. అక్కడికి వెళ్లలేకపోయినప్పటికీ, ఆ మ్యూజియం నిర్వాహకులు భారీ చిత్రాలతో దీని వివరాలను ప్రదర్శనలో ఉంచుతుండటం విశేషం.

బాధితులకు భరోసా..

లైంగిక దాడి బాధితుల జీవితాల్లో కొత్త వెలుగులు

- నచ్చిన వ్యాపారం చేసుకునేందుకు ప్రోత్సాహం
- 'వీ–హబ్'తో రాష్ట్ర మహిళా భద్రతా విభాగం ఒప్పందం



సాక్షి, హైదరాబాద్: ఎవరు అవునన్నా, కాదన్నా.. పురుషాధిక్య సమాజంలో మహిళలంటే చిన్నచూపే. లైంగిక దాడికి గురైన బాధితులంటే మరీనూ. బయటికొస్తే చాలు అవమానపు మాటలు, అనుమానపు చూపులతో బతకడమే వృథా అనే పరిస్థితులను అధిగమించి.. కొత్త జీవితాన్ని ప్రారంభించాలంటే ఎంతో మనోధైర్యం, భరోసా అవసరం. ఇలాంటివారి జీవితాల్లో వసంతాన్ని నింపేందుకు తెలంగాణ మహిళా భద్రతా విభాగం సరికొత్త కార్యక్రమానికి ప్రణాళిక రచిస్తోంది. బాధిత మహిళలు సొంతంగా వ్యాపారం చేసుకునేందుకు అవసరమైన ప్రోత్సాహాన్ని ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది. ఇందుకోసం మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ఇంక్యుబేటర్ వీ–హబ్‌తో చేతులు కలిపింది. బాధిత మహిళలకు జీవనోపాధికి అవసరమైన ఆర్థిక భరోసా, సాంత్వన అందించనుంది.

ఎంపిక ఎలా? ఎలాంటి వ్యాపారాలు?

మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో నడుస్తున్న భరోసా కేంద్రాల ద్వారా లైంగిక దాడికి గురైన బాధితులను ఎంపిక చేస్తారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పథకాలు గురించి వారికి అవగాహన కల్పిస్తారు. సొంతంగా వ్యాపారం, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్న ఆసక్తి, నైపుణ్యం ఉంటే.. వారితో మాట్లాడి, ఆలోచనలకు కార్యరూపంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తారు. వారి ఆర్థిక వనరుల గురించి అధ్యయనం చేసి, చేయూతనిస్తారు. స్వీట్లు, బిస్కెట్లు, చాక్లెట్లు, బేకరి ఉత్పత్తులు వంటి తినుబండారాల వ్యాపారం, బ్యూటీ పార్లర్, కుట్లు అల్లికలు, జ్యువెలరీ తయారీ వంటి చిన్న తరహా వ్యాపారాలు చేసుకునేందుకు సహకరిస్తారు.

వీ–హబ్ ఏం చేస్తుందంటే?

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఎదురయ్యే ప్రధాన ఇబ్బంది గుర్తింపు లేకపోవటమే. బాధిత ఎంటర్‌ప్రెన్యూర్లకు ఆ ఇబ్బంది ఉండదు. ఏ తరహా వ్యాపారానికి ఎలాంటి లైసెన్స్‌లు అవసరం దగ్గరి నుంచి డాక్యుమెంటేషన్, మార్కెటింగ్, పథకాలు, ఆర్థిక వనరుల వరకూ అన్ని వైపుల నుంచి సహాయసహకారాలు అందిస్తారు. వీ–హబ్ మెంటార్‌షిప్‌తో పాటు క్రెడిట్ లింకేజ్ కోసం రుణ దాతలు, రుణ గ్రహీతలను కలుపుతారు.

ప్రాథమిక దశలో ఉంది..

మహిళల భద్రతే షీ టీమ్స్, ఉమెన్ సేఫ్టీ వింగ్ తొలి ప్రాధాన్యం. లైంగిక దాడి బాధితులకు కావాల్సిన సహాయం చేసేందుకు నిత్యం సిద్ధంగా ఉంటాం. బాధిత మహిళలకు అండగా నిలవడం కోసం చేపట్టిన ఈ కార్యక్రమం ప్రస్తుతం ప్రారంభ దశలో ఉంది.

– శిఖా గోయల్, అదనపు డీజీ, ఉమెన్ సేఫ్టీ వింగ్

వందకు పైగా బాధితులకు శిక్షణ..

తొలి దశలో మేడ్చల్, వరంగల్ వంటి ఏడు జిల్లాల నుంచి వందకు పైగా బాధిత మహిళలను ఎంపిక చేసినట్లు తెలిసింది. తొలి సెషన్‌లో బాధితులు, వారి కుటుంబ సభ్యులతో చర్చించి, వారి వ్యాపార ఆలోచనల గురించి తెలుసుకున్నామని, ఆయా వ్యాపార అవకాశాలపై వారికి అవగాహన కల్పించామని వీ–హబ్ ప్రతినిధి ఒకరు తెలిపారు. త్వరలో రెండో సెషన్ నిర్వహించి, ఎవరు ఏ కేటగిరీ వ్యాపారాలకు సెట్ అవుతారో అధ్యయనం చేసి, ఎంపిక చేస్తామన్నారు.

ఫ్రాన్స్ ప్రథమ మహిళకు | పుట్టపాక చీర

దుబీయన్ చీరను బహూకరించిన ప్రధాని మోదీ • ప్రపంచ దేశాలకు మన చేనేత ఖ్యాతి



సంస్థాన్ నారాయణపురం: ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ సతీమణి, ఆ దేశ ప్రథమ మహిళ బ్రిగెట్టే మెక్రాన్‌కు పుట్టపాక చేనేత చీరను బహూకరించారు. కళాకారులు నేసిన దుబీయన్ సిల్కు చీరను చందనం పెట్టెలో పెట్టి అందజేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామ కళాకారుల నైపుణ్యంతో ఆకర్షణీయమైన రంగులో, అందమైన రాజస్తాన్ డిజైన్‌లో రూపొందించిన ఈ చీరను తెలంగాణ ప్రభుత్వ చేనేత సంస్థ 'టెస్కో' కొనుగోలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించింది.

ఫ్యాబ్రిక్ కూడా..



పుట్టపాకలో సుమారు 4వేల జనాభా ఉండగా, అందులో 300 మందికి పైగా చేనేత కళాకారులు ఉన్నారు. దుబీయన్ వస్త్రం డిజైన్ దేశంలో ఎక్కడా కనిపించదు. పుట్టపాక గ్రామంలోని ప్రతి చేనేత కళాకారుడు దుబీయన్ వస్త్రం నేస్తారు. దేశంలో చేనేత వస్త్ర తయారీలో అడ్డం ఇక్కత్ విధానం పాటిస్తున్నప్పటికీ దుబీయన్ వస్త్రం తయారీలో నిలువు ఇక్కత్ (వార్పుపై పొడుగు దారం) విధానం పాటిస్తారు. డిజైన్‌నూ నిలువు ఇక్కత్‌లోనే రూపొందిస్తారు. ఈ వస్త్రం తయారీలో వాడే దారాలు పలుచగా ఉంటాయి. దుబీయన్ డిజైన్‌తో చీరలు, ఫ్యాబ్రిక్ కూడా రూపొందిస్తారు. పుట్టపాక దుబీయన్ వస్త్రానికే కాకుండా.. ప్రాచీన కళ తేలియా రుమాల్ తయారీకీ ప్రసిద్ధి. తేలియా రుమాల్ తయారీలో అనేక మంది కళాకారులకు జాతీయ అవార్డులతో పాటు, ఇద్దరికి పద్మశ్రీలు కూడా వచ్చాయి.

గర్వంగా ఉంది

ఫ్రాన్స్ ప్రథమ మహిళకు మన ప్రధాని దుబీయన్ చీరను బహూకరించడం గర్వంగా ఉంది. ఈ రకంగా ప్రధాని పుట్టపాక గ్రామానికి గుర్తింపు ఇవ్వడం ఆనందంగా ఉంది. ఇలా చేయడం వల్ల చేనేత కళాకారులకు వృత్తి పట్ల మరింత బాధ్యత పెరుగుతుంది. నూతన డిజైన్లు రూపొందించడానికి కొత్త ఉత్సాహం వస్తుంది.

– గోలి సాంబయ్య, చేనేత కళాకారుడు, పుట్టపాక

ఉన్నత విద్యావంతులతోనే ఆర్థిక వ్యవస్థ బలోపేతం

- భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చైర్మన్ ఎస్.సోమనాథ్
- ఐఐటీహెచ్ 12వ స్నాతకోత్సవ కార్యక్రమానికి హాజరు



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్

సాక్షి హైదరాబాద్/ సంగారెడ్డి: హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 12వ స్నాతకోత్సవాలు శనివారం ఘనంగా మొదలయ్యాయి. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చైర్మన్ ఎస్.సోమనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో సుమారు 966 మంది విద్యార్థులు పట్టాలు పొందారు. ఈ సందర్భంగా సోమనాథ్ మాట్లాడుతూ, ఐఐటీ విద్యార్థులు తమ విద్యను దేశ, సమాజ సమస్యల పరిష్కారానికి ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఐఐటీ పట్టాలు పొందిన వారందరూ ఇప్పుడు వైజ్ఞానిక సమాజంలో ఉన్నత స్థాయికి చేరినట్లేనని, విద్యాభ్యాసం సందర్భంగా పొందిన జ్ఞానం, తెలివిని ఈ దేశం శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు ఉపయోగపడేలా చేయాలని కోరారు. హైదరాబాద్ ఐఐటీని ఇప్పటికీ రెండవ తరం ఐఐటీగా అభివర్ణిస్తుంటారని, అయితే అతితక్కువ కాలంలో ఈ సంస్థ సాధించిన విజయాలను దృష్టిలో ఉంచుకుంటే ఇకపై అలా పిలవాల్సిన అవసరం లేదని అన్నారు. ఐఐటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ డాక్టర్ బి.వి.ఆర్.మోహన్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ ఐఐటీ దేశంలోనే ఓ అత్యున్నతమైన విద్యాసంస్థగా ఎదిగిందని, సృజనాత్మకత ఆవిష్కరణలకు, అద్భుతమైన కోర్సులకు నెలవైందని ప్రశంసించారు.

అత్యున్నత విద్యాసంస్థల్లో ఐఐటీ హైదరాబాద్..

దేశంలోనే అత్యున్నత విద్యాసంస్థల్లో ఐఐటీ హైదరాబాద్ ఇప్పుడు మూడవ స్థానంలో నిలిచిందని, ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి తెలిపారు. 2022–23 సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను సమర్పించిన ప్రొఫెసర్ మూర్తి మాట్లాడుతూ హైదరాబాద్ ఐఐటీ ఇప్పటివరకూ 130 స్టార్టప్ కంపెనీలకు సాయం అందించిందని, వెయ్యికిపైగా ఉద్యోగాలు కల్పించిందని తెలిపారు. స్నాతకోత్సవంలో భాగంగా శనివారం మొత్తం 966 మంది విద్యార్థులకు 980 పట్టాలు అందించారు. అత్యున్నత ప్రతిభ కనబరిచినందుకుగాను కంప్యూటర్ సైన్స్ విద్యార్థి కె.కార్తీక్ బాలాజీకి ప్రెసిడెంట్స్ గోల్డ్ మెడల్ లభించింది. అలాగే ప్రతిభావంతులైన విద్యార్థులు నలుగురికి బంగారు పతకాలు, 38 మందికి వెండి పతకాలు ప్రదానం చేశారు.

ఓయూలో కాంట్రాక్ట్ అధ్యాపకుల మహా ధర్నా



12 యూనివర్సిటీల నుంచి హాజరైన అధ్యాపకులు

లాలాపేట (హైదరాబాద్): తమను రెగ్యులరైజ్ చేయాలంటూ ఓయూ క్యాంపస్‌లో శనివారం యూనివర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకులు తలపెట్టిన మహా ధర్నా విజయవంతం అయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 యూనివర్సిటీల నుంచి వందలాది మంది కాంట్రాక్టు అధ్యాపకులు ధర్నాకు హాజరయ్యారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ ఆర్ట్స్ కళాశాల ఎదుట కేసీఆర్ ఆంగ్ల అక్షరాల ఆకారంలో నిలబడి రెగ్యులరైజ్ చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ మహాధర్నాకు ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ జి.మల్లేశం హాజరై మద్దతు తెలిపారు. ఓయూ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పరశురాం, కార్యనిర్వాహణ చైర్మన్ ధర్మతేజ, కో చైర్మన్ రాందాస్ తదితరులు మాట్లాడుతూ ఇప్పటికైనా కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓయూ మ్యాథమెటిక్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ కిషన్ ధర్నాకు సంఘీభావం ప్రకటించారు. పీడీఎస్‌యూ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.